www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 4-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 246

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 1.11 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.15 తదుపరి ఉత్తరాషాఢ వర్జ్యం: రా. 1.18-2.55; దుర్ముహూర్తం: ఉ. 11.43-12.27; అమృతఘడియలు: మ. 12.20-1.58; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.35

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిర్వహణలో లేని ఖాతాలను తగ్గించుకోండి

బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: నిర్దిష్ట కాలం పాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించని ఖాతాలు లేదా స్తంభింపచేసిన ఖాతాల సంఖ్య తగ్గించాలని బ్యాంకులను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశించింది. అలాంటి ఖాతాల సంఖ్య ఎంత ఉన్నది ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రతి బ్యాంకు ప్రకటించాలని సూచించింది. అలాంటి ఖాతాల్లో నిల్వ ఉండిపోతున్న సొమ్ము క్రమక్రమంగా పెరిగిపోతూ ఉండడం పట్ల ఆవేదన ప్రకటించింది. ఇలా ఖాతాలు స్తంభించిపోవడానికి కారణాలెన్నో ఉన్నట్టు తమ తనిఖీల్లో తేలిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐకి చెందిన సూపర్‌విజన్ డిపార్ట్‌మెంట్ ఇలాంటి ఖాతాలపై ఇటీవల విశ్లేషణ నిర్వహించింది.

మొత్తం డిపాజిట్లలో చలామణిలో లేని ఖాతాలు/క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల సంఖ్య పలు బ్యాంకుల్లో పెరుగుతున్నట్టు తేలిందని తెలిపింది. అలాంటి ఖాతాలన్నింటినీ తేలికైన విధివిధానాలు అనుసరించడం ద్వారా పునరుద్ధరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచిస్తూ బ్యాంకు చీఫ్‌లందరికీ నోటిఫికేషన్ పంపింది. మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేయడానికి , వీడియో కస్టమర్ గుర్తింపు విధానం అనుసరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే సమాజంలో దిగువ వర్గాలకు చెందిన ఖాతాలను ఇలాంటి ఖాతాల నుంచి వేరు చేసి ఆ ఖాతాల్లోకి నిరంతరాయంగా నగదు బదిలీ పథకాల నిధులు డిపాజిట్ అయ్యే వెసులుబాటు కల్పించాలని కూడా కోరింది. ఈ దిశగా బ్యాంకులు తీసుకుంటున్న చర్యలను ఆయా బ్యాంకులకు చెందిన కస్టమర్ సర్వీస్ కమిటీ (సీఎస్‌సీ) పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించింది. అలాగే ఖాతాల సంఖ్య తగ్గించడంలో సాధిస్తున్న పురోగతిని దక్ష్ పోర్టల్ ద్వారా ప్రతి త్రైమాసికానికి ఒకసారి సీనియర్ సూపర్‌వైజరీ మేనేజర్‌కు (ఎస్ఎస్ఎం) నివేదించాలని తెలిపింది. డిసెంబరు త్రైమాసికం నుంచే ఈ కృషి ప్రారంభం కావాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా రుణ ప్రణాళికల రూపకల్పనలో బ్యాంకులు "దిగువ నుంచి ఎగువకు" వైఖరి అనుసరించాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ సూచించారు. డేటా విస్తృతంగా అందుబాటులో ఉంటున్న ప్రస్తుత యుగంలో రుణ ప్రణాళికల రూపకల్పనకు డేటా ఆధారిత వైఖరిని అనుసరించాలని కూడా సూచించారు. ఇలాంటి విధానాలు అనుసరించడం వల్ల లక్షిత వ్యూహాల రూపకల్పన సరళం అవుతుందన్నారు.

సిగరెట్లు, శీతల పానీయాలు మరింత ప్రియం!

35 శాతానికి పెరగనున్న జీఎస్‌టీ?

- రూ.1,500-10,000 మధ్య ధర ఉండే దుస్తులపై 18% జీఎస్‌టీ!
- రూ.10,000 మించిన వస్త్రాలు 28% పరిధిలోకి
- జీఎస్‌టీ మండలి ఆమోదమే తరువాయి



న్యూఢిల్లీ: సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలు (కూల్‌డ్రింక్స్) మరింత ప్రియం కానున్నాయి. వీటిపై విధించే జీఎస్‌టీని ప్రస్తుత 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం (జీఓఎం) సిఫారసు చేసింది. ఈ నెల 21న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్‌టీ మండలి దీనిపై నిర్ణయం తీసుకోనుంది. జీఎస్‌టీ మండలి ఆమోదిస్తే వీటి ధరలు మరింత పెరగనున్నాయి. సిగరెట్లతో పాటు పొగాకు, పొగాకు ఉత్పత్తులపైనా 35 శాతం జీఎస్‌టీ విధించాలన్న ప్రతిపాదనతో చుట్టలు, బీడీలు, గుట్కా ధరలూ పెరగనున్నాయి. బట్టలు, దుస్తులపై విధించే జీఎస్‌టీ రేట్లనూ హేతుబద్ధం చేయాలని జీఓఎం కోరింది. రూ.1,500 వరకు ఉండే రెడీమేడ్ దుస్తులపై 5 శాతం, రూ.1,500 నుంచి రూ.10,000 మధ్య ధర ఉండే దుస్తులపై 18 శాతం జీఎస్‌టీ విధించాలని సిఫారసు చేసింది. రూ.10,000కు మించి ధర ఉండే వస్త్రాలను 28 శాతం జీఎస్‌టీ పరిధిలోకి తేవాలని సూచించింది.

ఇక ఐదు శ్లాబులు !

ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం పేరుతో నాలుగు శ్లాబులు ఉన్నాయి. జీఓఎం తాజాగా సిఫారసు చేసిన 35 శాతం శ్లాబును జీఎస్‌టీ మండలి ఆమోదిస్తే ఈ సంఖ్య ఐదుకు చేరనుంది. ప్రస్తుతం కార్లతో పాటు కొన్ని విలాస వస్తువులు, ఆరోగ్యాన్ని దెబ్బతీసే కొన్ని హానికర వస్తువులపై 28 శాతం జీఎస్‌టీతో పాటు ప్రత్యేక సెస్సు విధిస్తున్నారు. సిగరెట్లు, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానియాలను 35 శాతం జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చిన తర్వాత వాటిపై ప్రత్యేక సెస్సు విధించాలా? వద్దా? అనే విషయాన్ని మాత్రం జీఓఎం స్పష్టం చేయలేదు.

జీఓఎం ఇతర సిఫారసులు

- రూ.15,000 కంటే ఎక్కువ ధర ఉండే బూట్లపై జీఎస్‌టీని 18% నుంచి 28 శాతానికి పెంచాలి.
- రూ.25,000 కంటే అధిక ధర ఉన్న రిస్ట్ వాచ్‌లపై విధించే జీఎస్‌టీని 18% నుంచి 28 శాతానికి పెంచాలి.

బీమాపై భారం తగ్గేనా?

మరోవైపు ఈ నెల 21న జరిగే జీఎస్‌టీ మండలి భేటీ అయినా బీమా రంగం జీఎస్‌టీపై నిర్ణయం తీసుకుంటుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ పాలసీలపై 18 శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. ఈ భారం తగ్గించకపోతే 2047 నాటికి 'అందరికీ బీమా' కలగానే మిగిలిపోతుందని బీమా పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కనీసం ఆరోగ్య, టర్మ్ పాలసీలపైనైనా జీఎస్‌టీ రద్దు చేయడమో, 5 శాతం శ్లాబులో చేర్చడమో చేయాలని పరిశ్రమ వర్గాలు ఇప్పటికే ప్రభుత్వానికి విజ్ఞప్తులు సమర్పించాయి.

అందరికీ కాకపోయినా కనీసం సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీలనైనా జీఎస్‌టీ పోటు నుంచి తప్పించాలని కోరుతున్నాయి. ఆర్థిక మంత్రి సీతారామన్ ఇటీవల దీనిపై సానుకూలంగానే స్పందించారు. దీంతో ఈ నెల 21న జరిగే జీఎస్‌టీ మండలి భేటీపై బీమా పరిశ్రమ చాలా ఆశలు పెట్టుకుంది.

సెస్ నివేదికకు మరో ఆరు నెలలు

మరోవైపు జీఎస్‌టీ సెస్సులో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సిఫారసుల కోసం ఏర్పాటైన జీఓఎం, తన నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కోరింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి నాయకత్వంలోని ఈ కమిటీలో అసోం, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. సెస్సుకు సంబంధించి అనేక అంశాలను కూలంకషంగా చర్చించాల్సి ఉన్నందున తమ నివేదిక సమర్పించేందుకు మరింత సమయం కావాలని కమిటీ కోరింది.

జీఓఎం నివేదిక ఇంకా అందలేదు: సీబీఐసీ

కాగా జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ కోసం ఏర్పాటు చేసిన జీఓఎం ఇంకా తన నివేదిక సమర్పించలేదని వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) కూడా ఇదే విషయం స్పష్టం చేసింది. ఈ నివేదిక అందితే గానీ జీఎస్‌టీ మండలి ఈ నెల 21న జరిగే సమావేశంలో పన్ను రేట్ల సవరణ, హేతుబద్ధీకరణపై ఏ నిర్ణయం తీసుకుంటుందనేది తెలిపింది.

ఇండియా ఏఐ మిషన్‌కు కంట్రోల్‌ఎస్ జీపీయూలు!

న్యూఢిల్లీ: ఇండియా ఏఐ మిషన్‌కు గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ) సరఫరా చేసేందుకు 19 కంపెనీలు పోటీపడుతున్నాయి. ఇందులో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కూడా ఉంది. ఈ కంపెనీతో పాటు టాటా కమ్యూనికేషన్స్, జియో ప్లాట్‌ఫామ్స్ కూడా ఇందుకోసం బిడ్ వేశాయి. ఈ ఏఐ మిషన్ కోసం 10,000 జీపీయూల సరఫరా కోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 16న టెండర్లు పిలిచింది. ముందు 50 కంపెనీలు ఇందుకు ఆసక్తి చూపినా టెండర్ చివరి తేదీ నవంబరు 28 నాటికి 19 కంపెనీలు మాత్రమే బిడ్స్ వేశాయి. ఈ నెల 2న ఈ బిడ్స్ ఓపెన్ చేశారు. కంపెనీల అర్హత, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ జీపీయూలు సరఫరా చేసే కంపెనీలను ఎంపిక చేస్తారు.

'6ఈ'పై ట్రేడ్‌మార్క్ గొడవ

మహీంద్రాపై కోర్టు కెక్కిన ఇండిగో

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), దేశీయ విమానయాన సంస్థ ఇండిగో మధ్య ట్రేడ్ మార్క్ వివాదం తలెత్తింది. మహీంద్రా ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) 'బీఈ 6ఈ' ఎస్‌యూవీ పేరులోని '6ఈ' తన ట్రేడ్ మార్క్ అని పేర్కొంటూ ఇండిగో కేసు నమోదు చేసింది. మహీంద్రా మాత్రం ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇండిగోతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటించింది. తమ కొత్త ఈవీ ఎస్‌యూవీకి పెట్టిన 'బీఈ 6ఈ'కి ఇండిగో ట్రేడ్‌మార్క్ '6ఈ'కు అసలు సంబంధమే లేదని పేర్కొంది.

మూడు ఐఐటీలతో హ్యుండయ్ జట్టు

న్యూఢిల్లీ: బ్యాటరీలు, విద్యుత్ వాహనాలపై ఉమ్మడి పరిశోధన కోసం హ్యుండయ్ మోటార్ గ్రూప్ దేశంలోని మూడు ఐఐటీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ విభాగాలపై ఈ గ్రూప్ 70 లక్షల డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. హ్యుండయ్ భాగస్వామ్యం కుదుర్చుకున్న వాటిలో ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటి మద్రాస్ ఉన్నాయి. ఇందులో భాగంగా ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో హ్యుండయ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేస్తారు.

లాభాల హ్యాట్రిక్

- మూడో రోజూ మార్కెట్ ముందుకే..
- సెన్సెక్స్ మరో 597 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 597.67 పాయింట్ల వృద్ధితో 80,845.75 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 181.10 పాయింట్లు బలపడి 24,457.15 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ ఇన్వెస్టర్లు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు పెంచడం సూచీల ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 రాణించాయి. అదానీ పోర్ట్స్ షేరు 6 శాతానికి పైగా పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా పుంజుకోగా.. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా వృద్ధి చెందాయి. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని మంత్రుల బృందం ప్రతిపాదించిన నేపథ్యంలో ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, వరుణ్ బెవరేజెస్ నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో 3 శాతం క్షీణించిన ఐటీసీ షేరు చివరికి 1.02 శాతం నష్టంతో సరిపెట్టుకుంది. వరుణ్ బెవరేజెస్ 1.86 శాతం తగ్గింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ రూ.14 లక్షల కోట్లు

ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒక దశలో దాదాపు 2 శాతం పెరిగి రూ.1,837 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.14 లక్షల కోట్ల స్థాయికి చేరింది. చివరికి బ్యాంక్ షేరు 1.24 శాతం లాభంతో రూ.1,826.85 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాప్ రూ.13.96 లక్షల కోట్ల స్థాయి వద్ద స్థిరపడింది.

గ్రాన్యూల్స్ షేరు ఢమాల్

హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ లిమిటెడ్ షేరు బీఎస్ఈలో 10.12 శాతం క్షీణించి రూ.534.45 వద్దకు జారుకుంది. తెలంగాణలోని గాగిల్లాపూర్‌లో ఉన్న యూనిట్‌లో తనిఖీలు జరిపిన యూఎస్ఎఫ్‌డీఏ ఆరు లోపాలను గుర్తించినట్లు కంపెనీ వెల్లడించడం ఇందుకు కారణమైంది. ఎందుకంటే, కంపెనీకి మెజారిటీ ఆదాయం ఈ యూనిట్‌లో తయారయ్యే ఔషధాల ద్వారానే సమకూరుతోంది.

రూ.45 కోట్ల ఐపీఓ నిధులను ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేయండి..

ట్రాఫిక్‌సోల్‌కు సెబీ ఆదేశాలు

నోయిడాకు చెందిన ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గట్టి షాకిచ్చింది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా సమీకరించిన రూ.45 కోట్ల నిధులను ఇన్వెస్టర్లకు వారం రోజుల్లో రిఫండ్ చేయాలని మంగళవారం ఆదేశించింది. రిఫండ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సిందిగా బీఎస్ఈని సెబీ నిర్దేశించింది. ఐపీఓ ద్వారా నిధుల సేకరణ కోసం ఈ కంపెనీ తన పత్రాల్లో తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు ఓ షెల్ కంపెనీతో కుమ్మక్కైనట్లు సందేహాలున్న నేపథ్యంలో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు అనూహ్య స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ ఏకంగా 345 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.10,000 కోట్లకు పైగా విలువైన బిడ్లను ఆకర్షించింది. ఐపీఓ అనంతరం ఈ కంపెనీ బీఎస్ఈ ఎస్ఎంఈ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తన షేర్లను నమోదు చేయాల్సింది. కానీ, ఈ ఐపీఓపై రిటైల్ మదుపరుల సంఘం అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో సంస్థ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,780 ▲	71,300 ▲	99,500 ▼
ముంబై	76,324 ▲	69,913 ▲	89,980 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		

స్పోర్ట్స్

ఫైనల్లో మన కుర్రాళ్లు

జూనియర్ ఆసియా కప్ హాకీ

- మలేసియాపై 3-1తో గెలుపు
- నేడు పాక్‌తో భారత్ తుదిపోరు

మస్కట్: డిఫెండింగ్ చాంపియన్ యువ భారత్ జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో 3-1తో మలేసియాను చిత్తు చేసింది. భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్, రోహిత్, శార్దానంద్ తివారీ తలో గోల్ చేశారు. మలేసియాలో ఏకైక గోల్‌ను అజిముద్దీన్ సాధించాడు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా ఫైనల్ చేరిన భారత్ బుధవారం జరిగే టైటిల్‌పోరులో పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో పాక్ 4-2తో జపాన్‌పై గెలిచింది.



గుకేష్ చేజేతులా..

- భారత జీఎంకు త్రుటిలో చేజారిన విజయం
- లిరెన్‌తో ఏడో గేమ్ డ్రా ● ప్రపంచ చెస్

సింగపూర్: అమూల్యమైన అవకాశాన్ని చేజార్చుకొన్న భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్.. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో మరో గేమ్‌ను డ్రాగా ముగించాడు. మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరెన్‌తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. దీంతో ఇద్దరూ చెరో 3.5 పాయింట్లతో సమంగా నిలిచారు. 5 గంటల 22 నిమిషాలపాటు ఉత్కంఠ నడుమ సాగిన గేమ్‌లో తెల్లపావులతో ఆడిన గుకేష్ ఆధిపత్యం ప్రదర్శించినా.. ఒక్క తప్పిదంతో లిరెన్ త్రుటిలో ఓటమి కోరల నుంచి తప్పించుకొన్నాడు. దీంతో 72 ఎత్తులపాటు సాగిన గేమ్‌లో గుకేష్‌కు నిరాశే ఎదురైంది. ఓపెనింగ్‌లోనే భారత జీఎం విభిన్న ఎత్తులో లిరెన్‌ను ఆశ్చర్యపర్చాడు. అయితే, నియో గ్రన్‌ఫెల్డ్ డిఫెన్స్‌తో లిరెన్ అడ్డుకొనే ప్రయత్నం చేశాడు. క్రమంగా మిడిల్ గేమ్‌పై పట్టు సాధించిన గుకేష్ ఎత్తులకు పైఎత్తులు వేయడానికి లిరెన్ తీవ్రంగా ఆలోచించాల్సి వచ్చింది. దీంతో 40 ఎత్తుకు వచ్చే సరికి సమయాభావంతో అతడు ఒత్తిడికి గురయ్యాడు. కానీ, 45వ ఎత్తులో గుకేష్.. కింగ్‌ను కదిలించాల్సింది పోయి హెచ్4 లోకి పాన్‌ను జరపడం పెద్ద తప్పిదంగా మారింది. దీన్ని అవకాశంగా మార్చుకొన్న లిరెన్ రుక్‌తో గుకేష్ బిషప్‌కు గురిపెట్టాడు. దాన్ని కాపాడుకోవడానికి వేసిన ఎత్తులతో గేమ్‌పై గుకేష్ పట్టు చేజార్చుకొన్నాడు. మరోవైపు సెకండ్ టైమ్ క్రంటోల్‌లో చైనా జీఎం మెరుగైన ఆటతో ఊపిరిపీల్చుకొన్నాడు. చివరగా గుకేష్‌కు బిషప్ మాత్రమే మిగిలింది. ఫలితం తేలే అవకాశాలు లేకపోవడంతో 72 ఎత్తుల అనంతరం ఇరువురూ డ్రాకు అంగీకరించారు.

నార్వే టోర్నీ బరిలో అర్జున్

స్టావెంజర్ (నార్వే): భారత యువ గ్రాండ్ మాస్టర్, వరల్డ్ నెం:4 అర్జున్ ఇరిగేసి ప్రఖ్యాత నార్వే చెస్ టోర్నీ బరిలో నిలవనున్నాడు. వచ్చే ఏడాది మే 26 నుంచి జూన్ 6 వరకు టోర్నీ జరగనుంది. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత గోల్డ్ స్టాండర్డ్ ఎలో రేటింగ్ 2800 సాధించిన రెండో భారత ఆటగాడిగా అర్జున్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.

విరాట్‌కు గాయం?

- రెండో టెస్టుకు ఇబ్బందేనా?
- జోరుగా భారత జట్టు ప్రాక్టీస్

6 నుంచి అడిలైడ్ మ్యాచ్



అడిలైడ్: అంచనాలకు మించిన ఆటతీరుతో భారత జట్టు ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఆరంభించింది. తొలి టెస్టులో 295 పరుగుల భారీ తేడాతో కంగారూ జట్టును కంగుతినిపించిన సంగతి తెలిసిందే. అలాగే చాలాకాలంగా ఫామ్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం 30వ సెంచరీతో అదరగొట్టాడు. దీంతో విమర్శకులకు సమాధానమివ్వడమే కాకుండా, ఆసీస్ జట్టుకు కూడా హెచ్చరికలు పంపినట్టయ్యింది. మరోవైపు ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో జరిగే గులాబీ టెస్టుకు భారత జట్టు తమ సన్నాహకాలను ఆరంభించింది. ఇప్పటికే కాన్‌బెర్రాలో జరిగిన వామప్ మ్యాచ్‌లో ఆటగాళ్లకు చక్కటి ప్రాక్టీస్ లభించింది. అలాగే టెస్టు వేదిక అడిలైడ్‌కు చేరుకున్న రోహిత్ సేన మంగళవారం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేసింది. అయితే సెషన్ ఆరంభానికి ముందు విరాట్ కోహ్లీ కుడి మోకాలికి వైద్య సిబ్బంది బ్యాండేజి కడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయినా రెగ్యులర్ వామప్‌తో పాటు ఫీల్డింగ్ డ్రిల్స్ కూడా కొనసాగించాడు. ఈ సమయంలో అతను పెద్దగా అసౌకర్యంగా ఉన్నట్టు కనిపించలేదు. ఏదిఏమైనా విరాట్‌కు ఏమైందనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. టెస్టుకు ఇంకా రెండు రోజుల సమయం ఉంది కాబట్టి చిన్నపాటి గాయమైతే ఎలాంటి ఇబ్బందీ ఉండకపోవచ్చు. కానీ ముందుజాగ్రత్తగా విరాట్‌కు విశ్రాంతినిస్తే మాత్రం జట్టుకు గట్టిదెబ్బే అని చెప్పవచ్చు. ఎందుకంటే అడిలైడ్‌లో విరాట్‌కు ఘనమైన రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన 11 టెస్టుల్లో 5 శతకాలు, 4 హాఫ్ సెంచరీలతో 957 పరుగులు సాధించడం విశేషం.

సచిన్ రికార్డుపై కన్నేశాడు



యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఈ ఏడాది అద్భుత ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. 2024 సీజన్‌లో తను ఆడిన 12 టెస్టుల్లో 58.18 సగటుతో 1280 పరుగులు సాధించాడు. ఇందులో రెండు డబుల్, ఓ సెంచరీతో పాటు ఏడు హాఫ్ సెంచరీలున్నాయి. ఇదే జోరుతో అతడు సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమించాలనుకుంటున్నాడు. భారత్ నుంచి ఒకే క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ పరుగులు సాధించిన రికార్డు మాస్టర్ పేరిటే ఉంది. 2010లో అతను 14 టెస్టుల్లో ఏడు సెంచరీలతో 1562 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా పాక్ మాజీ బ్యాటర్ మహ్మద్ యూసుఫ్ (2006లో 1788) అందరికంటే టాప్‌లో ఉన్నాడు.

సుందర్ ఖాయమే..



ఆసీస్‌తో తొలి టెస్టులో అశ్విన్, జడేజాలను పక్కనబెట్టి యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు అవకాశమిచ్చారు. ఇందులో రెండు వికెట్లు తీయడంతో పాటు 33 పరుగులు కూడా చేశాడు. అలాగే వామప్ మ్యాచ్‌లో అతడు బ్యాటింగ్‌లోనూ మెరిశాడు. దీంతో రెండో టెస్టులోనూ సుందర్‌నే కొనసాగించేందుకు 90శాతం అవకాశాలున్నట్టు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. కివీస్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీయడంతో జట్టులో నిలకడగా చోటు దక్కించుకుంటున్నాడు.

క్రికెట్‌ను వదిలేసి.. పిల్లల్ని చూసుకోమన్నారు!

'పెళ్లి' ఇబ్బందులపై మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తన రెండు దశాబ్దాల కెరీర్‌లో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. రెండేళ్ల క్రితం ఆటకు గుడ్‌బై చెప్పిన మిథాలీ.. ఇప్పుడు కామెంటేటర్‌గా, మెంటార్‌గా క్రికెట్‌తో బంధాన్ని కొనసాగిస్తోంది. 42 ఏళ్ల మిథాలీ వివాహం చేసుకోలేదు. అయితే, ఈ విషయంలో తనకు ఎదురైన ఇబ్బందికర అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో మిథాలీ పంచుకొంది. అసలు పరిచయం అయిన వెంటనే.. పెళ్లి తర్వాత జీవితం గురించి మగాళ్లు మాట్లాడుతుంటే తనకు ఏమీ అర్థమయ్యేది కాదని చెప్పింది. కెరీర్ ఉచ్ఛదశలో ఉన్న సమయంలో నాకు ఎన్నో సంబంధాలు వచ్చాయి. అమ్మ తరపు బంధువులు బలవంతం చేయడంతో పెళ్లి చూపులకు అంగీకరించా. అయితే, పరిచయమైన కొద్ది సేపటికే ఎంతమంది పిల్లలు కావాలని అడిగేవారు. నిజంగా అలాంటి ప్రశ్నలు ఎదురవుతాయని ఊహించలేదు. అప్పుడు నాదృష్టంతా ఆటపైనే ఉండేది. ఒకరైతే పెళ్లి తర్వాత క్రికెట్‌ను వదిలేసి.. పిల్లలను చూసుకోవాలని నేరుగా చెప్పాడు. మరొకరైతే 'అత్తకు ఏదైనా జరిగితే సేవలు చేస్తావా? లేదా ఆడుకోవడానికి వెళ్తావా?' అని కూడా అడిగినట్టు మిథాలీ తెలిపింది. స్నేహితులు కూడా పెళ్లి కావాలంటే ఎంతో కొంత సర్దుకుపోవాలని.. లేకపోతే ఎవరూ దొరకరని ఆటపట్టించినట్టు గుర్తు చేసుకొంది. కానీ, క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తాను ఆటతోనే జీవించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు చెప్పింది.

బాప్‌రే..బ్రాడ్‌మన్ క్యాప్

వేలంలో రూ. 2.63 కోట్లు



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్ లెజెండ్ సర్ డాన్ బ్రాడ్‌మన్ ధరించిన బ్యాగీ గ్రీన్ టోపీ వేలంలో రూ. 2.63 కోట్ల భారీ ధరకు అమ్ముడైంది. 1947-48 సీజన్‌లో సొంతగడ్డపై తన చివరి, భారత్‌తో జరిగిన సిరీస్‌లో బ్రాడ్‌మన్ దీన్ని ధరించాడు. డాన్ గుర్తుగా మిగిలిన ఏకైక టోపీగా కూడా భావిస్తున్నారు. దీంతో వేలం మొదలైన 10 నిమిషాల్లోనే హాట్‌కేక్‌గా అమ్ముడైంది. వేలంలో రూ. 2.14 కోట్లు (3,90,000 ఆస్ట్రేలియా డాలర్లు) పలకగా.. ఇతరత్రా ఫీజులతో కలిపి అది రూ. 2.63 కోట్లకు (4,79,700 ఆస్ట్రేలియా డాలర్లు) చేరుకొంది. ఈ టోపీని భారత టూర్ మేనేజర్ పంకజ్ కుమార్ గుప్తాకు బ్రాడ్‌మన్ బహుమతిగా ఇచ్చినట్టు ఫాక్స్ స్పోర్ట్స్ తెలిపింది. అయితే, 2003లో ఈ క్యాప్‌ను ప్రస్తుత యజమాని కొనుగోలు చేసినట్టు వేలం నిర్వాహకులు చెప్పారు.

ఉర్విల్.. ఉరుములా..

36 బంతుల్లోనే సెంచరీ



ఇండోర్: ఐపీఎల్‌లో అమ్ముడుపోని గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ క్రమంలో టీ20 క్రికెట్‌లో 40 బంతుల్లోపు రెండు శతకాలు సాధించిన తొలి బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఉత్తరాఖండ్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పటేల్ (41 బంతుల్లో 115 నాటౌట్) కేవలం 36 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో ఉత్తరాఖండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 13.1 ఓవర్లలోనే ఛేదించింది. వారం క్రితం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పటేల్ 28 బంతుల్లో వేగవంతమైన శతకం సాధించాడు.

హైదరాబాద్ నాలుగో ఓటమి

రాజ్‌కోట్: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ నాలుగో ఓటమిని చవిచూసింది. మంగళవారం మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఏడు పరుగుల తేడాతో పరాజయం పాలైంది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో చామ మిలింద్, అజయ్ దేవ్ గౌడ్ చెరో మూడు వికెట్లు తీశారు. రోహిత్ రాయుడు (8) త్వరగానే అవుటైనా.. మరో ఓపెనర్ తన్మయ్ (47)తో కలిసి తిలక్ వర్మ (46) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆ తర్వాత చకచకా వికెట్లు కోల్పోవడంతో హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 171 పరుగులే చేసి ఓడింది. ఈ ట్రోఫీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో హైదరాబాద్‌కిది నాలుగో ఓటమి. కాగా జింఖానాలో జరిగిన మ్యాచ్‌లో కేరళపై ఆంధ్ర ఆరు వికెట్లతో నెగ్గి, ట్రోఫీలో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. ఉప్పల్‌లో సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 39 పరుగుల తేడాతో నెగ్గింది. ముంబై బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్ (70), శివమ్ దూబే (71 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగారు.

16 బంతుల్లో.. 5 వికెట్లు

- సుఫియాన్ సంచలన బౌలింగ్
- జింబాబ్వే 57 ఆలౌట్ ● పాక్‌దే సిరీస్



బులవాయో: పాకిస్థాన్ స్పిన్నర్ సుఫియాన్ ముఖీమ్ (2.4-0-3-5) సంచలన బౌలింగ్‌తో జింబాబ్వే వెన్ను విరిచాడు. మంగళవారం జరిగిన రెండో టీ20లో ముఖీమ్ ధాటికి ఆతిథ్య జట్టు 12.4 ఓవర్లలో కేవలం 57 పరుగులకే కుప్పకూలింది. టీ20ల్లో ఈ జట్టుకిదే అత్యల్ప స్కోరు. ఇక పది వికెట్ల తేడాతో నెగ్గిన పాక్ మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్‌ను దక్కించుకుంది. మరోవైపు ఈ ఫార్మాట్‌లో పాక్ తరఫున సుఫియాన్‌దే ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన కావడం విశేషం. 16 బంతులు వేసిన సుఫియాన్ కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చి సగం జట్టును పెవిలియన్‌కు చేర్చడం విశేషం. ఆ తర్వాత స్వల్ప ఛేదనను పాక్ 5.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసి నెగ్గింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 4-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 246

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



దుస్తులు మస్తు పిరం!

రూ.1500 దాటితే 18% జీఎస్టీ.. రూ.10 వేలు మించితే 28%

అనారోగ్య కారకాలపై 35 శాతం.. జీఎస్టీలో కొత్తగా ఐదో శ్లాబ్

కూల్‌డ్రింకులు, సిగరెట్లు భగ్గు.. మంత్రుల బృందం ప్రతిపాదనలు

ఈ నెల 21న జీఎస్టీ మండలి సమావేశంలో తుది నిర్ణయం

ఖాతాకు నలుగురు నామినీలు!

వినియోగదారుల సౌలభ్యానికే

సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలం 10 ఏళ్లకు పెంపు

క్లెయిమ్ చేసుకోని డివిడెండ్లు, షేర్లు ఐఈపీఎఫ్ లోకి బదిలీ

లోక్‌సభలో బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు పెట్టిన నిర్మల



బంధాలను బలిచేస్తూ..

కత్తులతో చేవ్రాలు!

రక్తసంబంధాన్ని మరిచి కులోన్మాదంతో రగిలిపోతున్న కుటుంబసభ్యులు

కన్న బిడ్డలనే చంపుకొనేంత క్రౌర్యం

ఆందోళన కలిగిస్తున్న వరుస ఉదంతాలు

కులోన్మాద హత్యల్లో దోషులకు ఉరే సరి అని గతంలోనే స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

సహకరించినవాళ్లకూ కఠిన శిక్షలు

నేరగాళ్ల కన్నా పరువు హత్యలపై ఆలోచించేవారే ప్రమాదకరం: వైద్యులు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ అమ్మాయిలకు వేసుకునే దుస్తుల నుంచి ఎంచుకునే కెరీర్ దాకా అడుగడుగునా అన్ని రకాలుగా సహకరించే తల్లిదండ్రులు, సోదరులే.. తీరా ఆమె, తాను నచ్చినవాడిని మనువాడతానని చెప్పగానే కుదరదంటే కుదరదు అని తేల్చి చెబుతున్నారు. అదీ.. వేరే కులం వ్యక్తిని పెళ్లి చేసుకుంటే అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు! బిడ్డ చేష్టకు సమాజంలో

మిగతా 12వ పేజీలో...

వలపు వలకు వాజేడు

ఎస్సై బలి?



12

ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లికి యువతి ఒత్తిడి

గతంలో ముగ్గురికి ఇదేతీరున బెదిరింపులు

యువతిది సూర్యాపేట జిల్లా.. అక్కడ కేసు

గుజరాత్‌కు వలస పోతారా.. నిధులు తెస్తారా!?

కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

రెండుసార్లు కేంద్ర మంత్రిగా ఎన్ని నిధులు తెచ్చారు?

6 నెలలు అభివృద్ధి పనులు ఆపుతాం.. నిధులు తెస్తారా!?

కేంద్రం నుంచి లక్షన్నర కోట్లు తెస్తే సన్మానం చేస్తాం

ఆ నిధులన్నీ హైదరాబాద్ అభివృద్ధికే ఖర్చు చేస్తాం

నగర ప్రగతికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తాం

బీఆర్ఎస్, బీజేపీలు తమ ప్రణాళికలను దానికి ఇవ్వాలి

అడ్డుకోవాలని చూస్తే ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు

ఎంత విష ప్రచారం చేసినా సర్కారు ఆదాయంలో వృద్ధి

ఒక్క రియల్ ఎస్టేట్ ఆదాయమే 29 శాతం పెరిగింది

అప్పులు, తప్పులు తప్ప బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

న్యూయార్క్, టోక్యో స్థాయిలో ఫ్యూచర్ సిటీ: రేవంత్

హైదరాబాద్‌లో రూ.7 వేల కోట్లతో పనులకు శ్రీకారం

పెద్దపల్లికి ముఖ్యమంత్రి వరాల జల్లు

నేడు జిల్లా కేంద్రంలో యువ వికాసం కార్యక్రమం

రూ.500కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

సభలో 9007 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

స్కిల్ వర్సిటీకి సంబంధించి 7 ఏజెన్సీలతో ఒప్పందాలు

11



హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాల్లో పారిశుద్ధ్య కార్మికురాలితో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "గుజరాత్‌కు నరేంద్ర మోదీ గిఫ్ట్ సిటీ తీసుకుపోయిండు. తెలంగాణకు మీరు ఏం గిఫ్ట్ తీసుకొచ్చారు!? రెండోసారి కేంద్ర మంత్రి అయ్యారు. రాష్ట్రానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారు!? హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణకు రూ.35 వేల కోట్లు కావాలి. మీరు ఎన్ని నిధులు తెస్తారు!? హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపునకు రూ.7 వేల కోట్లు కావాలి. కేంద్రం నుంచి మీరు ఎన్ని నిధులు తెస్తారు? రీజనల్ రింగ్ రోడ్డుకు, రేడియల్ రోడ్లకు రూ.50 వేల కోట్ల నిధులు కావాలి!? కేంద్రం నుంచి మీరు ఎన్ని తెస్తారు!? కిషన్ రెడ్డీ.. మీరు నిధులు తెస్తారా!? గుజరాత్‌కు వలస వెళతారా!? తేల్చుకోండి" అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. లక్షన్నర కోట్ల రూపాయలతో హైదరాబాద్ అద్భుతమైన నగరంగా మారుతుందన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే ఇక్కడి ప్రజలకు ఉపాధి పెరుగుతుందని తాము ప్రయత్నిస్తుంటే.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఏడాది పాలన విజయోత్సవాల్లో భాగంగా నెక్లెస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన 'హైదరాబాద్ రైజింగ్' సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధి లక్ష్యంగా రూ.7000 కోట్లతో చేపట్టిన వివిధ పనులను ఆయన ప్రారంభించారు. 'కిషన్ రెడ్డి మూసీలో పండుకోనీ, మునగనీ కానీ.. మూసీ ఎంత దుర్భరంగా ఉందో ప్రధానిని ఒక్కసారి తీసుకొచ్చి చూపించగలరా'!? అభివృద్ధికి నిధులు ఇప్పించగలరా అని సూటిగా నిలదీశారు. మూసీ ఒడ్డున ఒక్కరోజు నిద్ర చేయడం కాదని, నది నడిబొడ్డున రోజూ కుటుంబంతో ఉంటే ఆయనకు

మిగతా 11వ పేజీలో...

మద్యం ధరలు పెంచేది లేదు!

స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. బీఆర్ఎస్ హయాంలో ఏటా పెంపు

ఇప్పుడూ ఆ విధానాన్నే అనుసరించాలంటూ ఉత్పత్తిదారుల ఒత్తిడి

త్రిసభ్య కమిటీ సిఫారసు చేసినా అంగీకరించని సర్కారు

11



బిల్డ్ నౌ వ్యవస్థ ఆవిష్కరణ సందర్భంగా ఏఆర్ వి జువలైజేషన్‌ను పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు

రెరాతో 'బిల్డ్‌నౌ' అనుసంధానం

మొబైల్ ఆధారిత సైట్ తనిఖీ యాప్

ఐదు నిమిషాల్లో డ్రాయింగ్‌ల పరిశీలన

10 రోజుల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్

రాష్ట్రంలో వ్యాపారానుకూల వాతావరణం

'రియల్ ఎస్టేట్'లో హైదరాబాద్ టాప్

'బిల్డ్‌నౌ' ఆవిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవనాల డ్రాయింగ్‌లను పరిశీలించాలంటే రోజుల తరబడి ఎదురుచూడాలి.. 'ఆక్యుపెన్సీ' కావాలంటే సుదీర్ఘ కాలం వేచి చూడాలి.. ఎక్కువ అంతస్తుల (హైరైజ్) భవనాల డ్రాయింగ్‌ల ఆమోదం కోసమైతే నెలల తరబడి నిరీక్షించాలి.. దరఖాస్తు చేసుకోవడం నుంచి, ఫీజు చెల్లించడం వరకు ఎన్నో ఇబ్బందులు.. వీటన్నింటికీ పరిష్కారం చూపుతూ భవన

మిగతా 11వ పేజీలో...

గోదావరి-కావేరీ అనుసంధానం రాష్ట్రాల కోరికలన్నీ తీర్చలేం

నాలుగేళ్లుగా అవే వాదనలను వింటున్నాం

దేశ ప్రయోజనాల రీత్యా ముందుకురండి

లేదంటే మొత్తం ప్రాజెక్టునే పక్కనపెడతాం

ఇంట్రా లింక్‌లతో వస్తే సరే: కేంద్రం

10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఓలి రాజకీయం

నేపాల్ ప్రధాని ఖడ్గప్రసాద్ శర్మ ఓలి ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కంకణం కట్టుకున్నందుకు ఆయనను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమితంగా ప్రశంసించారు. రెండుదేశాలు పలు కీలక ఒప్పందాలమీద సంతకాలు చేశాయి. ఓలీ నేపాల్ ప్రధాని కావడం ఇది నాలుగోసారి అయినప్పటికీ, మొన్న జూలైలో నేపాలీ కాంగ్రెస్‌తో చేతులు కలిపి, ప్రచండను గద్దెదించి, మళ్ళీ ఆ పదవిలో కూచున్న తరువాత ఆయన తొలివిదేశీపర్యటన ఇదే. నేపాల్ ప్రధానిగా ఎవరు బాధ్యతలు స్వీకరించినా, తొలి విదేశీపర్యటన భారతదేశంలో జరపడం ఓ సంప్రదాయం. ఓలి దానిని కాదని, తొలిగా చైనాలో కాలూని, దానితో దీర్ఘకాలిక, వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవడం భారతదేశానికి గట్టి హెచ్చరిక.

ఓలి చైనా పర్యటన సందర్భంగా ఉభయదేశాధినేతలు ఒకరినొకరు కీర్తించుకున్నారు, ద్వైపాక్షిక బంధాన్ని మరింత దృఢతరం చేసుకోవాలని సంకల్పం చెప్పుకున్నారు. నదులు, నదీనదాలు, పర్వతశిఖరాలకు చెరోవైపూ ఉంటూ పంచుకుంటున్న మనం స్నేహాన్ని, సంతోషాన్ని కూడా పంచుకోవాలని, ఇచ్చిపుచ్చుకొనేరీతిలో వ్యవహరించాలని రెండు దేశాలు అనుకున్నాయట. నేపాల్‌ను ఆర్థికంగా నిలబెట్టే విషయంలో చైనా వెనకడుగువేయబోదన్న గట్టి హామీ కూడా ఓలిశర్మకు లభించింది. పర్యటనకు ఒకరోజు ముందుగానే, చైనానుంచి నేపాల్‌కు వేర్వేరు పేర్లతో, ఖాతాలతో ఓ పాతికమిలియన్ డాలర్ల ప్రాజెక్టులు దక్కాయి. ఓలి పర్యటనలో అనేక భారీ నిర్మాణాలకు సంబంధించి ఒప్పందాలు జరిగాయని, వైద్యం, వాణిజ్యం, వ్యవసాయం ఇత్యాది రంగాల్లో సహకారం నిమిత్తం అవగాహనలు చేసుకున్నారని, మరిన్ని వరాలు దక్కుతాయని వార్తలు వస్తున్నాయి. నేపాలీ టెలివిజన్‌కూ చైనా అధికారిక మీడియాకూ మధ్య కూడా ఇచ్చిపుచ్చుకోవడాలు ఉంటాయట.

జూలైలో ఓలి మళ్ళీ ప్రధాని అయినప్పుడే, ఆయన ఈ మారు తన అధికారాన్ని బలోపేతం చేసుకోవడం కోసం చైనాకు మరింత సన్నిహితమవుతారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. సెప్టెంబరులో ఐక్యరాజ్య సమితి సదస్సు సందర్భంగా భారతప్రధాని నరేంద్రమోదీతో ఓలి భేటీ అయ్యారు. దీనికి ముందు నేపాల్ విదేశాంగమంత్రి మనదేశానికి వచ్చారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఓలిని మనపాలకులు ఆహ్వానించకపోవడంతో, చైనా వెళ్ళాలన్న నిర్ణయానికి వచ్చారట. ఆయన ప్రధాని కావడంతోనే, భారత్–నేపాల్ బంధం బలహీనపడితే, అనంతర పరిణామాలతో అవి మరింత దిగజారాయి. నేపాల్‌లో చైనా పెట్టుబడుల విషయంలోనే కాక, భారత్–నేపాల్ ప్రాజెక్టుల్లో సైతం చైనా పరోక్ష ప్రమేయం పెరుగుతున్నదని భారత్ ఆగ్రహిస్తోంది. చైనా నిర్మించిన విమానాశ్రయాలనుంచి ఇతరదేశాలకు పోయే విమానాలను భారతదేశం తన గగనతలంమీద అనుమతించాలన్న నేపాల్ అభ్యర్థనకు భారత్ సరేననడం లేదు. ఇటువంటి పలు అంశాలు ఓలిరాకతో మరింత వేడెక్కాయి. ఆయనను మనం ఆహ్వానించకపోవడం మారిన వాతావరణానికి ప్రబల నిదర్శనం.

బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో భాగస్వామినవుతానని 2019లో చైనా అధ్యక్షుడు పర్యటించిన సందర్భంగా నేపాల్ గట్టిహామీ ఇచ్చిన విషయాన్ని ఇప్పుడు ఓలి పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్టు–లెనినిస్ట్) నాయకులు గుర్తుచేస్తున్నారు. అప్పుడు అవగాహన కుదుర్చుకున్నవన్నీ ఆచరణసాధ్యం చేయడానికి ఓలి ఈ పర్యటన చేస్తున్నారట. 2017లో బీఆర్ఐలో చేరికూడా నేపాల్ ఈ విషయంలో పెద్దగా అడుగుముందుకు వేయలేకపోయింది. అలాగే, చైనా నిర్మిత పొఖారా అంతర్జాతీయ విమానాశ్రయం అప్పును తీర్చగలిగే స్థితిలో నేపాల్ లేదు కనుక దానిని గ్రాంటుగా మార్చమన్న ఓ అభ్యర్థన ఆయన ఎజెండాలో ఉందట. భారత్ అభ్యంతరాలతో అంతర్జాతీయ విమానాల రాకపోకలు అనుకున్నంతగా లేక ఈ విమానాశ్రయం నష్టాల్లోకి జారుకున్న విషయం తెలిసిందే. చైనాతో చేయి కలిపి నిండామునిగిన శ్రీలంక అనుభవం కళ్ళముందు ఉన్నది కనుక, ఓలి దూకుడును నియంత్రించేందుకు నేపాల్‌లోని మిగతాపక్షాలు ప్రయత్నించవచ్చు. కానీ, తన తొలివిదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోవడం ద్వారా ఆయన భారత దేశాన్ని మరింత దూరం చేసుకున్నారు. భారత వ్యతిరేక ఎజెండాతో అధికారంలోకి వచ్చిన మాల్దీవుల అధ్యక్షుడు కూడా మొదట ఇదే తరహాలో వ్యవహరించి, ఆ తరువాత సయోధ్యయత్నాలు ఆరంభించారు. ఓలి ఎంతకాలం అధికారంలో ఉంటారో తెలియదు కానీ, ఆయన కారణంగా నేపాలీ ప్రజలకు దూరంకాకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత భారత్ మీద ఉంది.

ఉపకారికి బంగ్లాదేశ్ అపకారం!

కూర్చున్న కొమ్మనే నరుక్కుంటూ భవిష్యత్తును కాలరాసుకోవడం అంటే ఏమిటో ఇవాళ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి అర్థం చేసుకోవచ్చు! రిజర్వేషన్ల విషయంలో అసంతృప్తి పేరిట హసీనా నాయకత్వంలోని గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదలైన నిరసనలను ఉద్దేశపూర్వకంగా హిందువుల వైపు మరల్చి, మరీ ముఖ్యంగా హిందూ స్త్రీల పట్ల చెప్పలేని చూడలేని దారుణ మారణకాండను సృష్టిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో చూసి కన్నీరు కార్చని హృదయం లేదు. ఎలాగో కాస్త తేరుకున్న బంగ్లాదేశ్ హిందువులు, వారికి మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలోని హిందువులు చేపట్టిన నిరసనల ఫలితంగా తాత్కాలికంగా హింసాకాండ ఆగినట్టు కనిపించినా కొద్ది రోజుల్లోనే మళ్లీ వికృత చేష్టలు మొదలయ్యాయి.

ఇందులో భాగంగానే తాజాగా ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షస్‌నెస్) పూజారి అయిన చిన్మోయ్ కృష్ణదాస్‌పై దేశద్రోహి ముద్ర వేసి జైలుకి పంపాలన్న కుట్ర మొదలైంది. చిన్మోయ్ కృష్ణదాస్ తరఫున వాదిస్తున్న ప్రభుత్వ న్యాయవాదిని అల్లరి మూకలు హత్య చేశాయి. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బాధిత హిందువులను సమైక్యపరిచి, కాపాడేందుకు ప్రయత్నించడమే చిన్మోయ్ కృష్ణదాస్ చేసిన తప్పు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు నెల నుంచి కొనసాగిన విధ్వంసకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇందులో పదుల కొద్దీ ఇస్కాన్ మందిరాలు కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు 65 దేవాలయాలుండగా 50 వేలకు పైగా భక్తులు ఉన్నారు. తాజా పరిణామాల్లో భాగంగా ఇస్కాన్‌కి వ్యతిరేకంగా జమాతే ఏ ఇస్లామి సంస్థ బెదిరింపులకు తెగబడింది. ఈ సంస్థ కార్యకర్తలు ఇస్కాన్ ఆలయ బోర్డును కూడా తొలగించి తమ సంస్థ బోర్డు పెట్టారు. అసలు చిన్మోయ్ అరెస్టుకి ముందే బంగ్లా పోలీసులు ఇస్కాన్ ఉగ్రవాద సంస్థ అని వాదిస్తున్నారు. ఇస్కాన్ సభ్యులు భారత నిఘా సంస్థకు అనుబంధంగా పని చేస్తున్నారనీ, దేశంలో మతపరమైన హింసకు వీరే కారణమనీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో అనేక విలయాలు సంభవించినప్పుడు అక్కడి ప్రజలకు అండగా నిలిచి, బాధితులకు అన్నవస్త్రాలూ నిత్యావసరాలూ ఇచ్చి ఆదుకున్న ఇస్కాన్‌పై దేశద్రోహి అన్న ముద్ర వేశారు.



బంగ్లాదేశ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి. ఆ దేశాధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి జరుగుతున్న అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం.

బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీల రక్షణపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. కానీ, బంగ్లాదేశ్‌లోని యూనిస్ సర్కారు భారత ప్రభుత్వ వాదనను తోసిపుచ్చుతూ వచ్చింది. ఇప్పుడు తమ నిర్లక్ష్యాన్నీ, వివక్షాపూరిత వైఖరినీ కప్పిపుచ్చుకునేందుకు ఇస్కాన్‌ని దోషిగా చూపిస్తోంది. చిన్మోయ్ అరెస్టుతో దేశంలోని హింసకు బాధ్యత వహించకుండా తప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇస్కాన్ సంస్థపై నిషేధం విధించాలన్న పిటిషన్‌ని బంగ్లాదేశ్‌లోని ఢాకా హైకోర్టు తోసిపుచ్చడం ఒక్కటే కాస్త ఉపశమనం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో విస్తరించిన ఇస్కాన్ కార్యకలాపాలపై, సేవలపై ఎక్కడా ఏ వివాదాలూ తలెత్తలేదు. చివరికి భారత్ దాయాది పాకిస్థాన్‌లో సైతం కరాచీ, లర్కానా, సింధ్, హైదరాబాద్, క్వెట్టా, బలోచిస్థాన్ ప్రాంతాల్లో ఇస్కాన్ సంస్థ సేవలు కొనసాగుతున్నాయి. మరెక్కడా లేని రీతిలో ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఇస్కాన్‌ని లక్ష్యంగా చేసుకోవడం చూస్తే ఇది కుట్ర గాక మరేమిటి?

మూడు నెలల కిందట బంగ్లాదేశ్‌లో భారీగా వానలు కురిసినప్పుడు పలు గ్రామాలు నీట మునిగి అనేక ప్రాంతాలు జలమయమై ఆహారం, ఆశ్రయం లేకుండా పోయాయి. ఆ పరిస్థితుల్లో ఇస్కాన్ భక్తులు బంగ్లాదేశ్ వరద బాధితులకు గొప్ప సేవలందించారు. ప్రాణాలను పణంగా పెట్టి మరీ పడవలపై వరద నీటిలో బాధితుల వద్దకు వెళ్ళి ఆకలి తీర్చారు. బంగ్లాదేశ్‌లో ఇలా ప్రకృతి విలయం ఎప్పుడు సంభవించినా ఇస్కాన్ సభ్యులు చేయూతనిస్తుంటారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పైనా, ఇస్కాన్ ఆలయాలపైనా దాడులు జరిగిన సమయంలో కూడా ఇస్కాన్ భక్తులు తమ సేవలను ఆపలేదు. తమపై దాడి జరిగిన చోటే వరద బాధితుల కడుపులు నింపిన సహృదయత బంగ్లాదేశ్ ఇస్కాన్ సభ్యుల్లో కనిపించింది. ప్రత్యేకించి శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమయంలో కులమత భేదమన్నది లేకుండా ఆ దేశంలోని పేదలకు ఇస్కాన్ సంస్థ రేషన్ కూడా అందజేస్తూ వస్తోంది. ఇలా ఎన్నో సేవలతో బంగ్లాదేశ్ ప్రజలను ఆదుకున్న ఇస్కాన్‌పై లేనిపోని ఆరోపణలు చేసి నిషేధం విధించాలనడం బుద్ధి జీవులకు ఆమోదయోగ్యం కాదు.

బంగ్లాదేశ్ ప్రజలకు ఇస్కాన్ చేస్తున్న సేవలు ఇలా ఉండగా– ఆ దేశ ప్రభుత్వానికి భారత సర్కారు ఎన్ని సందర్భాల్లో అండగా నిలిచిందన్నది మరో పెద్ద చరిత్ర! బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలం భారత్. అక్కడి ప్రజలు పోరాటం చేస్తున్నప్పుడు అండగా నిలిచి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పాటు అయ్యేందుకు సైనిక బలగాలను పంపించి అండగా నిలిచిన దేశం మన దేశం!

బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు ఆ దేశ జనాభాలో హిందువులు దాదాపు 20శాతం ఉండేవారు. నేడు చూస్తే అక్కడ హిందూ మైనార్టీలు 8 శాతానికి క్షీణించారు. జనవరి 2013 నుంచి సెప్టెంబర్ 2021 మధ్య కాలంలో హిందూ సమాజంపై కనీసం 3,679 సార్లు దాడులు జరిగాయని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ వెల్లడించింది. అయినప్పటికీ ఆ దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో ఆ దేశ ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి.

ప్రస్తుత బంగ్లాదేశ్ అధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి ఈ అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం. ఈ డిమాండ్ భారతదేశ వ్యాప్తంగా వినిపిస్తోంది. సుమారు 150కు పైగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలు, రిటైర్డ్ సైనికాధికారులు సంతకాలు చేసి, గౌరవ రాష్ట్రపతికి సమర్పించిన వినతిపత్రంలో, చిన్మోయి కృష్ణ దాస్‌ను విడుదల చేసి బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీలను రక్షించాలన్న డిమాండ్‌ను గట్టిగా వినిపించారు.


• డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు
రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

కాంగ్రెస్‌కు జనబలం ఎప్పుడు లభించేను?

ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా, ఎంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లినా భారతీయ జనతా పార్టీ విస్తృతి, ఉధృతిని ఎందుకు అడ్డుకోలేకపోతున్నాం? గెలిచిన రాష్ట్రాల్లోనే బీజేపీ మరీ మరీ ఎందుకు గెలుస్తోంది? గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఎలా సాధిస్తోంది? అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోంది? సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగలదా? అన్న ప్రశ్నలు గత వారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి మనసుల్లో మెదిలాయి. ఎవరి ముఖాల్లోనూ చిరునవ్వు ఏ కోశానా కనపడలేదు. వారు సాధారణ నేతలు కాదు. ఎన్నో యుద్ధాల్లో ఆరితేరినవారు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఎంతగా తలలు బాదుకున్నా తమ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చలో ఎంతసేపూ బీజేపీ మతపరమైన ఎజెండాను, మోదీ ఉపన్యాసాలను, ఈవీఎంలను నిందించినవారే ఎక్కువగా ఉన్నారు. కేవలం ఈవీఎంల వల్లే మనం ఓడిపోయామా? వేరే కారణాలు లేవా? అన్న ప్రశ్నలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో పెద్దగా చర్చించినట్లు లేదు. చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి చేతులు దులుపుకున్నారు. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఆ కమిటీలు ఏమి చెప్పాయో, వాటి ఆధారంగా ఏ నిర్ణయాలు తీసుకున్నారో ఎవరికీ తెలియదు. అయినా కమిటీల వల్ల ఏమి జరుగుతుంది?

తెలుగుదేశం అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో బీజేపీ విజయ రహస్యం గురించి వెల్లడించారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ఎన్నికలకు తయారీగా ఉంటారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కూడా ఆయన ఇప్పటికే సన్నాహాలు మొదలు పెట్టారు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన రోజే నరేంద్ర మోదీ బీజేపీ పార్టీ కార్యాలయానికి వచ్చి వేలాది కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మోదీ, మోదీ అన్న నినాదాలు మిన్నంటుతుండగా 'హమ్ ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ మరోసారి ప్రకటించారు. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. 'మనం కనీసం ఒక ఏడాది ముందైనా ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోంది' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోదీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదన్న విషయం స్పష్టమవుతోంది.

భారతీయ జనతా పార్టీ ఎజెండా, ప్రణాళికకు సంబంధించి ఎవరికీ పెద్ద అనుమానాల్లేవు. మతపరమైన భావోద్వేగాలు, దేశ భక్తిని రంగరిస్తూనే క్రింది స్థాయి నుంచి పార్టీని నిర్మించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతూనే ఉంటుంది. ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంస్థలు, సంఘ్ పరివార్ సంస్థలు ఎప్పుడూ సమావేశాలను, సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు విస్తృతంగా పనిచేస్తుంటాయి. పోలింగ్ బూత్ స్థాయి నుంచి సూక్ష్మ వ్యూహాలు సిద్ధం చేస్తాయి. వీటన్నిటికి తోడు దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా మారడం ఖాయమని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయిస్తూనే ఉంటారు. వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి నినాదాలు మారుమోగుతూనే ఉంటాయి. సరే, ఆ పార్టీకి నిధుల కొరత ఏ మాత్రం ఉండదు కదా.



భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. మరి కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్‌కు భవిష్యత్తు అగమ్యగోచరంగానే ఉంటుంది.

గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఓడినా, గెలిచినా తమ ఓటు శాతం తగ్గకుండా చూసుకుంటుంది. అదే కాంగ్రెస్ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హరియాణలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హరియాణాలో వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. అంటే కనీసం డజన్ రాష్ట్రాల్లో బీజేపీ మిత్రపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తున్నాయన్నమాట. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. తెలుగుదేశం ఒకసారి ఓడినా మరోసారి వీరోచితంగా పోరాడి అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అసలు దేశ అభివృద్ధి నమూనా విషయంలో కాంగ్రెస్ విధానాలకూ, బీజేపీ విధానాలకూ తేడా ఏమైనా ఉన్నదా? 'అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు?' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ జన్మించిందని జనం అనుకునే అవకాశాలున్నాయా? ఏ విషయంలో కాంగ్రెస్ తాను బీజేపీ కంటే భిన్నమైన సైద్ధాంతిక సంస్థ అని నిరూపించుకోగలదు? కాంగ్రెస్ పార్టీ రకరకాల సిద్ధాంతాలు ఉన్న పంచకూళ కషాయంలా ఉంటుంది. బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. మహావికాస్ అగాధీకి మహారాష్ట్రలో కేవలం ముస్లిం ఓట్లే అధికంగా వచ్చాయని, మహాయుతికి ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ఓట్లు పెరిగాయని గణాంక వివరాలు చెబుతున్నాయి. మహిళలు, యువకులు మహాయుతివైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అలా ఎందుకు జరిగింది?

2024 ఎన్నికలకు రెండేళ్ల ముందు పార్టీ ముందున్న సవాళ్లను నిర్ణయించి వాటిని అధిగమించేందుకు కురువృద్ధులైన నేతలతో సోనియా ఒక సాధికార బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఏమి చెప్పిందో, చెప్పిన వాటిని అమలు చేశారో, లేదో తెలియదు కాని ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అనుకున్నంత మేరకు ఫలితాలను సాధించలేకపోయారు. సమకాలీన అంశాలపై చర్చించి పార్టీ దృక్పథాన్ని రూపొందించేందుకు నియమితులయిన సభ్యులు కూడా పార్టీకి నిర్దిష్టమైన సైద్ధాంతిక స్వరూపాన్ని రూపొందించలేకపోయారు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచించేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ఏ పెను మార్పులూ జరగలేదు. నిరంతర ఉద్యమాలు చేసే విషయంపై నిర్ణయించేందుకు, పార్టీని ఆధునికీకరించేందుకు ఏర్పర్చిన కమిటీలు ఏం చెప్పాయో కూడా ఎవరికీ తెలియదు. బహుశా ఈ కమిటీ నివేదికలు ఏఐసీసీ లైబ్రరీలో దుమ్ము కొట్టుకుపోతూ ఉంటాయి! ఇక 'కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి' అని ఖర్గే అన్నప్పటికీ ఆ నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారో చెప్పలేము. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలే అన్ని నిర్ణయాలు తీసుకున్నాయి' అని ఖర్గే సమావేశంలో వాపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనగల నవనవోన్మేషమైన శక్తిగా ఆవిర్భవించగలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. కార్పొరేటర్ స్థానాన్ని కూడా గెలవలేని ఏడు పదులు దాటిన సీనియర్ నేతలు తమ గుర్తింపు కోసం తరుచూ విలేఖరుల సమావేశాలు నిర్వహించడం, ఎవరూ పట్టించుకోకపోయినా తమ అమూల్యమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం కాంగ్రెస్‌లోనే ఎక్కువ కనపడుతుంది. రాహుల్ గాంధీతో పాటు కొందరు నేతలు జనంలోకి వెళుతూ, ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, కార్మికులు, యువతతో సంభాషిస్తూ కనపడుతున్నారు. కానీ ఎంతో కష్టపడి కాంగ్రెస్ తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకున్నా ఆ వాతావరణం ఓట్లుగా మారేందుకు తగిన పరిస్థితులను కల్పించుకోలేకపోతోంది. 'సానుకూల వాతావరణం ఉంటే చాలదు దాని వల్ల విజయాలు రావు. అనుదినమూ ఇరవై నాలుగు గంటలూ పనిచేయాలి' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో సరిగానే అన్నారు.

అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే ఆధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్‌కు భవిష్యత్తు అగమ్యగోచరంగానే ఉంటుంది

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

నిరుద్యోగుల జేజేలందుకున్న పాలన!

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్పష్టమైన డిమాండ్లకు మద్దతుగా, రాజకీయ ఆత్మహత్య వంటి సాహస చర్యకు పూనుకొని, నాడు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పార్లమెంట్‌లో తెలంగాణ బిల్ పాస్ చేయించారు. కానీ తెలంగాణ సాకారానికి తాను మాత్రమే కార్యసాధకుడనని ప్రకటించుకున్న కేసీఆర్ ప్రజలను నమ్మించి గద్దెనెక్కాడు. ఆ తర్వాతి పదేళ్ళ పాలనలోనూ ఉద్యమ కాల నినాదాలన్నింటినీ తుంగలో తొక్కాడు.

ముఖ్యంగా నాడు తెలంగాణ కోసం రగిలిన నిరుద్యోగులను నిలువునా ముంచాడు. వేసిన కొద్దో గొప్పో ఉద్యోగాలకు సంబంధించిన పరీక్ష ప్రశ్న పత్రాలు కూడా లీకేజీల పాలైన పాలనలో నిరుద్యోగులు దిక్కుతోచని స్థితిలో మిగిలిపోయారు. రాష్ట్ర ఏర్పాటే తెలంగాణ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మూలం అని నమ్మి, నాటి సీమాంధ్ర ప్రభుత్వంపై విరోచితంగా కలబడ్డ నిరుద్యోగ లోకం కేసీఆర్ పాలనపై అగ్గయి మండింది. ఫలితంగా, ప్రజా వ్యతిరేక పాలనపై విజయ దుందుభి మోగిస్తూ 2023 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ఆరంభమైంది. రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని టీజీపీఎస్సీ పని విధానంపై దృష్టి సారించి దాన్ని ప్రక్షాళన చేశారు. గతంలో అవినీతికి పాల్పడిన వారిని తొలగించి నిజాయితీపరులకు పగ్గాలు అప్పగించారు. సమర్థవంతంగా గ్రూప్–1 పరీక్షలకు సంబంధించిన ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను నిర్వహించి నిరుద్యోగులలో విశ్వాసాన్ని పెంచారు.



రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని టీజీపీఎస్సీ పని విధానంపై దృష్టి సారించి దాన్ని ప్రక్షాళన చేశారు. సమర్థవంతంగా గ్రూప్–1 పరీక్షలకు సంబంధించిన ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను నిర్వహించి నిరుద్యోగులలో విశ్వాసాన్ని పెంచారు.

గత ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్ తోకచుక్కలాగా ఎప్పుడో వచ్చేది. ఒకవేళ నోటిఫికేషన్ వచ్చినా పరీక్ష నిర్వహణలోనూ, తేదీలలోనూ ఎంతో గందరగోళం ఉండేది. చివరికి తేదీల ప్రకటన వచ్చినా పేపర్ లీకేజీలతోనో లేదా అస్తవ్యస్తమైన నిర్వహణతోనో ఉద్యోగ పోటీదారులకు కంటిమీద కునుకు ఉండేది కాదు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ అగచాట్లకు చరమగీతం పాడుతూ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. దీంతో ప్రణాళికబద్ధంగా మసలుకునే అవకాశం వచ్చి ఉద్యోగ ఆశావాహులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పునాది స్థాయిలోనే విద్యావ్యవస్థ ధ్వంసమైన స్థితిని గమనించిన రేవంత్‌రెడ్డి పునర్నిర్మాణం కోసం విద్యా కమిషన్‌ను రూపొందించారు. విశిష్ట అనుభవం కలిగిన వారిని విద్యా కమిషన్‌లో నియమించి పటిష్టమైన విద్యా వ్యవస్థ నిర్మాణం కోసం చర్యలు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో యూనివర్సిటీలలో వీసీల నియామకం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపు ఉండేది. కానీ నేటి ప్రభుత్వం అతి తక్కువ కాలవ్యవధిలోనే బోధనా పరిశోధనా రంగంలో ముందు వరుసలో ఉండే వారికి సామాజిక వర్గాల వారీగా అవకాశం కల్పిస్తూ అత్యుత్తమ ఆచార్యులను వీసీలుగా నియమించింది.

ఒకవైపు యూనివర్సిటీల పునర్నిర్మాణం వైపు అడుగులు వేస్తూనే, మరోవైపు స్కిల్ యూనివర్సిటీతో అవకాశాలు పెంచేందుకు సర్వం సిద్ధం చేశారు రేవంత్‌రెడ్డి. తెలంగాణలోని ఫార్మా, నిర్మాణం, ఈ–కామర్స్, రిటైల్, విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ లాంటి తదితర 17 ప్రధాన డిమాండ్ కలిగిన రంగాలను ఎంపిక చేశారు. వాటిలో ఉద్యోగ అవకాశాలను పెంచేందుకు స్కిల్స్‌ని అభివృద్ధి చేయటం కోసం స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించారు. దీని కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో 100ఎకరాల భూమిని, 100కోట్ల రూపాయలను వెచ్చించి ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రను ఛైర్మన్‌గా నియమించి విధివిధానాలను తయారు చేసింది. ఈ స్కిల్ యూనివర్సిటీకి వీసీగా కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ ఎకానమీ అడ్వైజర్‌గా పనిచేసిన వి.ఎల్.వి.ఎస్.ఎస్ సుబ్బారావును నియమించారు. ఈ విద్యా సంవత్సరంతోనే బోధన మొదలైంది. ఇప్పటికే 50 వేలకు పైగా ఉద్యోగాలు నింపి, మరిన్ని వేగంగా నింపడం కోసం వడిగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి నిరుద్యోగుల జేజేలు.

■ చనగాని దయాకర్
టీపీసీసీ అధికార ప్రతినిధి


హామీలపై ఆత్మ విమర్శకిది తరుణం!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పని జనాకర్షక తాయిలాలను కూడా అధికారంలోకి వచ్చాక అమలు చేసింది. అదే సమయంలో అహంకారపూరితంగా నియంతృత్వ పోకడలతో పాలిస్తూ ప్రశ్నించేవాళ్ళ గొంతు నొక్కింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలను కూడా సరిగ్గా అమలు చేయలేకపోతున్నది.

ఎన్నికల హామీలను అమలు చేసి సంబరాలను జరిపితే బాగుండేది. చెప్పిన హామీలను ఏదీ సంపూర్ణంగా అమలు చేయకుండా అన్నీ చేసినట్టు బుకాయిస్తున్నారు. మహాలక్ష్మి పథకం పేరుతో రూ.2500 ఇస్తానన్న పథకానికి మహిళలు బాగా ఆకర్షితులైనారు. ఈ పథకం మహిళా ఓట్లు రాబట్టేందుకు పనిచేసింది. కానీ ఇది ఇంతవరకు అమలులోకి రాలేదు. ఇక రైతులకు ఇస్తానన్న రైతు భరోసా పథకంలో ఎకరాకు రూ.15 వేలు ఏడాది దాటినా ఇంతవరకు ఇవ్వలేదు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12వేలు కూడా ఇవ్వలేదు. ఈ రెండు పథకాలూ అమలు చేయకపోవటం వల్ల వ్యవసాయదారులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత ప్రభుత్వం అప్పులు తెచ్చి అయినా సమయానుసారంగా రైతుల ఖాతాల్లోకి డబ్బును జమ చేసింది. ఇక రుణమాఫీ పథకం చాలా కుటుంబాలకు అందకపోవటం వల్ల అసంతృప్తి పెరుగుతున్నది.

ప్రస్తుత ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ ఏడాది వేడుకలకు ముందు అప్పులు లభిస్తే అందరికీ సర్దే పనిలో ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఈ కారణాల వల్ల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అంతగా ప్రజల్లోకి వెళ్ళలేకపోతున్నారు. ఇక ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం అయినా ఈ రుణమాఫీ, రైతు భరోసా నిధులను సర్దక తప్పని పరిస్థితి నెలకొంది. ఇక వృద్ధులకు, దివ్యాంగులకు, వివిధ వృత్తుల వారికి ఇచ్చే పింఛన్లు 'చేయూత' పేరుతో పెంచుతామన్నా అమలు జరగడం లేదు. 'ఇందిరమ్మ ఇళ్ళు' అంటూ ఆర్భాటంగా ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఒక్క ఇంటికి పునాది రాయి పడింది లేదు. తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్‌ను రంగరించి జోడించిన ఉద్యమకారులకు ఇంటి స్థలాల పథకం గురించి ఊసే లేదు. ఇక 'యువ వికాసం' లాంటి పథకాల ఆలోచన అంతకన్నా లేదు. 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతామని ఆర్భాటంగా ప్రకటించినా ఉన్న బకాయిలే విడుదల కాక అసలుకే వైద్యం అందని పరిస్థితి ఉంది. ఇక చెప్పుకోదగ్గవి– కొన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం, కొన్ని పాత నోటిఫికేషన్‌లకు నియామక పత్రాలు ఇవ్వడం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై కూడా ఇంతవరకు దృష్టి సారించలేదు. ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారంటీలకు తీసుకున్న కోటీ ఇరవై అయిదు లక్షల దరఖాస్తులు బుట్టదాఖలు అయ్యాయి. 'గృహజ్యోతి' లాంటి పథకాల లబ్ధి అనర్హత పేరుతో కొంతమందే పొందగలిగారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంలో కూడా వంద రోజుల్లో అన్ని హామీలనూ అమలు చేస్తామని పదే పదే చెప్పారు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా కేవలం అధికారంలోకి రావాలన్న కోరికతో అలవికాని హామీలను ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయలేక నానా తంటాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలపై ఆత్మ విమర్శ చేసుకుని ఇప్పటికైనా హేతుబద్ధంగా ఆలోచించాలి. స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడే ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రభుత్వాలు నడపలేమని చేతులెత్తేశారు. ఇది అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అంగీకరించాల్సిన విషయం. గొప్పలకు పోయి అభాసుపాలు కావడం కంటే ఉన్నదానితో ఏం చేయగలమో వాటి అమలుకు పూనుకోవటం మంచిది. భేషజాలకు పోకుండా ప్రజలకు వాస్తవాలను చెప్పి కొన్ని హామీలను ఉపసంహరించుకుంటే తప్పులేదు. పైగా అభినందనీయం కూడా.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంలో కూడా వంద రోజుల్లో అన్ని హామీలనూ అమలు చేస్తామని పదేపదే చెప్పారు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా కేవలం అధికారంలోకి రావాలన్న కోరికతో అలవికాని హామీలను ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయలేక నానా తంటాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలపై ఆత్మ విమర్శ చేసుకుని ఇప్పటికైనా హేతుబద్ధంగా ఆలోచించాలి. గొప్పలకు పోయి అభాసుపాలు కావడం కంటే ఉన్నదానితో ఏం చేయగలమో వాటి అమలుకు పూనుకోవటం మంచిది.




ప్రస్తుత ప్రభుత్వం రాజకీయంగా ప్రతిపక్షాలను ఎదుర్కోవటంలో చూపిస్తున్న సమర్థత పాలనలో చూపించలేకపోతున్నది. హైడ్రా, మూసీ సుందరీకరణ లాంటి వివాదాస్పదమైన నిర్ణయాలు తీసుకోవడంలో, అమలు చేయడంలో సమన్వయం కొరత స్పష్టంగా కనబడుతున్నది. ఇచ్చిన హామీలు అమలుకే నిధుల కొరత ఉంటే మూసీ ప్రక్షాళన లాంటి కార్యక్రమాలకు ఎలా నిధులు సమకూర్చుతారన్న దానిపై స్పష్టత లేదు. హామీల అమలులో విఫలం అవుతున్నప్పటికీ, ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా తనపై వ్యతిరేకత పెంచుకోకుండా రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడంలో మాత్రం సఫలీకృతం అవుతున్నారు.

ఇక కాంగ్రెస్ హామీల అమలు గురించి కేటీఆర్ మాట్లాడటం వల్ల బీఆర్ఎస్‌కు సానుభూతి దక్కుతుందనుకోవటం అవివేకం. కేటీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించటం ఆయనకు అతికినట్టుగా లేదు. ఆయన హావభావాలు, మాట తీరు వల్ల సానుభూతి కాదు కదా వ్యతిరేకత పెరుగుతున్నది. ఇప్పటికీ కేసీఆర్ పట్ల జనంలో అభిమానం గౌరవం ఉన్నాయి. ఇవే విమర్శలను కేసీఆర్ చేస్తే అది బీఆర్ఎస్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చవచ్చు. అందుకు భిన్నంగా కేటీఆర్ ఇదే విధంగా మాట్లాడుతూపోతే మాత్రం ఆ పార్టీకి మంచి ఏమీ జరగదు. బీజేపీ కూడా ఆశించిన స్థాయిలో స్థానిక హామీల అమలు గురించి నిలదీయలేకపోతున్నది. రాష్ట్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి దాకా పదేళ్ల బీఆర్ఎస్ పాలననూ, ఏడాది పాటు కాంగ్రెస్ పాలననూ చూసిన ప్రజలు పాలనాపరంగా బీజేపీని ఎంచుకోవాలంటే వారు మూస ధోరణిని విడనాడక తప్పదు.

○ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 4 డిసెంబరు 2024

సమస్యలతో డీలార్లు!

స్వరాష్ట్రంలోనూ తప్పని తిప్పలు

- వినతులు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- హామీలతోనే ఏళ్లతరబడి జాప్యం
- గౌరవ వేతనం రూ.3వేలు బుట్టదాఖలు
- ప్రతీ నెలా జమ కాని కమీషన్
- తూకం తక్కువతో జేబులకు చిల్లులు
- నెలంతా కష్టపడితే చివరకు మిగిలేది రిక్తహస్తాలే..

హనుమకొండ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో రేషన్ డీలర్లు కొట్టుమిట్టాడుతున్నారు. పాలకులకు ఏళ్ల తరబడి మొర పెట్టుకుంటున్నా.. మోక్షం లభించడం లేదు. నెల రోజులుగా కష్టపడితే చివరకు మిగిలేది రిక్త హస్తాలే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సమస్యలు తీరుతాయని గంపెడు ఆశలు పెట్టుకున్న డీలర్లకు నిరాశే ఎదురైంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిమాండ్లు తీరుస్తామనే హామీలు డీలర్లను ఊరిస్తూ వచ్చాయి. ఏ ఒక్క సమస్య తీరలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ డీలర్లకు హామీలు గుప్పించింది. అతి ప్రధానమైన రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ఏడాది గడిచినా ఆ మాట కార్యాచరణకు నోచుకోలేదు. ఇలా ఎన్నో సమస్యలు పాలకులకు ఎప్పటికప్పుడు విన్నవిస్తున్నా.. కనీసం చర్చలు కూడా జరపడం లేదనే ఆవేదన డీలర్లను వేధిస్తోంది. ప్రజాపాలనలో తమ కష్టాలు తీరుతాయనే నమ్మకం డీలర్లలో సన్నగిల్లుతోంది.

గౌరవ వేతనం కోసం పోరాటం

రేషన్ డీలర్ల ప్రధాన సమస్య గౌరవ వేతన కల్పన. నెలకు రూ.30వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని డీల్లరు దశాబ్దకాలానికి పైగా పోరాడుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గౌరవ వేతనం కల్పిస్తున్న తరుణంలో తెలంగాణలో డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్‌పై గత ప్రభుత్వం డీలర్లకు న్యాయం చేస్తామని ప్రకటించింది. కానీ పదేళ్లలో ఈ అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వం పెదవి విప్పలేదు. ఇక 2023లో జరిగిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు. రూ.5వేల గౌరవ వేతనం కల్పిస్తామనే హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచినట్లు డీలర్లు అంటున్నారు. అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవ వేతనం అందివ్వాలని విన్నవిస్తున్నారు.

మినీ సూపర్ మార్కెట్లుగా..

ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 'అమ్మహస్తం' పథకం అమలు జరిగింది. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇతర మొత్తంగా 9 నిత్యావసర వస్తువుల విక్రయం జరిగేది. ఇది డీలర్లకు కాస్త లాభసాటిగానే మారింది. ఆర్థిక ఇబ్బంది సమస్యను తీర్చింది. రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అమ్మహస్తం పథకం నిలిచిపోయింది. కేవలం రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. తిరిగి నిత్యావసరాల విక్రయం జరిపేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీలర్లు వేడుకుంటున్నారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారిస్తే న్యాయం చేసినట్లు అవుతుందంటున్నారు.

సకాలంలో అందని కమీషన్ డబ్బులు

రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు ప్రతీ నెల క్రమంగా అందడం లేదు. రెండు నెలలు ఒక్కోసారి, మూడు నెలలకు కమీషన్ డబ్బులు అకౌంట్లలో జమ అవుతున్నాయి. నెలవారిగా డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ నెల క్రమంగా డబ్బులు ఇవ్వాలనే డిమాండ్ సైతం ప్రభుత్వం పట్టించుకోకపోవడం వేధిస్తోందని డీలర్లు వాపోతున్నారు.

చివరకు మిగిలేది రిక్తహస్తాలే..

ఎంత కష్టం చేసినా చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. దిగుమతి చార్జీలు సైతం తామే భరించడం వల్ల ఏమీ మిగలడం లేదంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలరు వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను దిగుమతి చేసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తంగా రూ.2 వేల వరకు భరించాల్సి వస్తోంది. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.140 చొప్పున మొత్తంగా రూ.14000 కమీషన్ రూపంలో డీలర్‌కు లభిస్తుంది. ఈ ఆదాయంలో షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ వేతనం ఇతరత్రా ఖర్చుల చెల్లింపులు జరిగితే మిగిలేది ఏమీ ఉండడం లేదని డీలర్లు చెబుతున్నారు. ఈ క్రమంలో దిగుమతి చార్జీలు మరో భారంగా మారాయంటున్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి దిగుమతి చార్జీలను భరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని ద్వారా డీలర్‌కు నెలకు రూ.2వేలు మిగిలే అవకాశం ఉంటుందంటున్నారు. ఇక దిగుమతి అయ్యే బస్తాల కాంటా సరిగా ఉండడం లేదు. బస్తాకు రెండు కిలోల బియ్యం తూకం తక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో ఈ భారాన్ని కూడా మోయాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో డీలర్లకు సరఫరా జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రధాన డిమాండ్లతో పాటు షాపు రెన్యూవల్ శాశ్వత ప్రాతిపదికన జరగాలని, ప్రతీ నెల 1వ తారీఖు లోగానే బియ్యం సరఫరా చేయాలని, ప్రభుత్వమే రేషన్‌షాపుల కోసం భవనాలను నిర్మించి ఇవ్వాలనే తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డీలర్లు వేడుకుంటున్నారు.

మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలి..

బత్తుల రమేశ్, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



బత్తుల రమేశ్, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు :రేషన్ డీలర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించాలి. గౌరవ వేతనం రూ.30వేలు కల్పించాలనేది మా డిమాండ్. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రూ.5వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం కూడా అమల్లోకి రాలేదు. డీలర్ మృతిచెందితే తక్షణ ఆర్థిక సహాయంగా ప్రభుత్వం రూ.30వేలు ఆ కుటుంబానికి అందించాలి. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతులు సమర్పిస్తున్నాం. లేకుంటే మా పోరాటాన్ని కొనసాగిస్తాం.

మనోసంకల్పం ముందు వైకల్యం అవరోధమే కాదు

- హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



ఉద్యోగులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వడ్డెపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మనోసంకల్పం ముందు వైకల్యం అవరోధమే కాదని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వైకల్యం ఉన్నదని బాధపడకుండా భవిష్యత్‌పై దృష్టిసారించి జీవితాన్ని మలుచుకోవాలని పిలుపునిచ్చారు. వైకల్యం ఉన్నస్థితి నుంచి అత్యున్నత స్థితికి ఎదిగిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ దిశగా పయనించి ఎదగాలని కోరారు. వైకల్యాన్ని అధిగమించి క్రమశిక్షణతో చదువుకొని జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా బన్ను, మల్లికాంబ, స్పందన, అతిథి, వికాస్, లిటిల్ ఫ్లవర్స్ సంస్థల చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన దివ్యాంగులకు, ఉద్యోగులకు కలెక్టర్ ప్రావీణ్య బహుమతులతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు సర్దార్ దర్శన్‌సింగ్, ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీఆర్‌డీవో మేన శ్రీను, ఏపీడీ శ్రీనివాసరావు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి, ప్రముఖ కవి, విద్యా ఫౌండేషన్ చైర్మన్ బిల్లా మహేందర్, డాక్టర్ వెంకట్రాంరెడ్డి, సీడీపీవోలు విశ్వజ, స్వరూప, స్వాతి, కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో రవికృష్ణ, ఇన్‌చార్జి డీసీపీవో ఎస్.ప్రవీణ్‌కుమార్, కల్యాణి, సుమలత, అరుణ, స్వర్ణలత, దివ్యాంగుల కమిటీ జిల్లా బాధ్యులు శ్రీనివాస్, ధనుంజయ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మామునూరు అనువైన ప్రదేశమని, ఇక్కడ నిర్మించినట్లయితే వరంగల్ చుట్టుపక్కల ప్రాంతాలు పారిశ్రామిక కేంద్రంగా ఎదిగేందుకు అవకాశముందని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. ఎయిర్‌పోర్టు ఆప్టికల్ సర్వే నిపుణుల బృందం ఢిల్లీ నుంచి మంగళవారం మామునూరుకు చేరుకొని ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలను సర్వే చేశారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్‌లో ఆర్కిటెక్ట్ డీజీఎం మల్లిక, ఏజీఎం సివిల్ ఇంజనీర్ జి.నటరాజ్, శ్రీనివాస్ భార్గవ్‌లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, సర్వే ల్యాండ్ ఏడీ భోజరాజు తదితరులు పాల్గొన్నారు.



చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న బీజేపీ శ్రేణులు

మంత్రి ఉన్నా.. వరంగల్ అభివృద్ధి శూన్యం

- ఏం చేశారని ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ సంబరాలు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కాంగ్రెస్ ఏడాది పాలన చార్జిషీట్ కార్యక్రమం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నుంచి మంత్రి ఉన్నా.. వరంగల్ అభివృద్ధికి ఎలాంటి దోహదం చేయడం లేదని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై మంగళవారం వరంగల్‌లోని రత్న హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా బీజేపీ నాయకులు చార్జిషీటు విడుదల చేశారు. ఈ సందర్భంగా గంట మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఏడాది కాలం వెల్లదీసి సంబురాలంటూ ప్రజాధనం దుర్వినియోగం చేయడం సిగ్గుచేటన్నారు. ఏడాది కాలంలో ఏం సాధించారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలను విస్మరించిన కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడం ఏంటన్నారు. నోటికొచ్చిన హామీలిచ్చి వాటిని నెరవేర్చక కుంటిసాకులు చెబుతున్నారన్నారు. ఏడాది కాలంలోనే రూ.46వేల కోట్ల అప్పు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల కోట్ల రూపాయలను కేసీఆర్ దుర్వినియోగం చేస్తే.. మూసీ ప్రక్షాళనంటూ రేవంత్‌రెడ్డి వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై

మిగతా 4వ పేజీలో...

బ్యాంకు రిటైర్డు మేనేజర్ దారుణ హత్య

- కాళ్లు, చేతులు కట్టేసి కిరాతకంగా ఘాతుకం
- రంగంపేటలో కారులో మృతదేహాన్ని వదిలివెళ్లిన దుండగులు
- మృతుడు హనుమకొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన రాజమోహన్‌గా గుర్తింపు
- అన్ని కోణాల్లో విచారణ చేస్తున్న పోలీసులు



కాళ్లు, చేతులు కట్టేసి కారులో ఉన్న రాజమోహన్ మృతదేహం



రాజమోహన్ (ఫైల్)

ఇనుప గొలుసులతో..

బ్యాంకు రిటైర్డు మేనేజర్ రాజమోహన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతంగా హత్య చేశారు. పథకం ప్రకారం ఇనుప గొలుసులతో కాళ్ల, చేతులను కట్టేసి దారుణంగా హతమార్చారు. అతడి తలపైన, మెడపైన తీవ్ర గాయాలయ్యాయి. ఈ హత్య ఎవరు? ఎందుకు చేశారు? అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎక్కడో చంపేసి మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి మంగళవారం తెల్లవారుజామున 3.40 గంటలకు వదిలి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది.

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో బ్యాంకు రిటైర్డు మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ హత్యకు గురయ్యారు. కాళ్ల చేతులను గొలుసులతో కట్టేసి రంగంపేటలో కారులో మృతదేహాన్ని వదిలివెళ్లారు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ శ్రీనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్‌కు చెందిన ఎలిగేటి రాజమోహన్ (64) ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. 2021లో భార్య మృతి చెందడంలో ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తె శిరీష అమెరికాలో, చిన్న కుమార్తె స్ఫూర్తి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సోమవారం రాత్రి పెద్దకుమార్తె శిరీష. తండ్రికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటి సమీపంలో ఉన్న మిత్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూశారు. రాజమోహన్ ఇంట్లో లేరని, కారు కూడా లేదని శిరీషకు చెప్పారు. తర్వాత రాత్రి 12 గంటలకు రాజమోహన్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయింది. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు రాజమోహన్ మిత్రులు మంగళవారం ఉదయం సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే వరంగల్ రంగంపేట పాత ఏకశిల హోటల్ సందులో ఓ కారులో మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా వారికి సమాచారం అందింది. వెంటనే వెళ్లి పరిశీలించారు. మృతదేహం రాజమోహన్‌దేనని గుర్తించారు.

ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్

రాజమోహన్ శరీరంపై ఉన్న గాయాలను, కారుపై ఉన్న వేలిముద్రలను క్లూస్‌టీమ్ పోలీసులు సేకరించారు. డాగ్ స్క్వాడ్ బృందం పరిసరాలను తనిఖీ చేసింది. అదే విధంగా రాజమోహన్ సోమవారం ఎవరెవరికి ఫోన్ చేశారని పోలీసులు కాల్ డాటాను పరిశీలిస్తున్నారు. చివరిగా ఫోన్ ఎక్కడ స్విచ్‌ఆఫ్ అయిందనే కోణంలో విచారణ చేపట్టారు. రంగంపేటకు కారు ఎటువైపు నుంచి వచ్చిందని తెలుసుకునేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సాంకేతిక ఆధారాలను సేకరించేందుకు పలు కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు.

రంగంపేటను పరిశీలించిన పోలీసులు

రాజమోహన్ మృతదేహం ఉన్న కారును, ఆ ప్రాంతాన్ని మంగళవారం డీసీపీ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపీ పరిశీలించారు. రాజమోహన్ కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద వివరాలను సేకరించారు. బంగారం కోసమే హత్య చేశారా..? లేకపోతే ఇతర ఆర్థిక లావాదేవీల కోసం హత్య చేశారా..? అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఎస్సైలు బదిలీ

హనుమకొండ టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న జి.శ్రీదేవిని వెస్ట్‌జోన్‌లోని తరిగొప్పుల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా, నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న టి.ప్రశాంత్‌బాబును గీసుగొండకు బదిలీ చేశారు.

ఘనంగా అర్బన్ డే వేడుకలు

- 2కే రన్‌ను ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- బల్దియా పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ



జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 03 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం అర్బన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు 2కేరన్‌తో పాటు శానిటేషన్ కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ముందుగా ఉదయం 8 గంటలకు ములుగురోడ్డులోని కాకతీయ మెడికల్ కళాశాల నుంచి 2కేరన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవిలు సంయుక్తంగా జెండా ఊపి పరుగును ప్రారంభించారు. ఈ పరుగులో యువకులు పెద్ద ఎత్తున హాజరై క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. కేఎంసీ నుంచి ఎంజీఎం సమీపంలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఇండోర్ స్టేడియం వరకు 2కే రన్ కొనసాగింది. తర్వాత ఇండోర్ స్టేడియంలో అతిథులు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 500 మంది శానిటేషన్ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించినట్లు సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి తెలిపారు. బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బందికి పీపీఈ కిట్లతో పాటు మందులు అందించారు.

ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బల్దియాలో శానిటేషన్ విభాగం చాలా కీలకమైందని, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే నగరం శుభ్రంగా ఉంటుందని అన్నారు. శానిటేషన్ సిబ్బందికి ఏదైనా సమస్యలుంటే తనను నేరుగా కలవాలని వెల్లడించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లం రాజేశ్, కార్పొరేటర్లు విజయలక్ష్మి, విజయశ్రీ రజాలీ, సురేష్ జోషి, వస్కుల బాబు, బస్వరాజు కుమార్, తేజస్వీ, మామిండ్ల రాజు, సునిల్, సులోచన, జన్ను షిబారాణితో పాటు అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జి సీపీ రవీందర్, డీఆర్‌వో గణేశ్, డీఆర్‌డీవో శ్రీను, డీసీలు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి స్మార్ట్‌సిటీ అధికారి భాస్కర్‌రెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగంలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు



క్రీడా పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబర్ 3:(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ఈ క్రీడా పోటీల ముగింపు వేడుకలకు కరీంనగర్ పీటీసీ సీఐ ఎం.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో పాల్గొని రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. బాక్సింగ్‌లో ప్రపంచ బాక్సర్‌గా రాణించిన నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్‌జరిన్ వర్ధమాన క్రీడాకారులకు ఆదర్శమని కొనియాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించడం ఎంతో అవసరమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడంద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. పట్టుదల క్రమశిక్షణతో సాధన చేయడంతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి పార్థసారధి మాట్లాడుతూ.. రెండురోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో తొలిరోజు అండర్-17 బాలికల విభాగంలో పోటీలు నిర్వహించగా, రెండో రోజు అండర్-19 బాలికలకు నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 50మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవ్‌రావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాడ సుభాష్‌రెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మంచాల స్వామిచరణ్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ ప్రభుదాస్, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా సమాఖ్యకు మహా భవనం

● సకల సౌకర్యాలతో ఇందిరా మహిళా శక్తి భవన్ ● నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించిన ప్రభుత్వం ● హసన్‌పర్తిలో ఎకరం స్థలం ఎంపిక.. తీరనున్న ఇబ్బందులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమల నిర్వహణ, బ్యాంకు లింకేజీ లక్ష్యసాధన, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తీసుకునే నిర్ణయాలను పక్కాగా అమలు చేయడానికి జిల్లా మహిళా సమాఖ్య వేదిక అవుతోంది. ప్రతీ నెల జిల్లా ఉన్నతాధికారుల సమీక్షలతో పాటు శిక్షణలు, ఇతర సమావేశాల నిర్వహణకు మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంతగానో ఉపయోగ పడుతోంది. అయితే జిల్లాలో ప్రస్తుతం ఉన్న భవనం ఇరుకుగా ఉండటం, రెండు జిల్లాలకు కలిపి ఒకే భవనం ఉండటంతో జిల్లాకు చెందిన మహిళలు మీటింగ్‌లు పెట్టుకోవడానికి ఎంతో ఇబ్బంది పడేవారు. అయితే ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని 22 జిల్లాల్లో నూతనంగా ఇందిరా మహిళా శక్తి భవన్‌లు నిర్మించడానికి పూనుకుంది. ఈ భవనం హనుమకొండ జిల్లాకు కూడా మంజూరైంది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాలకు కలిపి ఒకే భవనం

హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిపి ఒకే మహిళా సమాఖ్య భవనం ఉండటంతో రెండు జిల్లాల మహిళలు మీటింగ్‌లు పెట్టుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఇప్పటివరకు వరంగల్‌లోని భీమా భవన్‌లో హనుమకొండ జిల్లాకు సంబంధించి మహిళా సమాఖ్య మీటింగ్‌లు జరుగుతున్నాయి. ప్రతీ నెల ఈ భవన్‌లో సమావేశాలు జరుగుతున్నాయి. అలాగే ఆడిట్ నిర్వహణ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల మహిళా సంఘాల సభ్యులు ప్రతీనెల ఈ భవన్‌లో మీటింగ్‌లు నిర్వహించడంతో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు. ప్రభుత్వం జిల్లాకు ఇందిరా మహిళాశక్తి పేరుతో నూతన భవనం మంజూరు చేయడంతో జిల్లా మహిళా సమాఖ్య మహిళలకు ఉపశమనం కలగనుంది.



ఇందిరా మహిళాశక్తి భవన్ నమూనా

రూ.5కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం

రాష్ట్రప్రభుత్వం 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవన్‌లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఒక్కో జిల్లాకు రూ.5కోట్ల నిధులు కేటాయించింది. ఇందుకోసం హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనక ఉన్న టీటీడీసీలో ఎకరం స్థలాన్ని ఎంపిక చేసింది. త్వరలోనే పంచాయతీరాజ్‌శాఖ టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించనున్నారు. భవన్‌లో ఓపెన్ ఎయిర్ థియేటర్, భోజన శాల, శిక్షణ గదులు, కార్యాలయ సిబ్బందికి గది, మహిళల మీటింగ్‌లకు ప్రత్యేక గది, రెస్ట్ తీసుకోవడానికి గదుల లాంటి సకల సౌకర్యాలు ఉండనున్నాయి.

జిల్లాలోని మహిళా సమాఖ్య వివరాలు

మండల సమాఖ్యలు	- 12
గ్రామైక్య సంఘాలు	- 397
స్వయం సహాయక సంఘాలు	- 10,187
సంఘాల సభ్యులు	- 1,14,351

జిల్లాకే తలమానికం మహిళా శక్తి భవన్

మేన శ్రీనివాస్, డీఆర్‌డీవో



ప్రభుత్వం మహిళా సమాఖ్య సభ్యుల కో సం జిల్లాలో నూతనంగా నిర్మించే ఇందిరా మ హిళా శక్తి భవన్ జిల్లాకే తలమానికం కాను ంది. ప్రస్తుతం రెండు జిల్లాలకు కలిపి ఒకే భ వన్ ఉండడంతో మీటింగ్‌ల సమయంలో మహిళలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లాకు సొంత భవనం త్వరలో నిర్మాణం కాబోతుండటంతో మహిళా సంఘాల సభ్యులకు మీటింగ్‌లకు, ట్రైనింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

మహిళా సంఘాలు మరింత పటిష్టమవుతాయి

అనిల్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్



నూతన భవనం నిర్మాణంతో మహిళా సంఘాలు మరింత పటిష్టపడి స్వయం సమృద్ధిని సాధిస్తాయి. ఈ భవన నిర్మాణం జరగడం ద్వారా మహిళలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. స్థానికంగా మెరుగైన శిక్షణలు లభిస్తాయి. జీవనోపాదుల మెరుగుదల కొరకు నాణ్యమైన శిక్షణలు స్థానికంగా అందుబా టులోకి వస్తే మహిళల ఎదుగుదలకు మరింత దోహదమవుతుంది.

భవనం మంజూరు చేయడం ఆనందంగా ఉంది

ఇ.రజిత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు



ఇందిరా మహిళా శక్తి భవన్ పేరుతో ప్రభుత్వం జిల్లాకు నూతన భవన నిర్మాణం మంజూరు చేయడంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండు జిల్లాలకు కలిపి ఒకే భవనం ఉండటంతో ప్రతీ నెలా మీటింగ్‌లకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. మహిళల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

కేఎంసీలో అవగాహన కార్యక్రమం

ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ మెడికల్, డిసెంబరు 03 (ఆంధ్ర జ్యోతి): యాంటీ ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్స్ సైబర్ క్రైంపై కాకతీయ మెడికల్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కేఎంసీ ప్రిన్సిపా ల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి అధ్యక్షతన ఎంబీబీఎస్ విద్యార్థులు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు ర్యాగింగ్, సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండా లన్నారు. సమాజంలో జరుగు తున్న సంఘటనలు ఆధారం చేసుకొని అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు రహిత సమాజాన్ని నిర్మించే ఒదుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ పతక విజేతకు సన్మానం



స్వర్ణ పతకం సాధించిన గౌతమ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

పోచమ్మమైదాన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బహ్రెయిన్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీ య స్థాయి పారా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో స్వర్ణ పతకం సాధించిన వరంగల్ పైడిపెల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్‌ను రాష్ట్ర పంచాయితీరాజ్ మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మెమోంటో, సర్టిఫికెట్ అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈపీ డబ్ల్యూడీఎస్ డైరెక్టర్ బి.శైలజ, చైర్మన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి జీవితంలో స్థిరపడాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ క్యాంపస్ బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ ఫార్మసీ కళాశాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పూర్వ విద్యార్థుల సలహాలు, సూచనలు తీసుకుని విద్యార్థులు ఫార్మసీరంగంలో ఎదగాలని చెప్పారు. క్యాంపస్‌లో మంచి వనరులన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవ, జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రాసిన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ అధ్యాపకులు కృష్ణవేణి, నాగరాజు, స్వరూపరాణి, షయేదా, ఏఆర్ కోలా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటిపై పుస్తకం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ప్రచురించిన 'ది వాటర్ స్పిరిచ్యువల్, జెండర్ ఎన్విరల్‌మెంట్ ప్రాస్పెక్టీవ్ రిలిజ్' అనే పుస్తకాన్ని మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి కేయూలోని తనఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ రామకిషన్, భాస్కర్ బండారి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు చేరొచ్చు

● లింబర్క్ వీరచక్ర గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ ● మామునూరు పీటీసీలో ఎన్‌సీసీ ముగింపు వేడుకలు



ఎన్‌సీసీ ముగింపు వేడుకలకు హాజరైన కేడెట్స్

మామునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ లింబార్క్ అన్నారు. మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్‌సీసీ, ఏటీసి(9) గ్రూప్ విద్యార్థుల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మెడల్స్‌తో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాల నుంచి 411 మంది విద్యార్థులు 9 రోజుల శిక్షణలో పా ల్గొన్నారని, ఫైరింగ్, పాయింట్ 2 రైఫిల్, ఎన్‌డిఆర్ఎఫ్, ఫైరింగ్ డిపార్ట్‌మెంట్ సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ రేగ్యులేషన్ అంశాల్లో తర్ఫీదు పొందారని అన్నారు. ఎన్‌సీసీ ద్వారా యువకులు దేశసేవ చేసినవారవుతారని అన్నారు. కాగా ముగింపు వేడుకల్లో కేడెట్స్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ ఎస్.కె భాద్ర, డిప్యూటీ కమాండర్ కల్నల్ నవీన్ యాదవ్, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

మామునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం సహకరించక మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు మండలం నక్కలపల్లికి చెందిన మన్నె కొమ్మాలు (82)కు ఐదు రోజుల కిందట పక్షవాతం వచ్చింది. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దే ఉంటూ మందులు వాడుతు న్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి వెళ్ళి తన వ్యవసాయ బావిలో దూకి చనిపోయాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణవేణి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్- 1లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆర్. రమణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. మృతుడి వయస్సు 35-40 , ఎత్తు 5,7, ఎరుపు రంగు కోలముఖం, క్రీం గీతల టీ షర్ట్, అదే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై అనిత అనే పచ్చబొట్టు ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసన వారు 94400 27342, 81217 80796 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

వరంగల్ కలెక్టర్ సత్యశారద



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

పోచమ్మమైదాన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం ఆమె వరంగల్ తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరిణి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసే విధంగా చూడాలని ఆదేశించారు. తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్, డిప్యూటీ తహసిల్దారు సుమన్, ఏఎస్‌వో వెంకన్న, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అవినీతి రహిత జిల్లాగా మార్చాలి

వరంగల్ కలెక్టరేట్: వరంగల్‌ను అవినీతి రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏసీబీ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో నేతల వినతి

జీపీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సత్యశారదకు టీఎన్‌జీవో నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లు పూర్తి చేసిన జేపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేయాలని, ఓపీఎస్‌ల జీతాలు ఏజెన్సీల ద్వారా కాకుండా ప్రభుత్వం ద్వారా చెల్లించాలని, అర్హులైన ఓపీఎస్‌లను జేపీఎస్‌లగా కన్వర్షన్ చేయాలని, గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేయాలని, గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్, కార్యదర్శుల ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు యాకూబ్ నాయక్, టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి సదానందం, కార్యదర్శి దయ్యాల సదానందం, నాయకులు కెసదానందం, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై మెజిస్ట్రీయల్ విచారణ

- ఆర్డీవోకు ములుగు కలెక్టర్ ఆదేశాలు
- నెలరోజుల్లోపు నివేదిక సమర్పించాలని సూచన

ములుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం చల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించిన ఘటనపై కలెక్టర్ టీఎస్.దివాకర మెజిస్ట్రీయల్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా ములుగు ఆర్డీవో వెంకటేశ్‌ను నియమించారు. పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులకు దారితీసిన సంఘటన, ఏడుగురి మృతిపై నెలరోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్టు

23 తులాల ఆభరణాల స్వాధీనం

కాజీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 23 తులాల బంగారం చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన దావ కిశోర్ ఇంట్లో గత నెల 22న దొంగలు చొరబడి 23 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాలతో కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తోపాటు ఎస్ఐలు నవీన్, లవన్, కానిస్టేబుళ్లు భాస్కర్, విష్ణులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీ చేపట్టారు. తనిఖీలో భాగంగా మంగళవారం నిందితులు సనాబేగం, సోహెల్‌లను కాజీపేట దర్గావద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న 23 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులు హైదరాబాద్‌తోపాటు వరంగల్ ఇతర జిల్లాలో సుమారు 40 కేసుల్లో బంగారం చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న కాజీపేట పోలీస్ సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందినట్లు పోలీసులు చెప్పారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

తీవ్రగాయాలు.. ఆస్పత్రిలో చేరిక.. బాపూజీనగర్‌లో ఘటన

కాజీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట బాపూజీనగర్‌లో వ్యక్తిపై గుర్తుతెలియని యువకుడు కత్తితో దాడిచేశాడు. ఈ ఘటనలో వృద్ధుడికి కత్తిగాట్లు కాగా, బంధువుల ఆస్పత్రిలో చేర్పించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన మాలకొండయ్య(75) బాపూజీనగర్‌లోని పెట్రోల్‌బంకు వెనకాల కుటుంబంతో సహా నివాసముంటున్నాడు. సమీపంలోని ప్రధాన రహదారిపై కొంత కాలంగా సిమెంట్ షాపు నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లేక్రమంలో దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అడ్డగించి మాలకొండయ్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. బాధితుడు కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న అతడి కుమారుడు ఘటనాస్థలికి వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో కత్తితో దాడిచేసిన వ్యక్తి వెంటతెచ్చుకున్న పెట్రోల్ ప్యాకెట్‌లను చల్లి పారిపోయాడు. కత్తిదాడిలో గాయపడిన మాలకొండయ్యను కుమారుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు సమాచారం. కాగా, మాలకొండయ్యను యువకుడు ఎందుకు దాడిచేశాడు?. డబ్బుల కోసమా, ఏమైనా పాతకక్షలతోనా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న కాజీపేట ఇన్స్‌పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి బృందం ఘటనా స్థలికి వెళ్లి ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

దీపం అంటుకొని దుస్తులు, టీవీ దగ్ధం

సంగెం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్గూరురంగంపేటలో దేవునికి దీపం పెట్టి గుడికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులతో పాటు విద్యా సర్టిఫికెట్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన ఇమ్మడి అఖిల్ సోమవారం ఇంట్లో దేవునికి దీపం పెట్టి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని శివాలయానికి వెళ్లారు. తర్వాత దీపం అంటుకుని ఇంట్లోని దుస్తులు, టీవీ, సర్టిఫికెట్లు కాలిపోయాయి. అఖిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మంత్రి ఉన్నా.. వరంగల్ అభివృద్ధి శూన్యం

(3వ పేజీ తరువాయి)

అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన హామీలిచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. మహిళలకు రూ.2500, యువతకులకు స్కూటీలు ఇస్తామని ఆశ చూపిన కాంగ్రెస్ హామీలను అమలు చేయలేదన్నారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ ఎంతమందికి అమలు చేశారని నిలదీశారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు చేయలేదన్నారు. వరంగల్ నగరంపై స్థానిక మంత్రి ఎలాంటి దృష్టి సారించడం లేదన్నారు. నెలకోసారి క్యాంపు కార్యాలయానికి వస్తున్నా మంత్రి కోటరీకే తప్ప సామాన్యుల సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. దళితులను మోసం చేసిన కాంగ్రెస్.. గతంలో మంజూరై ప్రారంభమైన పనులకే మరోమారు శంఖుస్థాపనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను గెలిస్తే వరంగల్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్న మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ పాదయాత్ర ప్రముఖ్ రత్నం సతీష్‌సా, సహప్రముఖ్ జలగం రంజిత్, అసెంబ్లీ ప్రముఖ్ ప్రముఖ్, పుల్లారావు, కుసుమ సతీష్, బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ నిధులతో సుందరీకరించాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సుందరీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్

కాజీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిధులతో కాజీపేట చౌరస్తాలో సుందరీకరణ అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ నిధులతో నగరమంతా అభివృద్ధి పనులు చేశామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో మంగళవారం రూ.28 లక్షల నిధులతో జంక్షన్ సుందరీకరణ పనులు ప్రారంభించారు. కాజీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే వెంట మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, సంకు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, బంక సంపత్, అజార్, ఇప్ప శ్రీకాంత్, పోగుల శ్రీను, దొంగల కుమార్, అశోక్, రాజేశ్ పాల్గొన్నారు.

ఈఫిల్ టవర్ ప్రారంభం..

బాలసముద్రం: ప్రజాపాలన విజయోత్సవాల వేడుకల్లో భాగంగా మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో రూ. 23.50 లక్షలతో నిర్మించిన ఈఫిల్ టవర్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కావుల కోమల, కిషన్, సారంగం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరులను మరవం

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన తెలంగాణ అమర వీరులను బీఆర్ఎస్ పార్టీ మరువదని హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ అమరులు దాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. అమరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, జోరిక రమేష్ నాయకులు సుంచు కృష్ణ కనకరాజు, సదాంత్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అమరుడు శ్రీకాంతాచారికి నివాళి..

కేయూ క్యాంపస్: తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట బీఆర్ఎస్వీ నేతలు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమకారులపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దమనకాండను తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి ప్రాణార్పణ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్‌కుమార్, కలకోట సుమన్, కందికొండ తిరుపతి, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, రోహిత్, సిద్ధు, రాజేశ్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రూ.4కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోచమ్మమైదాన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి అనిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజుతో పాటు మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట విలీన గ్రామాలలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలీన గ్రామాలలో రూ.4కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, రూ.3కోట్ల 35లక్షల స్మార్ట్‌సిటీ నిధులు, మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి రూ.50లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, బుద్దె పెద్దన్న, బోయిని అయిలయ్య, జన్ను అభిషేకం, బండారి కుమార్, జన్ను సుధాకర్, జన్ను అరుణాకర్, లింగం సంపత్, చిలుక రవి కుమార్, మేకల నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అందిస్తాం..

పైడిపెల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను జనవరిలో వికలాంగులకు అందిస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం పైడిపెల్లిలో నిర్వహించిన వికలాంగుల దినోత్సవంలో ఆయన కేక్ కట్ చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంతుర్తి రమేష్, ఉపాధ్యక్షుడు గిన్నారపు రవి, కార్యదర్శి కోటగిరి రమాదేవి, పెరుమాండ్ల ప్రకాష్, పాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభం..

వరంగల్ సిటీ: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెన్ ప్రారంభించడంతో పాటు డివిజన్‌లోని అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏనుమాములపై దృష్టి సారించామని, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో ముందుకుపోతామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, కాంగ్రెస్ నాయకులు ఇంతియాజ్, మహేష్, రాజేందర్, స్టాలిన్ పాల్గొన్నారు.



బాలాజీనగర్ జంక్షన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ బుక్స్ పంపిణీ..

న్యాయవాది గందం శివ తన తల్లిదండ్రులు గందం సారమ్మ, గోపాల్ జ్ఞాపకార్థం సుందరయ్యనగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్న ఊరుకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల తనిఖీ..

పోచమ్మమైదాన్: వరంగల్ ఆరెపల్లిలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, కళాశాలను (పాకాల కొత్తగూడ-ములుగు) మంగళవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంటశాలను పరిశీలించారు. గతంలో ఇచ్చిన మాట మేరకు విద్యార్థుల సౌకర్యార్థం సొంత డబ్బులు రూ. 60 వేలు వెచ్చించి క్రీడా సామగ్రి, 20 ఫ్యాన్లు అందించడంతో పాటు భోజనశాలకు రంగుల ఖర్చును అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్, ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, జన్ను సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు..

వడ్డెపల్లి: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్ వద్ద ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, మేయర్ గుండు సుధారాణి కేక్ కట్ చేశారు. తొలుత శ్రీసాయినగర్ కాలనీ, ద్వారకాసాయి కాలనీలలో రూ. కోటి అంచనా వ్యయంతో నిర్మించే రోడ్లు, డ్రెయినేజీ పనులకు వారు స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, కొంకా హరిబాబు, కందుకూరి పూర్ణచందర్, సయ్యద్ ఉమర్ పాషా, రుద్రోజు మణీంద్రనాథ్, చల్లా వినయ్‌పాల్‌రెడ్డి, చింత రమేష్‌గౌడ్, దూలం పెద్ద రాజుగౌడ్, భూక్య విజయ్, భూక్య శంకర్, పల్లకొండ విజయ్‌సూర్య, శనిగరపు అనిత, పల్లకొండ సరోజన తది తరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వారోత్సవాలు

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలను సంస్థ నిర్వాహకురాలు బండ రామలీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. దివ్యాంగులకు తమ వంతుగా కంప్యూటర్లకు సంబంధించిన శిక్షణను ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పద్మ, కళ్యాణ్, యాదగిరి పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ రావుల కోమల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్య, వైద్యం అందించాలి

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించి అండగా నిలవాలని ధర్మసమాజ్ పార్టీ(డీఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమం లో డీఎస్పీ నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు దీక్షలో పాల్గొని వారికి సంఘీ భావం తెలిపారు.

నేడు వాహనాలకు వేలం

మడికొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు మంగళవారం స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు. ద్విచక్ర వాహనంతో పాటు కారు వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 11 గంటలకు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 17 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ రూ.22300 జరిమానా విధించారు. అంతేగాకుండా కాశిబుగ్గకు చెందిన చిప్పా ప్రసాద్, కొత్తవాడకు చెందిన చెన్నా, గొడిశాల కార్తీక్‌లకు రెండు రోజుల సామాజిక సేవ శిక్షను విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురికి రూ.7500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఖిలావరంగల్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 18వ డివిజన్ లేబర్‌కాలనీతో పాటు ఎస్ఆర్‌టీ కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వస్కుల బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఏఈ కృష్ణమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏ జేఏసీ నాయకులు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వయస్సు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట 81 జీవో ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. ఆ హామీలను అమలు చేయాలని వీఆర్ఏలు రాష్ట్ర వ్యాప్తంగా 80 రోజులపాటు సమ్మె చేసిన ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి వీఆర్ఏ జేఏసీ చర్చలు జరిపి జీవో 81, 85 విడుదల చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం వయస్సు పైబడి అనారోగ్యం పాలైన తండ్రుల స్థానంలో వారి వారసులకు వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్నారని, అందువల్ల వారికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. ధర్నాలో వీఆర్ఏ జేఏసీ నాయకులు మధు, ఎం.రాజు, ఎస్.రాజేందర్, ఎం.రాజేష్, ఎస్.రమేశ్, బి.రాములు, ఎ.శ్రీనివాస్, ఎస్.వేణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుందామని వస్తే అరెస్టు చేస్తారా?

- బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి



ఇన్‌స్పెక్టర్ కిషన్‌తో వాదిస్తున్న రాకేశ్‌రెడ్డి, రాధికారెడ్డి

మడికొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వస్తే అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండి పడ్డారు. బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా రాకేష్‌రెడ్డి, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించడానికి వెళ్లారు. అనుమతి లేదంటూ పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ... దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పది నెలల కాలంలోనే 49 మంది గురుకులాల విద్యార్థులు మృత్యువాతపడ్డారని సుమారు 15 వందల మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. విద్యార్థులు హాస్టల్‌లో కంటే ఆస్పత్రుల్లోనే ఎక్కువ సమయం ఉండే పరిస్థితి నెలకొందన్నారు. అన్ని బాగుంటే లోపలికి ఎందుకు అనుమతి ఇవ్వడంలేదని ప్రశ్నించారు. గురుకులాల్లో అరకొర వసతులతో నిర్వహిస్తున్న తీరు మారే వరకు ప్రభుత్వాన్ని వెంబడిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, బీఆర్ఎస్ నాయకులు ఏశబోయిన పురుశోత్తం, పాలమాకుల కొమురయ్య, పల్లపు అశోక్, పిన్నింటి విజయ్ కుమార్, గూడ హరీష్, గువ్వ రాజేశ్, వస్కుల దేవేందర్, అరూరి తిరుపతి, పల్లపు రాజ్‌కుమార్, బత్తిని కిరణ్, బోగి శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు



మాట్లాడుతున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్

కాజీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ అందరివాడని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. కాజీపేట సోమిడి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సీఐటీయూ, కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగం ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముందుగా కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్యలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ పేరుతో బీజేపీ దేశప్రజలను నిరంకుశ పాలన వైపు తీసుకెళ్తుందన్నారు. భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తులను ప్రమాదం పొంచి ఉందని, రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి అంబేద్కర్ ఆలోచనలను తుద ముట్టించడానికి కుట్రలు చేస్తుందని వాటిని అడ్డుకోవాలన్నారు. అసమానతల సమాజాన్ని అంతం చేసి, రాజ్యాంగం ఔనత్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కారు ఉపేందర్, మంద మల్లేశం, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి సాంబయ్య, మంద సంపత్, సహాయ కార్యదర్శి గడ్డం అశోక్, బరుపట్ల మహేశ్, అరికెళ్ల వెంకటస్వామి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు టీఎస్ఈఈయూ విన్నపం



డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

హనుమకొండ టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం- 327 ఐఎన్‌టీయూసీ ఆల్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం రాష్ట్ర నాయకులతో కలిసి విన్నవించారు. ఆర్టిజన్‌లకు ప్రమోషన్‌లకు కల్పించాలని, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న సీబీడీ గ్యాంగ్ ఉద్యోగులకు హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, మిగిలి ఉన్న 6500 మంది ఆన్‌మ్యాన్డ్, కాంట్రాక్టు వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2004 వరకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరగా, దానికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించార న్నారు. మిగతా విషయాలు ట్రాన్స్‌కో సీఎండీతో మాట్లాడి పరిష్కరించుకో వాలని సూచించారని టీఎస్ఈఈ యూ స్టేట్ సెక్రటరీ జనరల్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 327 యూనియన్ నాయకుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ ఘటనలపై నేడు నిరసన ర్యాలీ

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఆకృత్యాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ బుధవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండ వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు హిందూ పరి రక్షణ సమితి ప్రతినిధి ఏనుగొండుల రాజు తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ మన సహకారంతో స్వాతంత్ర్యాన్ని పొందిన బంగ్లాదేశ్ అక్కడ ఉన్న హిందూ సంస్థలపై నిషేధం విధించిందని అన్నారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్కడ మైనారిటీలుగా ఉన్న హిందువులపై హింసాత్మక సంఘటనలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ నిరసన ర్యాలీలో హిందూ సంస్థల ప్రతినిధులు, దేవాలయాల కమిటీల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సముద్రాల కవిత, మిట్టపల్లి కపిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనో వైకల్యం అవరోధం కాదు

సీనియర్ సివిల్ జడ్జి సాయికుమార్

కాశిబుగ్గ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మనోవైకల్యం దేనికీ అవరోధం కాదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కాశిబుగ్గలోని వృద్ధాశ్రమంలో దివ్యాంగులకు భోజనం వడ్డించి, పండ్లు, బిస్కెట్లు అందించారు. దివ్యాంగులకు సేవలందిస్తున్న వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులని అన్నారు. వీరికి న్యాయసహాయం అందించడానికి న్యాయసేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు. దివ్యాంగులు వారి హక్కులు తెలుసుకోవడానికే న్యాయసేవాధికార సంస్థ ద్వారా విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవినీతి రహిత జిల్లాగా మారుద్దాం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): హనుమకొండను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు అవినీతి నిరోధక శాఖకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఏసీబీ వారోత్స వాల్లో భాగంగా ఏసీబీ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య కలెక్టరేట్‌లోని చాంబర్‌లో వారోత్సవాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలన్నారు. ఏ అధికారి లంచం అడిగినా ఇవ్వొద్దని, వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య ఉన్నారు.

రుద్రేశ్వరుడి ఆదాయం రూ.14లక్షలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో గడిచిన కార్తీకమాసం నెలరోజులలో మొత్తం రూ.13లక్షల, 99వేల 355 ఆదాయం సమకూరింది. ఇందులో హుండీల ద్వారా రూ.7లక్షల 37వేల 854 ఆదాయం వచ్చినట్లు ఈవో వెంకటయ్య చెప్పారు. మంగళవారం ఆలయ నాట్య మండపంలో దేవాదాయ పరిశీలకుడు అనిల్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన హుండీల లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత కాలనీలో వైద్య శిబిరం

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హంటర్‌రోడ్‌లోని సంతోషిమాతకాలనీలో కార్పొరేటర్ గండె కల్పన నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం లయన్స్ క్లబ్‌ఆఫ్ హనుమకొండ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. కంటి, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపెల్లి రాజేష్, రావి ని కృష్ణ, సుమన్, లయన్ కె.నిర్మల, కోటిలింగం, మోహన్‌రెడ్డి, సుభాష్, శ్రీదివ్య పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

కాశిబుగ్గ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలకు క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారిణి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ స్థాయిలో ఈనెల 7,8 తేదీల్లో, మండల స్థాయిలో 10, 11, 12 తేదీల్లో, జిల్లా స్థాయిలో 16-21 తేదీల్లో పోటీలు జరుగతాయని ఆమె పేర్కొన్నారు.

బాలమల్లేష్ మృతి సీపీఐకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ వ్యవసా య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్ మృతి సీపీఐ పార్టీకి తీరని లోటు అని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బాలమల్లేష్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భిక్షపతి మాట్లాడుతూ.. ఎర్రజెండా పోరాటాలకు ఆకర్షితులై విద్యార్థి ఉద్యమంలో బాలమల్లేష్ పనిచేసి రాష్ట్రస్థాయిలో ప్రజాపోరాటాల బలోపేతానికి కృషిచేశారన్నారు. బాలమల్లేష్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కర్రె లక్ష్మణ్, మద్దెల ఎల్లేష్, రాజయ్య భిక్షపతి, స్వామి, స్వరూప, రమాదేవి, రాజు గౌడ్, సారంగపాణి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులు ఐక్యతను చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందెల సునిల్‌కుమార్

కాళోజీ జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రం, స్వపరిపాలన, నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం నినాదాలతో ఉద్యమకారులు మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ఉగ్రూతలూగించారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సందెల సునిల్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా మలిదశ ఉద్యమంలో అమరులైన శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సునిల్‌కుమార్ మాట్లాడుతూ.. 2017 లోనే ఉద్యమకారుల సంఘాన్ని స్థాపించి అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాలపైన ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నామని, దీనికి ఉద్యమకారులంతా కలిసిరావాలని కోరారు. మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా ఒకే వేదికపైకి కలిసి రావాలన్న ఉద్దేశ్యంతో సమావేశాన్ని నిర్వహించినట్లు రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు గుర్రం రఘు, అల్లా బాబు, కాషబోయిన యాకన్న, ఇమ్మడి రవీందర్, గజ్జి సంతోష్, ముద్దసాని వెంకటేశ్వర్లు, వాసురెడ్డి నర్సింహారెడ్డి, కక్కెర్ల వెంకన్న, ఎడవెల్లి దండయ్య, ఓదెల సమ్మయ్య పాల్గొన్నారు.

ఇంజనీర్ రవీందర్‌కు గవర్నర్ సన్మానం



అవార్డు తీసుకుంటున్న ఇంజనీర్ రవీందర్

హసన్‌పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్లకు చెందిన ఇంజనీర్ రవీందర్‌కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. డిసెంబరు 1వ తేదీన హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఐఎంఏ బంజారాహిల్స్ డాక్టర్ల బృందం రాష్ట్రంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి సన్మాన సభ నిర్వహించి గవర్నర్ చేతుల మీదుగా అవార్డుల ప్రధానోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముచ్చర్లలో 60కిపైగా నేత్రదానాలు చేయడమే కాకుండా నేత్ర అవయవ శరీర దాతలుగా మార్చడంలో ఉత్తమ సేవలు అందించి చైతన్యం కలిగిస్తున్న తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇంజనీర్ ఎం.రవీందర్‌తో పాటు అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి, ప్రతినిధులు సుజాత, బండ సాయిరెడ్డి, రాజకనకయ్యను సన్మానించారు.

గ్రేటర్ సంయుక్త కార్యదర్శిగా మహేందర్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్3: (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ సంయుక్త కార్యదర్శిగా హనుమకొండ 8వ డివిజన్‌కు చెందిన పుట్టా మహేందర్‌ను నియమిస్తూ ముదిరాజ్ మహాసభ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బయ్య స్వామి, పులి రజనీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మహేందర్ మాట్లాడుతూ.. గ్రేటర్‌లో ముదిరాజ్ సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేయడంతో పాటు ముదిరాజ్ సంఘ సభ్యుల సమస్యల సాధన కోసం పోరాడుతానన్నారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.



మహేందర్‌కు నియామక పత్రం ఇస్తున్న రజనీకాంత్


పొద్దు తిరుగుడు, మొక్కజొన్న చేను

ఆరుతడి పంటల్లో నీటి పారుదల ప్రాధాన్యం

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగిపైర్లకు నీటి తడులను సక్రమంగా అందిస్తేనే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది. ఆరుతడి పంటల్లో మేలైన నీరు పారుదల విధానాలను శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు వివరించారు. పప్పు దినుసుల పంటలకు నాలుగైదు తడులివ్వాలి. పైరు మొగ్గతొడిగే దశ, కాయ దశల్లో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తపడాలి. వరిమాగాణుల్లో విత్తుకున్న పెసర, మినుముకు నేల రకాన్ని బట్టి రెండు, మూడు నీటి తడులు వదలాలి. వేరుశనగ పూత, ఊడలు దిగే, గింజలు ఏర్పడే దశల్లో నీటితడులు ఇవ్వాలి. పంటకు తుంపర సేద్య పద్ధతి అనువుగా ఉంటుంది. మక్కకు తేలిక నేలల్లో 14 తడులు నల్లల నేలలు, బరువైన నేలల్లో 6-8 తడులు ఇవ్వాలి.

విత్తిన నెల రోజులకు, పైరు పెరిగే, మోకాలి ఎత్తు, జల్లు, గింజకట్టు దశల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి. దుక్కి దున్నకుండా జీరోటిల్లేజీ పద్ధతిలో మక్కలో 45, 60, 80, 90 రోజులకు నీటి తడులను పారించాలి. విత్తిన నెల రోజుల వరకు నీరు నిల్వలేకుండా చూడాలి. పొద్దు తిరుగుడు పైరు మొగ్గదశ అభివృద్ధి సరిగా ఉండాలంటే మలిదశలో సమృద్ధిగా నీరు అందించాలి.

పూత, గింజకట్టు దశల్లో నీరం దకుంటే ఉత్పత్తి, గింజల్లో నూనె శాతం తగ్గుతుంది. కాబట్టి తగిన తడులివ్వాలి. కీలక దశల్లో నీటినందించడం ద్వారా గింజల్లో మాంసకృత్తులు, అమైనో ఆమ్లాలు వృద్ధిచెందుతాయి. నువ్వు పూత, కాయ అభివృద్ధి, గింజ నిండుకునే దశల్లో నీటి ఎద్దడి ఉండవద్దు. విత్తిన వెంటనే మొదటి నీటి తడినిచ్చి 20, 35, 45, 60 రోజులకు మళ్లీ అందించాలి. రకాల కాలపరిమితిని బట్టి దీర్ఘకాలిక రకానికి ఒక తడి ఎక్కువగా అవస రం ఉంటుంది. రైతులు వృథా నీటిని నేలలో ఇంకేలా పొలాల వందూరు ప్రాంతంలో నీరింకే గుంతలను ఏర్పాటు చేసుకోవాలి.

బిందు సేద్యం వల్ల 25-40 శాతం నీరు ఆదా కావడం, దిగుబడి పెరగడం, ఎగుడు దిగుడు భూముల్లోనూ ఇబ్బందులు లేకుండా పైర్లకు నీరందటం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.



సీతాఫలం.. ఆరోగ్య ఫలం..!

చలికాలంలో విరివిగా లభ్యం
పుష్టిగా క్యాలరీస్, విటమిన్ - సి



వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్‌లో లభించే మృదు మధుర ఫలం సీతాఫలం. దీనినే కస్టర్డ్ ఆపిల్, చికుఫల్ అని కూడా పిలుస్తారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరు తినే మధుర ఫలం. ఇది సెప్టెంబరు నుంచి జనవరి వరకు లభిస్తుంది. ఈ పండ్ల ధర కూడా ఒకప్పుడు చాలా తక్కువే. కానీ వీటి పెంపకాలు తక్కువ కావడంతో ధరలు మండిపోతున్నాయి. ఇప్పుడు కిలోకు రూ.100-150 వరకు రేటు పలుకుతోంది. సీతాఫలం అనేక రోగాలకు ఔషధంలా పనిచేస్తుంది. దీని ఫలమే కాకుండా ఆకులు, విత్తనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. సీతాఫలంలో ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గ్రామాల నుంచి అడవుల్లో విరివిగా కాసే ఈ పండ్లను తీసుకువచ్చి నగరాల్లో, మండల కేంద్రాల్లో, రోడ్ల పక్కన ఎక్కువగా అమ్ముతారు.



సీతాఫలంలో ఉండే పోషకాలు ఇవే

క్యాలరీస్	93 శాతం
కొవ్వు పదార్థాలు	0.3 గ్రాములు
కొవ్వు ఆమ్లాలు	0 గ్రాములు
కొలెస్ట్రాల్	0 గ్రాములు
సోడియం	9 మిల్లీ గ్రాములు
పొటాషియం	274 మిల్లీ గ్రాములు
పిండి పదార్థాలు	24 గ్రాములు
పీచు పదార్థాలు	4.4 గ్రాములు
మాంసకృత్తులు	2.1 గ్రాములు
విటమిన్ - సీ	36.3 గ్రాములు
విటమిన్ -బీ6	0.2 గ్రాములు
ఐరన్	0.6 మిల్లీ గ్రాములు
కాలియం	24 మిల్లీ గ్రాములు
మెగ్నీషియం	21 మిల్లీ గ్రాములు

ఉపయోగాలు

- సీతాఫలంలో విటమిన్-సీ, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండడం వలన ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.
- రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. విటమిన్-సీ ఉండటం వలన తెల్ల రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది.
- గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- జీర్ణక్రియకు సహాయపడుతుంది. సీతాఫలంలో ఫైబర్ అధికంగా ఉండటం వలన మలబద్ధకం, అతిసారం వంటి జీర్ణ సమస్యలు నమసిపోతాయి.
- రక్తపోటు స్థాయిలను నియంత్రిస్తుంది. దీనిలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తనాళాలను విడదీసి సాధారంగా పని చేయడానికి సహాయ పడుతుంది.
- విటమిన్-ఏ అధికంగా ఉండడంతో కంటి చూపు మెరుగుపడుతుంది. చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.
- చలికాలంలో సీతాఫలం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అనేక వ్యాధులు నయం చేయడంలో ఈ పండు దోహదపడుతుంది.

మేలైన యాజమాన్యం పాటిస్తే మేలు

- మామిడిలో అధిక దిగుబడులు
- పూత దశలో ఆశిస్తున్న చీడపీడలు
- నివారణకు సస్యరక్షణ చర్యలు




తిరుపతి, ఉద్యానశాఖ అధికారి

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. పూత రావడానికి వాతావరణ పరిస్థితులు ఎంతగానో ప్రభావం చూపుతాయి. చెట్లకు పూత పూయించడానికి, వచ్చిన పూత ఆగడానికి, కాపు సరిగా రావడానికి పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూత సరిగా రాక, అరకొరగా వచ్చిన పూత నిలవక దిగుబడి తగ్గిపోతుందని వర్ధన్నపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మామిడి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబరు నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి నివ్వాలి. ఆ సమయంలో చెట్టుకు అం తరాయం కలిగిస్తే పూతరావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

సాధారణంగా మామిడి చెట్లకు డిసెం బరు, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి వరకు పూస్తాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పూమొగ్గలను ఉత్తేజపరిచేందుకు డిసెంబరు రెండో పక్షంలో లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ-కే (పొటాషియం, నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల పైరెమ్మలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. యూరియా మల్టీ-కేలోని నత్రజని, పొటాషి యం పోషకాలు కలిసి పూమొగ్గలను ఉత్తేజ పరుస్తాయి. దీంతో చెట్లకు పూత అధికంగా రావడానికి, పిందె కట్టడానికి కాయలు మంచి సైజులో నాణ్యతగా ఎదగడానికి సహకరిస్తాయి.

చీడపీడల నివారణకు..

సాధారణంగా మామిడి చెట్లను పూత దశలో బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, పూత కాండం, పూల మీద, చిరు పిందెల మీద, తెల్లని పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీనినే బూడిద తెగులు అన్నారు. ఇది ఎక్కువగా ఉన్నపుడు ఆశిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగలు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. ఈ తెగులు వల్ల చెట్లకు వచ్చిన పూత, కాత రాలిపోతుంది. దీని నివారణకు పూత దశలో తెగులు కనిపించగానే హెక్సాకోనజోల్ 2. ఎంఎల్, లేదా ప్రొపికోనజోల్ 1 ఎంఎల్, లేదా డినోకాఫ్ 1 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పూత ఏపుగా రావడానికి..

మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో తేనెటీగ పట్టుల ఏర్పా టుకు తేనెటీగల సంచారం పెరిగి పరపరాగ సంప ర్కం అధికంగా జరుగుతుంది. దీంతో పూత ఏపుగా రావడానికి వీలవుతుంది. తద్వారా దిగుబడి 20 నుంచి 30 శాతం పెరిగేందుకు ఆస్కారం ఉం టుంది. తోట నలుమూలల తేనెపట్టులను ఏర్పా టు చేసుకోవడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్ల ప్రభావం

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు పూత సమయంలో ఆశిస్తాయి. వర్షాలు, పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్లు విజృంభిస్తాయి. లేత ఆకులు, రెమ్మలు, పూలను ఆశించి నష్టపరుస్తాయి. ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు త్వరగా పండుబారి రాలి పోతాయి. రెమ్మల పైన నల్లని మచ్చలు ఏర్పడి పూల గుత్తులు, పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగుల బెట్టాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో విశ్రమం కలిపి పిచికారి చేయాలి.

చెట్లకు పూత వచ్చే దశ

మామిడి చెట్లకు సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో ఇగుర్లు వచ్చి ముదురుతాయి. ఇగుర్ల రెమ్మల్లో నుంచి పూత వస్తుంది. ఆ ప్రక్రియ డిసెంబరు చివరివారం నుంచి జనవరి వరకు జరుగుతుంది. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత 10 నుంచి 13 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటేనే చెట్లకు పూత ఏపుగా వస్తుంది. ఒక వేళ వాతావరణ పరిస్థితుల్లో తేడా ఏర్పడితే పూతలో మార్పులు ఉంటాయి. అందు చేత పూత రావడానికి రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి.


గానుగ నూనె తయారు చేస్తున్న నిర్వాహకుడు అనిల్

గానుగ నూనెకు కేరాఫ్ కోట

రసాయనాలు లేని స్వచ్ఛమైన వంట నూనెల తయారీ

ఖిలా వరంగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంనాటి పద్ధతిలో ఎలాంటి రసాయనాలు లేకుండా స్వచ్ఛమైన వంట నూనెలకు కేరాఫ్‌గా నిలుస్తోంది వరంగల్ కోట. ఇక్కడ పల్లి, నువ్వులు, కుసుమ, సన్‌ఫ్లవర్ నూనెలను సంప్రదాయ పద్ధతిలో గానుగపట్టి తీస్తున్నారు. మధ్యకోటలో ఎద్దుల ద్వారా గానుగ తిప్పి నాణ్యమైన వంటనూనెలను తయారు చేస్తున్నారు. ఈ చిన్న పరిశ్రమను మధ్యకోటలో 10 గుంటల భూమిలో సుమారు రూ. 12 లక్షల వ్యయంతో 2 గానుగలు, 1 రేకుల షెడ్డు, 1 గది, 1 జత ఎద్దులు, ఇద్దరు పనివాళ్ళతో గతనెలలో ప్రారంభించారు. ప్రస్తుతం ఖిలావరంగల్‌తో పాటు ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, గిర్మాజీపేట, వరంగల్ తదితర ప్రాంత ప్రజలు ఇక్కడి నూనెలను విరివిగా వినియోగిస్తున్నారు.


గానుగ పట్టి తీసిన పల్లి, నువ్వులు, కుసుమ, కొబ్బరి, పొద్దుతిరుగుడు నూనెలు

తయారీ పద్ధతి

12 కిలోల పల్లీలు, నువ్వులు, కుసుమ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ తదితర గింజలను గానుగలో పోసి 3 గంటల పాటు గానుగ పట్టితే 5 కిలోల నూనె వస్తుంది. 1 కిలో నుంచి 5 కిలోల వరకు పల్లినూనె, నువ్వులనూనె, కుసుమ, సన్‌ఫ్లవర్, కొ బ్బరినూనెలను హోల్‌సేల్, రిటేల్‌గా రూ.450 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారు. డోర్‌డెలివరీ సౌకర్యాం కూడా ఉందని, నగరవాసులకు ఉచితంగా సరఫరా చేస్తామని నిర్వాహకుడు అనిల్ తెలిపారు.

అమ్మ ఒడి అక్షయ పాత్ర

- వృద్ధులు, దివ్యాంగులకు నిత్యం భోజనం
- సకల సౌకర్యాలతో శ్మశానవాటిక ఏర్పాటు
- పేదలకు అండగా నిలుస్తున్న మోక్షారామం ఫౌండేషన్
- రామా శ్రీనివాస్ పేరుపై కొనసాగుతున్న సేవలు


శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న ఫౌండేషన్ వలంటీర్లు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'వృద్ధులు, దివ్యాంగులకు పట్టెడన్నం పెడితే పరమాత్ముడు సంతోషిస్తాడు' అని తల్లి చెప్పిన మాటను కొడుకు శిరసావహించారు. తన చివరి శ్వాస వరకు కూడా సేవలను కొనసాగించారు. తన మరణానంతరం కూడా సేవా కార్యక్రమాలు కొనసాగేవిధంగా తగిన ఏర్పాట్లు చేశారు. ఆయనే ప్రముఖ వ్యాపారవేత్త రామా శ్రీనివాస్. వరంగల్ నగరం 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, నిరంతర దానశీలి స్వర్గీయ రామా శ్రీనివాస్ 2016లో మోక్షారామం ఫౌండేషన్‌ను స్థాపించారు. నాటి నుంచి నిరుపేదలకు ప్రతీ రోజు రెండు పూటలా భోజనం అందుతూనే ఉంది.

ప్రతీ రోజు వృద్ధులకు భోజనం

అమ్మఒడి భవనం నుంచి ప్రతీ రోజు దాదాపు 100 మంది వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు మోక్షారామం ఫౌండేషన్ ప్రతీరోజు రుచికరమైన భోజనాన్ని అందిస్తోంది. సంస్థ వలంటీర్లు రెండు పూటలకు భోజనాన్ని క్యారియర్‌లో తీసుకెళ్లి అందజేస్తా రు. ఏడాదంతా సేవలు కొనసాగుతున్నా యి.

శ్మశాన వాటిక అభివృద్ధి

రామన్నపేటలోని మోక్షారామం (శ్మశాన వాటిక)ను దాదాపు రూ.కోటితో అభివృద్ధి చేశారు రామా శ్రీనివాస్. ఇల్లు లేని నిరుపేదల కుటుంబ సభ్యులు ఎవరైనా మృతి చెందితే వారి కోసం రెండు రూములు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించారు. మరీ నిరుపేదలైతే దహన సంస్కారాలకు కూడా ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం ఎంతమంది ఉన్నా వారికి ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

సేవలకు మారుపేరు మోక్షారామం

గత ఏడాది భారీ వర్షాలకు రామన్నపేట, హంటర్‌రోడ్డు ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోగా ఫౌండేషన్‌నుంచి ప్రజలకు ప్రతీ రోజు భోజనం, పాలు, మందులు అందజేశారు. ప్లాస్టిక్ వాడకూడదని ఇంటింటికీ డస్ట్‌బిన్స్ బట్ట సంచులను ఉచితంగా అందజేశారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మాస్క్‌లను తయారు చేసి అందరికీ ఉచితంగా పంచారు. 200 రోజుల పాటు ప్రతీ రోజు ఆస్పత్రుల్లోని రోగులు, సహాయకులు, పోలీసు సిబ్బంది, బస్టాండ్ ప్రాంగణాల్లో నిరుపేదలకు రోజుకు వెయ్యిమందికి ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఆలయాలకు, వివాహాలకు, అభాగ్యులు, పాఠశాలలకు ఆర్థిక సాయం అందించారు.


రెడ్ క్రాస్ వారికి మాస్క్‌లు అందజేస్తున్న రామా శ్రీనివాస్ (ఫైల్)

తాను నిర్మించిన శ్మశాన వాటికలోనే..

తన తల్లి మాటపై రామన్నపేట శ్మశాన వాటికను రూ.కోటి ఖర్చు చేసి వైకుంఠధామంగా తీర్చిదిద్దారు రామా శ్రీనివాస్. అయితే 11 నెలల కిందట ఆయన గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. దీంతో ఆయన పార్థివదేహానికి ఆయన కలల స్వప్నమైన మోక్షారామంలోనే అంత్యక్రియలు చేశారు. ఆయన అంతిమయాత్రకు వేలాది మంది ప్రజలు తరలి వచ్చారు.

చనిపోయినా ఆగని సేవలు

రామా శ్రీనివాస్ మృతి చెందిన రోజు కూడా ఆయనకుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు ఆపలేదు. యథావిధిగా నిరుపేదలకు భోజనం అందించారు. ఫౌండేషన్ వలంటీర్లు దుఃఖసాగరంలో ఉండి కూడా భోజనం తయారు చేసి అందజేశారు. నిరంతరం ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ వలంటీర్లు, కుటుంబ సభ్యులు చెబు తున్నారు.


చెత్త డస్ట్ బిన్‌లను ఉచితంగా అందజేస్తున్న వలంటీర్లు


అమ్మఒడి భవనంలో ఆన్‌లైన్‌లో సేవలు నమోదు చేస్తున్న ఎమ్మెల్యే కొండా సురేఖ (ఫైల్)


ప్రతీ రోజు అమ్మఒడి వద్దకు వచ్చి భోజనం చేసే వృద్ధులు

పీఎం శ్రీతో పాఠశాలలకు కొత్త రూపు

- ఆధునిక ల్యాబ్‌ల ఏర్పాటు
- కొత్త ఆవిష్కరణలకు చేయూత
- విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట
- ఉమ్మడి జిల్లాకు రూ.63.10 లక్షలు మంజూరు
- మొదటి, రెండో విడతల్లో చేపట్టనున్న పనులు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సర్కారు బడులను ఆధునిక పరిశోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రేజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద 2024-25 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు మొత్తం రూ. 63,10,500 నిధులు మంజూరయ్యాయి. ఇందులో మొదటి దఫాలో హనుమకొండ జిల్లాకు రూ. 4,56,500 రెండో దఫా ఉమ్మడి జిల్లాకు రూ. 45,40,000 మంజూరయ్యాయి. వీటితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు వార్షిక గ్రాంట్‌గా మరో రూ. 13,46,000 విడుదల చేసింది.


పీఎం శ్రీ పథకం ద్వారా నిధులు మంజూరైన దామెరలోని ఎంపీపీఎస్

మొదటి దఫా..

పీఎం శ్రీ పథకం కింద మొదటి దశలో ఒక్క హనుమకొండ జిల్లాకే రూ.4,24,500 నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో టీఎల్ఎం గ్రాంట్ కింద (ప్రీ ప్రైమరీ గ్రాంట్) కింద రూ 24 వేలు, రికరింగ్ గ్రాంట్ (ప్రీ ప్రైమరీ) కింద రూ. 4లక్షలు మంజూరయ్యాయి. ఇందులో ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌కు రూ. 2,14,500 దామెర ఎంపీపీఎస్‌కు రూ. 2,10,000 మంజూరయ్యాయి.

రెండో విడతలో..

ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడులకు రూ. 45,40,000 మంజూరయ్యాయి. ఇందులో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అక్కంపేట ఎంపీపీఎస్‌కు రూ. 4,54,000 జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలంలోని నేలపోగుల ఎంపీయూపీఎస్‌కు రూ.4,54,000, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ముత్తారం మండలం మహదేవ్‌పూర్‌లోని యమ్మనపల్లి ఎంపీపీ పాఠశాలకు రూ. 4,54,000, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎంపీపీ స్కూల్‌కు రూ.454,000, వెంకటాపూర్ మండలం నారాయణపూర్ ఎంపీయూపీఎస్‌కు రూ. 4,54,000, బెస్తగూడెం ఎంపీయూపీఎస్‌కు రూ 4,54,000, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట ఎంపీపీకి రూ.4,54,000 వర్ధన్నపేట మండలం ఎల్లంద ఎంపీపీకి రూ.4,54,000 నిధులు మంజూరయ్యాయి.

వార్షిక గ్రాంట్

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు 2024-25 సంవత్సరానికి గాను పీఎం శ్రీ వార్షిక గ్రాంట్‌గా మొత్తం రూ 13,46,000 విడుదల య్యాయి. ఈ మొత్తంలో హనుమకొండ జిల్లా కు రూ.3,48,750, వరంగల్ జిల్లాకు రూ.2,86, 750, జనగామ జిల్లాకు రూ. 2,71,750, మహ బూబాబాద్ జిల్లాకు రూ. 1,13,750, జయ శంకర్ భూపాలపల్లి జిల్లాకు రూ. 1,62,750, ములుగు జిల్లాకు రూ.1,62,750 నిధులు విడుద లయ్యాయి. కాగా హనుమకొండ జిల్లా లోని పరకాలలోని జడ్పీహెచ్ఎస్‌లో రూ.13,50, 000 అంచనా వ్యయంతో అదనపు గదుల నిర్మా ణాన్ని చేపట్టగా ఇప్పటి వరకు రూ. 2,91,125 విలువైన పనులు చేశారు.

ఆవిష్కరణల దిశగా..

పీఎం శ్రీ పథకం కింద విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తిని పెంపొందించి, ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు ఈ నిధులను ప్రధానంగా వినియోగిస్తారు. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ల్యాబ్‌లతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యా కోర్సులను అందిస్తారు. మొత్తం నాలుగు విడతలుగా నిధులు మంజూరవుతాయి. మొదటి, రెండో విడత నిధులు రెండు రోజుల క్రితమే మంజూరయ్యాయి. పీఎం శ్రీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2022లో ప్రారంభించింది. వీటికి 2023 సంవత్సరం నుంచి నిధులను కేటాయిస్తున్నారు. మొదటి విడతగా హనుమకొండ జిల్లాలో రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. రెండవ విడతలో హనుమకొండ జిల్లాలో ఒకటి, జనగామ జిల్లాలో ఒకటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకటి, ములుగు జిల్లాలో మూడు, వరంగల్ జిల్లాలో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి.

పీఎం శ్రీ లక్ష్యం

జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఇప్పటికే ఉన్న పాఠశాలలను మెరుగుపరచడం, ప్రతీ విద్యార్థి శ్రేయస్సును, భద్రతను ప్రోత్సహించడం, విభిన్న అభ్యాస అనుభవాలను అందించడం, పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ఈ పథకం ప్రాధమిక లక్ష్యం. పీఎం శ్రీ కింద మంజూరైన నిధులను ప్రధానంగా స్మార్ట్ క్లాస్ రూంలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, వొకేషనల్ ల్యాబ్‌లు, స్కిల్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సహా అత్యుత్తమ తరగతి ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ఖర్చు చేస్తారు.

మీ కోసం



పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పరకాల, ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లు




స్వదేశీ విదేశీ సొగసులు

సంప్రదాయంగా, ఆధునికంగా రెండు విధాలా కనిపించాలనుకునేవాళ్లు ఇండో వెస్టర్న్ స్టైల్‌ను ఎంచుకోవాలి. లెహెంగా లేదా పొడవాటి గౌన్ వేసుకుని, దానికి మ్యాచ్ అయ్యేలా పొడవాటి జాకెట్ ధరిస్తే చాలు. ఆధునికత ఉట్టిపడే సంప్రదాయ వస్త్రధారణ మీ సొంతమవుతుంది.



చేతులు లేకుండా కుట్టించినా, పొడవాటి చేతులు కుట్టించినా ఇండో వెస్టర్న్ దుస్తుల్లో ప్రత్యేకంగా కనిపించవచ్చు. అయితే డ్రెస్ పొడవు పాదాలు దాటకుండా ఉండేలా చూసుకోవాలి.



ఎత్తు మడమల చెప్పులు వేసుకోవాలా లేదంటే చదునైన చెప్పులు ఎంచుకోవాలా? అన్నది వారి వారి ఇష్టాఇష్టాల మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఏవి వేసుకున్నా, హుందాగా, సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి.

భిన్నంగా ఉండే రంగులు రెట్టింపు ఆకర్షణను తెచ్చి పెడతాయి. అందుకే లేత రంగు గౌన్ ధరిస్తే, ముదురు రంగు జాకెట్ ఎంచుకోవాలి. అదనపు ఆకర్షణ జోడించడం కోసం జాకెట్‌కు జరీ అంచులు కుట్టించుకుంటే సరిపోతుంది.

పూర్తిగా నూలు దుస్తులు ధరించాలనుకుంటే ఎంచుకునే డిజైన్స్ వినూత్నంగా ఉండేలా చూసుకోవాలి. పోల్కీ చుక్కలు, చారలు సరికొత్తగా ఉంటాయి.

నవతరం

ఊహలకు రెక్కలు తొడిగి...

ఇద్దరు యువతులు... చదువు అవ్వగానే ఉద్యోగం... అక్కడ స్నేహం. కొత్తగా ప్రయత్నించాలనే ఉత్సాహం... తమకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలనే తాపత్రయం. ఇరువురి ఆలోచనలు కలిశాయి. వాటిని ఆచరణలో పెట్టడం కోసం... కొలువులు వదిలి... కలలగన్న లోకంలోకి అడుగుపెట్టారు. ఊహలకు రెక్కలు తొడిగి... వినోద పరిశ్రమకు సృజనాత్మక హంగులు అద్దుతున్నారు. బాలీవుడ్ తారలు, ప్రముఖ బ్రాండ్‌ల ప్రాజెక్టులకు రూపకర్తలై... అభినందనలే కాదు... నాలుగు చేతులా సంపాదిస్తున్నారు. అన్యా జైన్, మేఘనా సెహగల్ స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది.

అందాల తార అనన్యా పాండే నటించిన 'కాల్ మీ బే' ఓటీటీ సిరీస్ ప్రారంభ సన్నివేశం చూసేవుంటారు. కాలేజీని తలపించే డిజైన్, యువతరాన్ని ప్రతిబింబించేలా యానిమేషన్... ఆ సిరీస్‌కు అదనపు





ఆకర్షణ అయ్యాయి. అలాగే అమితాబ్‌బచ్చన్ మనవరాలు, శ్వేత నందా కూతురు నవ్య నవేలీ నందా 'వాట్స్ ద హెల్ నవ్య' పాడ్‌కాస్ట్ కూడా! అందులో నవ్య... నవతరం యువతీ యువకుల మధ్య సాన్నిహిత్యం, ప్రేమ, మహిళల నిర్ణయాధికారానికి సంబంధించిన అంశాలను చర్చిస్తుంది. ఈ పాడ్‌కాస్ట్‌లో ఏమేం అంశాలు ఉండాలో, ఎలాంటి చర్చలు పెట్టాలనేది అన్యా జైన్, మేఘనా సెహగల్ సూచిస్తారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో సారూప్యత ఏమిటంటే... యువతులు, తెలివైన మహిళలు కేంద్రంగా సాగే కార్యక్రమాలు. ఇలా విజయవంతమైన ప్రాజెక్టులను తెరపైనే కాదు... తెర వెనుక కూడా నడిపిస్తున్నారు వీరు.

ప్రతికూలతలను అనుకూలంగా...

ఓటీటీ షోలు, బడా బ్రాండ్‌లకు వినూత్నమైన ప్రచార చిత్రాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్య, మేఘన. దాని కోసం 'రన్ ఫ్రెన్‌జీ' పేరుతో ఏడాదిన్నర కిందట ప్రొడక్షన్ ఏజెన్సీని నెలకొల్పారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్స్ జంటగా కొద్ది కాలంలోనే మంచి పేరు తెచ్చుకున్నారు. 'చిన్నపిల్లలు... మీవల్ల ఏమవుతుంద'ని అన్న చోటనే 'మీరైతేనే చేయగలర'ని అనిపించుకున్నారు. అన్యా వయసు 23. మేఘనాకు 27. ప్రతికూల పరిస్థితులను సైతం తమకు అనుకూలంగా మలుచుకోగల సమర్థులు ఈ ఇద్దరూ. అందుకు వారు పెట్టిన పెట్టుబడి... సృజనాత్మక ఆలోచనలు. ఆత్మవిశ్వాసంతో వేసే అడుగులు.

ఉద్యోగం వదిలి...

కలలను ఛేదించే క్రమంలో ఇద్దరూ సొంత ఊళ్లను వదిలి ముంబయికి వచ్చారు. అన్యా స్వస్థలం ఢిల్లీ. మేఘనది కోల్‌కత. ఇద్దరూ కలిసి ఓ కంపెనీలో పని చేశారు. అక్కడే వీరికి పరిచయం ఏర్పడింది. ఓ ప్రాజెక్టు కోసం ఢిల్లీ వెళ్లే క్రమంలో ఒకే విమానం ఎక్కారు. ఆ సమయంలోనే ఒకరి ఆలోచనలు ఒకరు పంచుకున్నారు. అప్పుడే వారికి అర్థమైంది... తామిద్దరి ఆలోచనలే కాదు, లక్ష్యాలూ ఒకటేనని. తను అనుకున్నది సాధించాలనే పట్టుదలతో అప్పటికే చేస్తున్న ఉద్యోగం వదిలేయాలని నిర్ణయించుకుంది అన్య. రాజీనామా ఇచ్చి నోటీస్ పీరియడ్‌లో కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న మేఘన... తిరిగి ముంబయికి రాగానే కొలువుకు స్వస్తి చెప్పింది. ఇద్దరూ కొద్ది రోజుల్లోనే రెండు మూడు ప్రాజెక్టులు దక్కించుకున్నారు. వాటిని విజయవంతంగా పూర్తి చేశాక... తమకంటూ ఒక బ్రాండ్ ఉండాలనే ఉద్దేశంతో 'రన్ ఫ్రెన్‌జీ' ప్రారంభించారు. అది మొదలు... వినూత్న, సృజనాత్మక ఆలోచనలతో నవతరాన్ని మెప్పించడమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. బాలీవుడ్‌ను డిజిటల్ యుగం వైపు మళ్లిస్తున్న ద్వయంగా కూడా కొందరు వీరి గురించి గొప్పగా చెబుతున్నారు.

బడా బ్రాండ్‌ల వరుస...

ఏడాది తిరిగేలోపే బడా బ్రాండ్‌లు ఈ జంట కోసం వరుస కట్టాయి. 'క్రెడ్, డిస్నీ హాట్‌స్టార్, లవ్ చైల్డ్ బై మసాబా, గూగుల్ పిక్సెల్, బుక్ మై షో, ఎన్‌బీఏ స్టైల్, టీరా బ్యూటీ... ఇంకా ఎన్నో ప్రముఖ బ్రాండ్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. 'కాఫీ విత్ కరణ్' కోసం అన్య, మేఘన చేసిన యూట్యూబ్ ప్రోమోలు, ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్, డిజైన్లు, యానిమేషన్లు అయితే మరో స్థాయిలో ఉన్నాయనేది బాలీవుడ్ మాట. ప్రస్తుతం తమ సంస్థను ఐరోపాల్లో కూడా విస్తరించే పనిలో నిమగ్నమయ్యారు ఈ ఇద్దరు. సృజనాత్మకత, కష్టపడే తత్వంతోపాటు క్రమబద్ధమైన ఒక వ్యవస్థను నెలకొల్పడమే తమ విజయానికి కారణం అంటారు.

నటి కావాలనుకొని...

హిందీ చిత్ర పరిశ్రమలో తనకంటూ కొన్ని పేజీలు లిఖించుకోవాలన్నది మేఘన చిన్ననాటి కల. 'ఎప్పుడూ అమ్మానాన్నలకు చెప్పేదాన్ని... నేను నటి కావాలని అనుకొంటున్నానని. అయితే ఆ కలను నెరవేర్చుకొనే మార్గాలు అప్పుడు నాకు తెలియదు. విచిత్రమేమంటే... అనుకోకుండా ఇవాళ నేను బాలీవుడ్ పరిశ్రమలోనే ఉన్నాను. కాకపోతే కెమెరా వెనుక' అంటుంది మేఘన. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన అన్య కోరిక... మీడియా రంగంలో స్థిరపడాలని. కొన్ని ప్రయత్నాల తరువాత అనూహ్యంగా 'భూల్ భులాయా2'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసే అవకాశం దక్కింది. 'ఆ చిత్రం పూర్తయ్యాక అనుకున్నాను... దర్శకత్వం మీద దృష్టి పెట్టకూడదని. ఎందుకంటే అక్కడ సెట్‌ను నిర్వహించే తీరు నాకు నచ్చింది. నటులు, సాంకేతిక నిపుణులు, బడ్జెట్... ఇలా సినిమాకు సంబంధించి అన్నీ అందులో ఇమిడి ఉంటాయి. దాని నిర్వహణ అంత సులువు కాదు. ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. అలాంటి సవాళ్లను స్వీకరిస్తేనే కదా... మనమేంటో ప్రపంచానికి తెలిసేది. ఆ స్ఫూర్తితో క్రియేటివ్ ప్రొడక్షన్ అయితే నా ఆలోచనలకు సరిగ్గా సరిపోతుందని భావించాను. కారణం... మనలోని సృజనకు రెక్కలు తొడగవచ్చు. అదే సమయంలో సెట్ నిర్వహణ చూసుకోవచ్చు. దీనికి మేఘన కూడా జత కలవడంతో నా పని సులువైంది' అంటూ చెప్పుకొచ్చింది అన్య.

అనుభవం లేదన్నవారే...

"మొదట్లో చాలామంది మా వయసు చూసి ప్రాజెక్టులు అప్పజెప్పడానికి సంకోచించారు. అనుభవం లేదని తిప్పి పంపారు. కానీ మేమిద్దరం కలిసి గతంలో ఎడిటర్లు, డిజైనర్లు, వీడియోగ్రాఫర్లు... ఇలా అందరితో పని చేశాం. సృజనాత్మకంగానే కాదు, వినూత్నంగా, నవతరాన్ని మెప్పించే సామర్థ్యం మాలో ఉందనేది మా నమ్మకం. ఆ ఆత్మవిశ్వాసంతోనే ముందడుగు వేశాం. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ, మేమేంటో నిరూపించుకున్నాం. కాదన్నవారు, అనుభవం సరిపోదన్న వారే ఇప్పుడు మాకు వరుస ప్రాజెక్టులు ఇస్తున్నారు. తమ అంచనాలకు మించి మా పనితనం ఉందంటూ అభినందిస్తున్నారు" అంటుంది ఈ మిత్ర ద్వయం.

పిల్లలతో బంధాన్ని పెంచుకోండి!

తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. అంతులేని ప్రేమాభిమానాలు పంచుతూ ఎంతో అపురూపంగా పెంచుతుంటారు. పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ సమయమంతా గడిపేస్తుంటారు. ఈ క్రమంలో పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఏర్పడే బంధం పిల్లల మానసిక పరిపక్వతకు, తల్లిదండ్రుల సంతోషానికి దోహదం చేస్తుంది. ఈ ప్రేమ బంధం బలపడేలా తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా ఎలా గడపాలో తెలుసుకుందాం!



కథలు చెబుతూ

● ప్రతిరోజూ పడుకునేముందు పిల్లలకు రకరకాల కథలు చెప్పండి. ఆ కథలు వింటూ పిల్లలు ఎన్నో ప్రశ్నలు అడుగుతారు. వాటన్నింటికీ ఓపికగా సమాధాలు చెబితే పిల్లల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతాయి. అలాగే మంచి పుస్తకాలను దగ్గరుండి చదివించండి. ఇలా రోజుకు అర్ధగంటసేపు పిల్లలతో గడిపితే వారిలో అమ్మానాన్న తమతో ఉన్నారన్న భద్రతా భావం కలుగుతుంది. దీంతో పిల్లలు స్వతంత్రంగా ఆడుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెడతారు. ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటూ అనుబంధం పెంచుకుంటారు.

సృజనాత్మకంగా

● పిల్లలతో కలిసి బొమ్మలు వేయండి. రంగులు దిద్దండి. దీనివల్ల పిల్లలకు రంగుల గురించి తెలుస్తుంది. వారిలో కళాత్మక దృష్టి పెరుగుతుంది. కాగితంతో బొమ్మలు చేయడం, ఊలుతో అల్లికలను నేర్పించండి. మీలో ఉన్న ఈ ప్రత్యేకతలు పిల్లలను ఉత్సాహపరచడమే కాదు వారికి మీపై అభిమానం పెరిగేలా చేస్తాయి.

సహాయం అడుగుతూ

● మీ పనిలో సహాయం చేయమని పిల్లలను అడగండి. దీనివల్ల అందరూ కలిసి పనిచేస్తే పనులు త్వరగా పూర్తిచేయవచ్చని పిల్లలకు తెలుస్తుంది. ఒక జట్టుగా పనిచేయడంలోని ఆనందం అర్థమవుతుంది. బాధ్యతలు పంచుకోవాలనే ఆలోచన వస్తుంది. సంతోషంగా పనులు చేసే విధానం అవగతమవుతుంది. తల్లిదండ్రులపై గౌరవ భావం ఏర్పడుతుంది.

నృత్యం చేస్తూ

● ఇంట్లో లైట్లన్నీ ఆర్పేయండి. కిటికీలను కర్టెన్లతో మూసేయండి. టీవీలో లేదా ఫోన్‌లో మీకు ఇష్టమైన సంగీతం లేదంటే పాట పెట్టండి. దానికి తగ్గట్టు డ్యాన్స్ చేయండి. పిల్లలచేత కూడా చేయించండి. ఇలా కుటుంబ సభ్యులందరితో కలిసి డ్యాన్స్ చేయడం పిల్లల్లో సంతోషాన్ని నింపుతుంది. ఇది వారికి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది. ఇంతటి మధురమైన సంఘటనను సృష్టించిన అమ్మానాన్నలపై ప్రేమను కలిగిస్తుంది.

కోట కడుతూ

● సెలవు రోజున ఇంట్లో ఉన్న దుప్పట్లు, దిండ్లు అన్నింటినీ ఒక చోట చేర్చండి. పిల్లలతో కలిసి ఒక గుడిసె లేదా ఒక కోటలా నిర్మించండి. అందులో పిల్లలతో కలిసి అంత్యాక్షరి, చదరంగం, క్యారమ్స్ లాంటి ఆటలు ఆడండి. దీనివల్ల పిల్లల్లో ఊహాత్మక శక్తి పెరుగుతుంది. అమ్మానాన్నలతో కలిసి ఆడుకుంటున్నామనే ఆనందం కలుగుతుంది. ఇటువంటి సరదాలు తల్లిదండ్రులకు పిల్లలను దగ్గర చేస్తాయి.

సినిమాలు చూస్తూ

● స్ఫూర్తిదాయకమైన లేదా నవ్వించే సినిమాలను పిల్లలతో కలిసి చూడండి. సినిమా చూస్తూ అందులోని సంఘటనలను చర్చించండి. సినిమాకి సంబంధించి పిల్లల సందేహాలు తీర్చండి. దీనివల్ల పిల్లల్లో సంభాషణా నైపుణ్యం పెరుగుతుంది. లోకజ్ఞానం తెలుస్తుంది. తల్లిదండ్రులతో గడిపిన ఆ క్షణాలు పిల్లల మనసుల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి.

మిగిలిన చపాతీలతో ఇలా...

ఒక్కోసారి చపాతీలు మిగిలిపోతుంటాయి. అవి తినడానికి అనువుగా ఉండవు. అలాగని పడేయలేము. కానీ వీటిని రుచికరమైన వంటకాలుగా మార్చవచ్చు. అవేంటో చూద్దాం!

రోటీ నూడుల్స్: నాలుగు చపాతీలను తీసుకుని ఒకదానిపై మరొకటి పెట్టి చాపలా చుట్టాలి. దీనిని చాకుతో సన్నగా కోయాలి. నూడుల్స్‌లా కనిపించే చపాతీ చీలికలు సిద్ధం అవుతాయి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అయిదు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో రెండు ఉల్లిపాయలు, ఒక క్యాప్సికమ్, ఒక చిన్న అల్లం ముక్క, రెండు వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరిగి వేయాలి. వీటిని ఎర్రగా వేపాలి. తరవాత ఒక చెంచా ఉప్పు, మూడు చెంచాల టమాటా కెచప్, రెండు చెంచాల సోయా సాస్ వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత చపాతీ చీలికలు కూడా వేసి బాగా కలిపి స్టవ్‌పై నుంచి దించాలి. దీనిపై కొద్దిగా కొత్తిమీర తరుగు, రెండు చెంచాల నిమ్మరసం చల్లుకుని వేడిగా తింటే చాలా రుచిగా ఉంటుంది. మంచి పోషకాహారం కూడా.

రోటీ ఉప్మా: ముందుగా రెండు చపాతీలను చిన్న ముక్కలుగా చేయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి బాగా వేడి చేయాలి. తరవాత పావు చెంచా ఆవాలు, పావు చెంచా జీలకర్ర, కరివేపాకు వేయాలి. అయిదు పచ్చిమిరపకాయలను చిన్న ముక్కలుగా కోసి వేయాలి. తరవాత ఒక పెద్ద ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. క్యారట్ ముక్కలు, పచ్చి బఠాణీలు వేసి బాగా మగ్గించాలి. తరవాత చపాతీ ముక్కలు, అర చెంచా ఉప్పు, పావు చెంచా మిరియాల పొడి వేసి బాగా కలపాలి. స్టవ్ మీద నుంచి దించిన తరవాత కొంచెం కొత్తిమీర చల్లి వడ్డించాలి.



రోటీ పిజ్జా: ముందుగా చపాతీ మీద పిజ్జా సాస్ లేదా టమాటా సాస్ రాయాలి. మీకు ఇష్టమైన కూరగాయలను సన్నగా తరిగి చపాతీ మీద పరచాలి. దాని మీద పన్నీర్ తరుగు వేయాలి. తరవాత ఒక చీజ్ ముక్కను తీసుకుని చపాతీపై పొరలా తురమాలి. ఓవెన్‌ను 180 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద 15 నిమిషాలు ముందుగా వేడిచేసిన తరవాత అందులో చపాతీని ఉంచి 8 నిమిషాలు బేక్ చేయాలి. చీజ్ తురుము బాగా కరిగి కూరగాయల ముక్కలకు పట్టడం వల్ల ఈ రోటీ పిజ్జా చాలా రుచిగా ఉంటుంది.

రోటీ లడ్డూ: రెండు చపాతీలను చిన్న ముక్కలుగా చేయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అయిదు చెంచాల నెయ్యి వేసి వేడి చేయాలి. అందులో చపాతీ ముక్కలు వేసి ఎర్రగా వేపాలి. తరవాత అరకప్పు బెల్లం తురుము వేసి కలపాలి. మిశ్రమం పూర్తిగా దగ్గరకు వచ్చాక అర చెంచా ఏలకుల పొడి, కొన్ని జీడిపప్పు పలుకులు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారాక లడ్డూల్లా చుట్టాలి.

వెక్కిరించిన వంటకాలే మెప్పించేలా..!



తమ తెగ సంస్కృతి గురించి, ఆహారపు అలవాట్ల గురించి మధుస్మిత సోరెన్‌కు అవహేళనలు, అవమానాలు ఎదురుకాని రోజు లేదు. కానీ అవి ఆమెలో పట్టుదలను పెంచాయి. వంటకాల్లో ప్రయోగాలకు ప్రేరణనిచ్చాయి. ఇప్పుడు ఫుడ్ బ్లాగర్‌గా, కన్సల్టెంట్‌గా సంతాలీ గిరిజన రుచులను ఆమె ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేస్తున్నారు.

"ఇరవయ్యేళ్ళ క్రితం... ఎంతో ఉత్సాహంతో కొత్త బడిలోకి అడుగుపెట్టిన నాకు తొలి రోజే తోటి పిల్లల వెక్కిరింతలు స్వాగతం పలికాయి. "మీరు నత్తల్ని, చీమల్ని తింటారట కదా!" అంటూ ఆటపట్టించారు. ఆ తరువాత ఆ బడిలో ఉన్నంతవరకూ మా సంస్కృతి మీద, ఆహారపు అలవాట్ల మీదా ఈ దాడి కొనసాగుతూనే ఉంది. మొదట్లో ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని. ఆ తరువాత నేను పట్టించుకోవడం మానేశాను. ప్రతి తరగతిలోనూ మొదటి స్థానంలో నిలిచి... వాళ్ళ కన్నా నాదే పైచెయ్యి అని నిరూపించడానికి ప్రయత్నించాను. కానీ వారి మాటలు నన్ను వెంటాడుతూనే ఉండేవి.

అపోహలు పోగొట్టాలని...

మాది ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా రాయ్‌రంగపూర్‌కు చెందిన సంతాలీ గిరిజన కుటుంబం. నా తల్లితండ్రులకు నేను ఏకైక సంతానం కావడంతో ఎంతో గారాబం చేసేవారు. నన్ను బాగా చదివించాలని తాపత్రయపడేవారు. నాకూ చదువంటే చాలా ఇష్టం. భువనేశ్వర్‌లోని 'కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ' (కెఐఐటి)లో బిఇ, ఆ తరువాత 'కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ'లో మాస్టర్స్ చేశాను. ఐఐటిలో పిహెచ్‌డిలో చేరాను కానీ వివాహం కావడం, అత్తింట్లో బాధ్యతల కారణంగా మధ్యలో ఆపేయాల్సి వచ్చింది. అప్పటివరకూ నేను పెద్దగా వంటలు చేసింది లేదు. కానీ ఎప్పుడూ మా అమ్మ వెంటే ఉండడంతో... ఏ వంట ఎలా వండాలో కాస్త తెలుసు. మా సంప్రదాయ వంటకాలను అమ్మ బాగా చేసేది. వాటిలో కొత్త దినుసుల్ని జోడించి మా అత్తవారింట్లో ప్రయోగాలు చేశాను. అందరూ మెచ్చుకున్నారు. అప్పుడు నాకు మా బడిలో అనుభవాలు గుర్తొచ్చాయి. గిరిజన వంటకాల విషయంలో... మైదాన ప్రాంతాలవారికి చాలా అపోహలున్నాయి. వాటిలో కూడా ఎంతో వైవిధ్యం, ఆరోగ్యసూత్రాలెన్నో ఇమిడి ఉన్నాయని అందరికీ చెప్పాలనుకున్నాను. 'రుచికరమైన ఆహారం సరిహద్దులకు, సంస్కృతులకు అతీతం. ఎన్నో విదేశీ వంటకాలను మనం ఏదో రూపంలో తింటున్నాం. మన రుచులను కూడా మిగిలిన ప్రాంతాలకు ఎందుకు పరిచయం చేయకూడదూ' అనుకున్నాను. గిరిజన వంటలపై మరింత లోతైన అధ్యయనం కోసం అనేక గ్రామాలు తిరిగాను. వయోధికులైన మహిళలతో మాట్లాడాను. సంతాలీ, విదేశీ వంటల తయారీ పద్ధతుల సమ్మేళనంతో ప్రయోగాలు చేశాను. అప్పుడే అనుకోకుండా ఒక అవకాశం వచ్చింది.

నమ్మకం పెరిగింది...

కొవిడ్‌కు ముందు 'ఒడిశా హోమ్‌చెఫ్' పోటీలు జరిగాయి. సంప్రదాయికమైన అంశాలేవీ మార్చకుండా... సంతాలీ వంటలకు సమకాలీనమైన హంగులు జోడించాను. ఆ పోటీలో మొదటి స్థానం నాదే. ఆ తరువాత జాతీయ స్థాయిలో 'మాస్టర్ చెఫ్' పోటీకి ఎంపికయ్యాను. 'పొలెంటా' అనేది ఇటాలియన్ వంటకం. దాన్ని కార్న్‌మీల్‌తో తయారు చేస్తారు. నేను మా ప్రాంతంలో దొరికే ఎర్ర బియ్యం, చికెన్‌తో తయారు చేశాను. దానిలో నంజుకోవడానికి ఎర్ర చీమల (క్రై) చట్నీ రూపొందించాను. అవి న్యాయ నిర్ణేతలకు ఎంతగానో నచ్చాయి. ఒడిశాతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది నన్ను అభినందించారు. దాంతో నా మీద నాకు నమ్మకం పెరిగింది. వంటల వీడియోల రూపకల్పనకు ప్రోత్సాహాన్నిచ్చింది. పూర్తిస్థాయి ఫుడ్ బ్లాగర్‌గా మారాను. గిరిజన ఆహారాన్ని... సాధికారత చెక్కు చెదరకుండా... కొత్త పద్ధతులతో మేళవింపు చేయడం గురించి తెలుసుకోవడానికి ఆహార, ఆతిథ్య రంగాలకు చెందిన వ్యక్తులు నన్ను సంప్రతించడం ఆరంభించారు. నాకు మంచి ప్రచారం వచ్చింది.



అది గర్వంగా చెప్పుకోగలను...

ప్రస్తుతం అనేక మంది చెఫ్‌లతో, ప్రముఖ రెస్టారెంట్లతో, హోటల్ శిక్షణ సంస్థలతో కలిసి పని చేస్తున్నాను. దాదాపు ప్రతి చోటా గిరిజన వంటకాలను వారి మెనూలో ఉండేలా చేయడం నేను సాధించిన విజయమని గర్వంగా చెప్పుకోగలను. విదేశాల్లోనూ ఇప్పుడు నాకు, నా వంటకాలకు ఎందరో అభిమానులున్నారు. నేను చదివిన 'కెఐఐటి', జయపురంలోని 'ఇందిరాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్' (ఐఐహెచ్‌ఎం)లలో గిరిజన ఆహార కన్సల్టెంట్‌గా ఉన్నాను. దేశవ్యాప్తంగా గిరిజన ఆహార పద్ధతులకు ప్రాచుర్యం తేవడానికి వర్క్‌షాప్‌లు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాను. నేను చేసే ప్రతి కొత్త ప్రయోగం నాలో ఆత్మవిశ్వాసం పెంచుతోంది. తరతరాల మా వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం, నా మూలాల పరిరక్షణకు పాటుపడడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను."

లగచర్ల కేసులు నాంపల్లి కోర్టుకు బదిలీ

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలపై నమోదైన కేసుల విచారణ ఇకపై నాంపల్లిలోని ప్రత్యేక న్యాయస్థానంలో జరగనుంది. ప్రభుత్వ ఆస్తులపై జరిగిన దాడుల కేసుల విచారణలు ప్రత్యేక న్యాయస్థానంలోనే జరగాలంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన సర్క్యులర్ మేరకు మంగళవారం వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు వాటిని నాంపల్లి కోర్టుకు బదిలీ చేసింది. భూసేకరణ విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై దాడి చేయడంతో పాటు, వారు వచ్చిన ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేసినట్లు పలువురిపై కేసులు నమోదయ్యాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఇతర నిందితులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ఇరు పక్షాల వాదనలు పూర్తయ్యాయి. కేసుల విచారణ నాంపల్లిలోని ప్రత్యేక న్యాయస్థానంలోనే జరగాలని ప్రిన్సిపల్ జడ్జి ఆదేశించారు. దాంతో మళ్లీ ఆ కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

లగచర్ల ఘటన వెనక ఉన్నదెవరు..?

- ఏ-2 సురేశ్‌రాజ్‌ను విచారించిన పోలీసులు

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల ఘటనకు ప్రధాన సూత్రధారులు ఎవరనే విషయమై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. లగచర్ల కేసులో ఏ-2 నిందితుడు సురేశ్‌రాజ్‌ను కొడంగల్ కోర్టు కస్టడీకి అనుమతించగా, మంగళవారం ఉదయం పోలీసులు అతడిని సంగారెడ్డి జైలు నుంచి వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయానికి తీసుకువచ్చారు. లగచర్ల ఘటనపై విచారణాధికారిగా కొనసాగుతున్న తాండూరు డీఎస్పీ.. సురేశ్‌రాజ్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ సమక్షంలో ఎస్పీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ విచారణ జరిగినట్లు సమాచారం. అధికారులను ఉద్దేశపూర్వకంగా లగచర్లకు రప్పించి వారిపై దాడులు చేసే విధంగా ముందే ప్లాన్ వేసుకున్నారా..? ఎవరి అండదండలతో దాడులకు పాల్పడ్డారు..? అంటూ పోలీసు అధికారులు సురేశ్‌రాజ్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాత్రపై ఆరా తీసినట్లు సమాచారం. లగచర్ల ఘటనకు ముందు, తర్వాత సురేశ్‌రాజ్ ఎవరెవరితో మాట్లాడాడు..? 11న అధికారులపై దాడి జరిగితే 19 వరకు ఆచూకీ దొరక్కుండా ఎక్కడ ఉన్నాడు..? ఎవరు ఆశ్రయం ఇచ్చారు..? తదితర విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. కాగా, పోలీసు అధికారులు అడిగిన ప్రశ్నలకు సురేశ్‌రాజ్ కాదు.. లేదు.. అంటూ ముక్తసరిగా సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది.

రామగుండంలో దంత కళాశాల!

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో కొత్త వైద్య కళాశాల ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర వైద్యశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఒక దంత కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిని ఉమ్మడి జిల్లాలోని రామగుండం(ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా)లో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో సర్కారు ఉంది. ప్రస్తుతం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 9వ తేదీలోగా కొత్త దంత కళాశాల ఏర్పాటును అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. వంద బీడీఎస్ సీట్లతో ఆ కళాశాల ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు వెళ్లాయి. .

స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నం వల్లే

దంత కళాశాలను తన నియోజకవర్గంలోనే ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కన్ సింగ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ వచ్చారు. రామగుండంలో ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాల ఉంది. దంత కళాశాల ఏర్పాటుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలన్నీ కూడా రామగుండంలో ఉన్నాయని ఆయన సర్కారు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో అక్కడే కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గుచూపినట్లు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయాలి

విదేశాలకు పారిపోయే ప్రమాదముంది

- సిద్దిపేట వార్‌రూమ్‌లో నా ఫోన్ ట్యాప్ చేశారు
- నా భార్య, డ్రైవర్ ఫోన్లు కూడా
- యాపిల్ కంపెనీ ద్వారా తెలిసింది
- హరీశ్, రాధాకిషన్‌పై పంజాగుట్టలో కేసు నమోదు
- విలేకరుల సమావేశంలో బాధితుడు జి.చక్రధర్ గౌడ్

పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచి నా ఫోన్‌ను ట్యాప్ చేశారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన వార్‌రూమ్ నుంచి నా ఫోన్‌తోపాటు.. నా భార్య, కారు డ్రైవర్, కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాప్ చేసి, వ్యక్తిగత సంభాషణలను సైతం విన్నారు. ఈ సారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. ఈ పాటికి నన్ను మర్డర్ చేసి ఉండేవారు. అప్పటి డీఎస్పీ ప్రణీత్, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుతో కలిసి.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ దారుణానికి ఒడిగట్టారు" అని సిద్దిపేటకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. ఫోన్‌ట్యాపింగ్‌పై హైకోర్టులో పోరాటం చేస్తున్నాని, అక్కడ న్యాయం దొరక్కపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావుపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు బీఎన్ఎస్, ఐటీ చట్టాల్లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని వివరించారు. మంగళవారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో హరీశ్‌రావును వెంటనే అరెస్టు చేయాలని, లేకపోతే ఆయన విదేశాలకు పారిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. "నేను సిద్దిపేట నియోజకవర్గంలో సేవాకార్యక్రమాలు నిర్వహించా. ఈ క్రమంలోనే నాకు హరీశ్‌రావు అనుచరుల నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. ఆత్మహత్య చేసుకున్న వంద మంది కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పు.. మొత్తం రూ.కోటి పంపిణీ చేశాను. ఈ కార్యక్రమానికి అప్పటి గవర్నర్ తమిళిసైని ఆహ్వానించా. అయితే.. ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా హరీశ్‌రావు అనుచరులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి నాపై అక్రమ కేసుల పరంపర మొదలైంది" అని ఆయన వాపోయారు. తనపై వేధింపులు పెరగడంతో బీజేపీలో చేరినట్లు వివరించారు. అయినా.. అత్యాచారం, జాబ్‌ఫ్రాడ్ వంటి ఆరు అక్రమ కేసులు బనాయించి, తనను వేధించారని తెలిపారు. ఈ కేసుల్లో తనతోపాటు.. తన తల్లి, చెల్లిని ఇరికించారని, రాధాకిషన్‌రావు ఏకంగా తనను జైలులో చంపితే అడిగేవారుండరని బెదిరించినట్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఎస్పీ నుంచి టికెట్ సాధించి, హరీశ్‌కు వ్యతిరేకంగా పోటీ చేశానని, అప్పటి నుంచి తన ఫోన్ ట్యాప్ అయ్యిందని వివరించారు. తన ఐఫోన్ హ్యాక్ అవుతోందనే విషయం యాపిల్ కంపెనీ పంపిన సందేశంతో తెలిసిందన్నారు. హరీశ్ అవినీతిపై అడుగడుగునా పోరాటం చేశానని, అందుకే తనను టార్గెట్‌గా చేసుకున్నారని పేర్కొన్నారు. హరీశ్ బాధితులు తనలాగే ఎందరో ఉన్నారని, వారు కూడా ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చావుకొస్తున్న చదువులు

ఒత్తిడిలో ఒరిగిపోతున్న విద్యార్థులు.. భారం భరించలేక బలవన్మరణాలు

- చదువు నేర్వాల్సిన తరగతిగదుల్లోనే ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులు
- పిల్లల సామర్థ్యాలను సరిగా అంచనా వేయాలంటున్న సైకాలజీ ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో అతి ప్రధానమైన, అత్యంత కీలకమైన ఇంటర్మీడియట్ విద్య క్లిష్టంగా మారింది. "ఇంటర్‌లో మంచి మార్కులు సాధిస్తే జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటావ"ంటూ ఇటు తల్లిదండ్రులు, అటు లెక్చరర్లు పెడుతున్న ఒత్తిడిని తట్టుకోలేక.. వారు ఆశించిన స్థాయిలో మార్కులు తెచ్చుకోలేక.. కొందరు విద్యార్థులు నలిగిపోతున్నారు. కొన్ని కాలేజీల్లో అయితే.. పిల్లలను కనీసం మూత్రవిసర్జనకు కూడా వెళ్లనివ్వని పరిస్థితి ఉంది. బాగా చదువుకోకపోతే కొట్టడం, మోకాళ్ల మీద నిలబెట్టడం వంటి శిక్షలు సరేసరి. ఈ హింసకు తోడు.. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ పుస్తకాలతో కుస్తీ పట్టినా ఫలితం లేకపోవడంతో.. కన్నవారి కలను తీర్చలేమోనన్న ఆందోళనతో విద్యార్థులు తీవ్ర నిర్ణయాలు తీసుకుని అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. మరికొందరు విద్యార్థులేమో.. యాజమాన్యాలు, అధ్యాపకుల వేధింపులను భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పిల్లల భవిష్యత్తుపై గంపెడు ఆశతో కొండంత అప్పులు చేసి చదివిస్తున్న తల్లిదండ్రులు.. ఆ పిల్లలనే కోల్పోయి గుండెలవిసేలా రోదిస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో 32 ప్రభుత్వ, 285 ప్రైవేట్ ఇంటర్మీడియట్ డేస్కాలర్, రెసిడెన్షియల్ కాలేజీలు నడుస్తున్నాయి. అలాగే రంగారెడ్డిలో 18 ప్రభుత్వ, 180 ప్రైవేట్.. మేడ్చల్ జిల్లాలో 6 ప్రభుత్వ, 126 ప్రైవేట్ కళాశాలలు కొనసాగుతున్నాయి. అన్ని చోట్లా కలిపి సుమారు 3,48,226 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన లభించదనే భావనతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను పేరొందిన కార్పొరేట్, రెసిడెన్షియల్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. ఫీజులు తమ ఆర్థిక స్తోమతకు మించి ఉన్నప్పటికీ అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నారు. కానీ.. యాజమాన్యాలు, అధ్యాపకుల దృష్టంతా మార్కులపైనే ఉండడంతో, సరిగా మార్కులు రాని పిల్లలను దండిస్తుండడంతో విద్యార్థులు మానసిక ఆందోళనకు గురై కుంగిపోతున్నారు. అదే ఈ విషాద ఘటనలకు కారణమవుతోంది.



విద్యార్థుల కదలికలను గమనించాలి

రెసిడెన్షియల్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల మానసిక సామర్థ్యాలను లెక్చరర్లు అంచనా వేయాలి. తరగతి గదుల్లో వారి కదలికలను, పఠనాసక్తిని ఎప్పటికప్పుడు గమనించాలి. క్లాసుల్లో వెనుకబాటుకు గురయ్యే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. వారికి అర్థమయ్యేలా బోధించాలి. ఎక్కువ మార్కులు సాధించాలంటూ వారిపై ఒత్తిడి తీసుకొస్తే అనర్థాలు జరిగే ప్రమాదం ఉంది. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను ఇబ్బంది పెట్టినట్లు గ్రహిస్తే తల్లిదండ్రులు వెంటనే యాజమాన్యాలను నిలదీయాలి. విద్యార్థుల్లో మానసిక సమస్యలను అరికట్టేందుకు నెలకోసారి సైకాలజిస్టులతో కౌన్సిలింగ్ ఇప్పించాలి. విద్యార్థులు ధైర్యంగా ఉండాలి.

\- డాక్టర్ స్వాతి, సైకాలజీ ప్రొఫెసర్, ఓయూ

చావడం కాదు.. బతికి సాధించాలి

- విద్యార్థులకు మంత్రి కోమటిరెడ్డి సూచన

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏ సమస్యకైనా చావు అంతిమ పరిష్కారం కాదని.. బతికి సాధించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థులకు హితవు పలికారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో పది రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని చనిపోయే పరిస్థితులు ఏర్పడడంపై మంత్రి సీరియస్ అయ్యారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం, ర్యాంకుల కోసం పిల్లలపై తెచ్చే అనవసరమైన ఒత్తిడి కారణంగా ఇంటర్ విద్యార్థులు చనిపోవడం బాధాకరమని 'ఎక్స్' వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లలు అర్ధాంతరంగా చనిపోవడం మనసును కలచివేస్తోందన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. బలవంతంగా సిలబస్‌ను రుద్ది పిల్లల జీవితాలతో ఆడుకోవద్దన్నారు.

సమస్యలుంటే నన్ను సంప్రదించండి

విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలంటూ మంత్రి కోమటి రెడ్డి 'ఎక్స్' వేదికగా.. తన కార్యాలయ ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ ఇచ్చారు.

ఫోన్ నంబర్: 8688007954

ఈమెయిల్ ఐడీ: minister.randbc@gmail.-com

కూతురి కులాంతర ప్రేమకు తల్లి బలి

- పెళ్లికి ఒప్పుకోని కుటుంబ సభ్యులు
- నిర్బంధించారని కూతురి ఫిర్యాదు ఇంటికొచ్చిన పోలీసులు
- పరువు పోయిందని తల్లి ఆత్మహత్య

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వేరే కులం యువకుడిని ప్రేమించిన కూతురు.. తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటికి పోలీసులు రావడంతో అవమానంగా భావించి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు సూటిపోటి మాటలు అనడంతో కూతురు ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఏపీలోని అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్‌లో సోమవారం రాత్రి ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. పట్టణానికి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి (50) దంపతుల కూతురు శ్రీజ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. స్థానికంగా పెయింటింగ్ చేసుకునే ఓ యువకుడిని ప్రేమించింది. అతడినే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పింది. వేరే కులం కావడంతో వారు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆమె కొంతకాలం మౌనంగా ఉండిపోయింది. ఆ తరువాత మానవహక్కుల సంఘానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసింది. వర్క్ ఫ్రం హోం చేస్తున్న ఆమె.. తనను తల్లిదండ్రులు నిర్బంధించారని ఫిర్యాదులో పేర్కొంది. రెండు రోజుల క్రితం (సోమవారం) డయల్ 100కు ఫోన్ చేసి మరోసారి ఇలాగే ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వారి ఇంటికి వెళ్లి విచారించారు. శ్రీజను ఎవరూ నిర్బంధించలేదని నిర్ధారించుకుని, నచ్చజెప్పి వెనుదిరిగారు. పోలీసులు ఇంటికి రావడంతో పరువు పోయిందని ఆవేదన చెందిన శ్రీలక్ష్మి.. సోమవారం రాత్రి విషం తాగింది. కాసేపటికి గమనించిన ఆమె భర్త.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో విషయం బయటకు పొక్కకుండా శ్రీలక్ష్మి మృతదేహాన్ని భర్త ఇంటికి తీసుకువెళ్లారు. వారి బంధువులు వచ్చాక శ్రీజను సూటిపోటి మాటలు అన్నారు. 'నీ కారణంగానే మీ అమ్మ ఆత్మహత్య చేసుకుంది' అని మండిపడ్డారు. దీంతో శ్రీజ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గమనించి, ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నవ్య | చిత్రజ్యోతి



శ్రద్ధా ఇంటి రెంట్ ఎంతో తెలుసా?

'స్త్రీ 2' చిత్రం సూపర్ హిట్‌తో జోష్ మీద ఉన్నారు బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్. పారితోషికం కూడా అమాంతం పెంచేశారట. ఆమె చెబుతున్న రేట్లు వింటుంటే నిర్మాతలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయని బీ టౌన్ టాక్. తెలుగులో 'పుష్ప 2' లో ఐటెం సాంగ్‌కు మొదట శ్రద్ధనే అడిగారు. కానీ ఆమె చెప్పిన పారితోషికం విన్న తర్వాత మనసు మార్చుకుని శ్రీలీలను ఎంపిక చేశారు. అలాగే నాని హీరోగా రూపొందే సినిమాలో కూడా కేవలం పారితోషికం కారణంగా అవకాశం కోల్పోయారు శ్రద్ధ. 'అయినా డోంట్ కేర్ .. నా సినిమాలు నాకు ఉంటాయి' అనే రీతిలో శ్రద్ధా ప్రవర్తిస్తోందని చెబుతున్నారు. పారితోషికం విషయం పక్కనపెడితే, ఈ మధ్య ఆమె అద్దెకు తీసుకున్న ఫ్లాట్ గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. సినిమా వాళ్లంతా ఉండే జుహూ ప్రాంతంలో ఓ ఖరీదైన అపార్ట్‌మెంట్‌ను శ్రద్ధా రెంట్‌కు తీసుకుంది. అద్దె ఎంతో తెలుసా? నెలకు రూ.ఆరు లక్షలు. ఒక ఏడాది పాటు ఈ ఫ్లాట్‌ను లీజ్‌కు తీసుకున్న శ్రద్ధ సంవత్సరం అద్దె రూ. 72 లక్షలు ముందే కట్టేశారట. నాలుగు కార్లు పార్క్ చేసుకోవడానికి సదుపాయం ఉందట. సొంతంగా ఫ్లాట్ కొనుక్కునే స్తోమత ఉన్నా కూడా శ్రద్ధ కొనుక్కోకుండా అద్దె ఇంట్లోకి ఎందుకు వెళుతుందో ఆమెకే తెలియాలి!



గోదారి గట్టు ప్రేమగీతం

వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలుగా నటిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి తొలి గీతాన్ని విడుదల చేశారు. 'గోదారి గట్టు' అంటూ సాగే ఈ రొమాంటిక్ గీతంలో వెంకటేశ్, ఐశ్వర్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. భాస్కర భట్ల రచించగా.. రమణ గోగుల, మధు ప్రియ ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ సినిమా గురించి వెంకటేశ్ మాట్లాడుతూ "ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రయాణం ఈ సినిమా. ఈ సంక్రాంతికి ఒక మంచి వినోదాత్మక చిత్రాన్ని ప్రేక్షకులకు అందివ్వాలనే సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. నా కెరీర్‌లో నేను నటించిన ఉత్తమ కుటుంబ కథా చిత్రమిదే. అందరికీ నచ్చుతుంది. అనిల్‌తో పనిచేయడం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది" అని చెప్పారు. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇది వరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.



నాని సమర్పణ దసరా దర్శకుడు

మెగాస్టార్ కొత్త చిత్రం

చిరంజీవి కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం ఖరారైంది. హీరో నాని సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కనుండడం విశేషం. ఆయన మంగళవారం ఈ సినిమా వివరాలను సోషల్ మీడియా ద్వారా తెలిపారు. నాని హీరోగా నటించిన 'దసరా' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీకాంత్ ఓదెల ఇప్పుడు చిరంజీవిని డైరెక్ట్ చేసే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రక్తంతో తడిసిన చేతులు ఉన్న పోస్టర్‌ను షేర్ చేసి, 'హింసలోనే అతడు తన శాంతిని వెతుక్కున్నాడు' అనే వ్యాఖ్యను జోడించారు. దీన్ని బట్టి ఈ చిత్రం మాస్ అంశాలతో తెరకెక్కుతోన్న యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. 'నేను హీరో అవ్వడానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి చిరంజీవి. ఆయన సినిమా టికెట్ల కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూశాను. ఓసారి సైకిల్ కూడా పోగొట్టుకున్నాను. ఇప్పుడు సమర్పకుడిగా ఆయనతో ఓ చిత్రం చేయబోతున్నా. చిరంజీవిని సరికొత్తగా చూపించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం. నా దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఆ కల తీరబోతోంది' అని నాని చెప్పారు. ఫ్యాన్‌బాయ్ తాండవం ఎలా ఉంటుందో చూపిస్తాను అని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్పందించారు. ఆయన ప్రస్తుతం నానితో 'ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి 'విశ్వంభర' చిత్రం చేస్తున్నారు. ఇవి రెండూ పూర్తయ్యాక కొత్త సంవత్సరంలో చిరంజీవి సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.



తెరపై శివాజీ గాథ

కన్నడ హీరో, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి మరో భారీ ప్రాజెక్ట్‌కు సైన్ చేశారు. వీర యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్ 'ద ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహరాజ్'. బాలీవుడ్ దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కించనున్నారు.





మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్ సింగ్ మాట్లాడుతూ "ఈ సినిమా చేయడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. ఈ పాత్ర కోసం రిషబ్‌ను ఎంచుకోవడానికి కారణం.. ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్ బలాన్ని.. పరాక్రమాన్ని మూర్తీభవిస్తాడు. ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. భారతీయ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని యాక్షన్‌ను ఇందులో చూస్తారు. అన్ని అసమానతలను ఎదురించి పోరాడిన ఓ వీరోచిత యోధుడి మహా గాథ ఇది" అని చెప్పారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 2027 జనవరి 21న విడుదల కానుంది.

రిటైర్మెంట్ కాదు విరామమే..



బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే నటనకు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇది తాత్కాలికమా..లేదా ఆయన పూర్తిగా నటన నుంచి వైదొలగారా అనే చర్చ సోషల్‌మీడియాలో నడుస్తోంది. ఈ విషయంపై విక్రాంత్ స్పష్టతనిచ్చారు. "నాకు వచ్చింది.. నేను చేయగలిగేది నటన మాత్రమే. నటనే నాకు ఈ స్థాయిని ఇచ్చింది. ఈ మధ్య నా శారీరక.. మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ప్రస్తుతం నాకు అంతా మొనాటనీగా అనిపిస్తోంది. అందుకే నేను సినిమాల నుంచి కాస్త విరామం తీసుకుని.. మరింతగా నా నటనను మెరుగుపరచుకుందామని అనుకుంటున్నాను. నేను నటనకు విరామం ఇస్తున్నా అని చెప్పిన పోస్టును చాలా రకాలుగా అర్థం చేసుకుంటున్నారు. నేను రిటైర్ అవ్వటం లేదు. ఫ్యామిలీ కోసం.. ఆరోగ్యం కోసం తగిన సమయం కేటాయించాలనుకుంటున్నాను. సరైన సమయం వచ్చినప్పుడు మళ్లీ తిరిగి వస్తా" అని చెప్పారు. కాగా, విక్రాంత్ నటించిన తాజా చిత్రం 'సబర్మతీ ఎక్స్‌ప్రెస్' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు ప్రధాని నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ "ప్రధాని మోదీతో కలసి నా సినిమాను చూడటం నా జీవితంలోనే మరిచిపోలేని అనుభూతి" అని తెలిపారు.



ఎదలో సవ్వడి

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'కన్యాకుమారి'. రాడికల్ పిక్చర్స్ బేనర్‌పై దర్శక నిర్మాత సృజన్ అట్టాడ రూపొందిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా నుంచి 'ఎద ఎద సవ్వడి' లిరికల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సృజన్ అట్టాడ లిరిక్స్ అందించగా..అనురాగ్ కులకర్ణి, జయశ్రీ పల్లెం పాడారు. రవి నిడమర్తి బ్యూటిఫుల్‌గా ట్యూన్ చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఆదిపురుష్ దర్శకుడి కొత్త చిత్రం



'ఆదిపురుష్' చిత్ర దర్శకుడు ఓం రౌత్ పేరు చెబితే చాలు ప్రభాస్ ఫ్యాన్స్ ఉలిక్కిపడతారు. రామాయణ గాథని ఈ యువ దర్శకుడు ఇంకెంత గొప్పగా చెబుతాడో అని ఆసక్తిగా ఎదురు చూసిన ప్రభాస్ అభిమానులే కాదు సాధారణ ప్రేక్షకులు కూడా ఆ సినిమా చూసి నివ్వెర పోయారు. ఓం రౌత్ పైత్యం, విపరీత ధోరణి వారిని ఆశ్చర్యానికి, ఆగ్రహానికి గురి చేసింది. విమర్శకుల దాడిని తట్టుకోలేక అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు రౌత్. తను ఎక్కడ ఉన్నదీ తెలియకుండా జాగ్రత్త పడ్డారు. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత బయటకు వచ్చిన ఓం రౌత్ కొత్త సినిమా సన్నాహాలు ప్రారంభించారు. ఈసారి పౌరాణిక కథను కాకుండా చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తీయనున్నారు. అజయ్ దేవగణ్‌ను ఒప్పించి, ఆయన డేట్స్ సంపాదించారు. హృతిక్ రోషన్ ఇందులో విలన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయని బీ టౌన్ టాక్. ఈసారైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఓం రౌత్ ఈ సినిమా తీయాలని జనం కోరుకుంటున్నారు.

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించండి!

- మల్లయ్య మృతదేహాన్ని మాత్రం రేపటి వరకు భద్రపర్చండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏటూరు నాగారం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల్లో ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు తప్ప మిగిలిన ఆరుగురి మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. మల్లయ్య మృతదేహాన్ని ఈనెల 5వ తేదీ వరకు భద్రపర్చాలని పేర్కొంది. ఏటూరు నాగరం ఎన్‌కౌంటర్ బూటకమని, మావోయిస్టులు తినే ఆహారంలో మత్తుపదార్థాలు కలిపి చిత్రహింసలు పెట్టి చంపారని మల్లయ్య భార్య కాల్వల ఐలమ్మ అలియాస్ మీనా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శవ పంచనామాలో కుటుంబసభ్యులను అనుమతించలేదని, పోస్ట్‌మార్టం ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో జరగలేదని పేర్కొన్నారు. మంగళవారం ఈ పిటిషన్ జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చింది. హోంశాఖ తరఫున న్యాయవాది మహేశ్ రాజే వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం ఫోరెన్సిక్ నిపుణులు సహా ఎనిమిది మంది డాక్టర్ల బృందం పోస్ట్‌మార్టం ఎగ్జామినేషన్ చేసిందని.. హైకోర్టు ఆదేశాల ప్రకారం పిటిషనర్‌ను తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్‌ను అనుమతించిన నేపథ్యంలో ఇక మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలని పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాది సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మల్లయ్య మృతదేహాన్ని చూడటానికి ఐలమ్మను కేవలం 10 నిమిషాలే అనుమతించారని, ఈ కొద్ది సమయంలోనే ఆమె తన భర్త మృతదేహంపై దాదాపు 11 గాయాలను గుర్తించారని తెలిపారు. శవ పంచనామాకు పిటిషనర్‌ను అనుమతించలేదన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ మార్గదర్శకాల ప్రకారం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో శవ పంచనామా జరిపించేలా ఆదేశించాలని కోరారు. ఇది ఎన్‌కౌంటర్ కాదని.. కస్టోడియల్ డెత్ అని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆమె భర్త మల్లయ్య మృతదేహం తప్ప మిగితావాళ్లవి వారి బంధువులు అడిగితే అప్పగించాలని స్పష్టం చేసింది. పోస్ట్‌మార్టం ఎగ్జామినేషన్, శవపంచనామా నిర్వహణలో అనుసరించిన విధానంపై సంక్షిప్త వివరాలు సమర్పించాలని పేర్కొంది. తదుపరి విచారణను ఈనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు మంగళవారం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మరో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను తీసుకునేందుకు వారి బంధువులు వస్తున్నట్లు సమాచారం.

ఎన్‌కౌంటర్‌పై మెజిస్టీరియల్ విచారణ

ములుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు మరణించిన ఘటనపై కలెక్టర్ టీఎస్.దివాకర విచారణకు ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా ములుగు ఆర్డీవో వెంకటేశ్‌ను నియమించారు.

వరంగల్‌లో బ్యాంకు రిటైర్డు మేనేజర్ హత్య

- కాళ్లు, చేతులు గొలుసులతో కట్టేసి కిరాతకం
- కారులో శవాన్ని వదిలివెళ్లిన దుండగులు


రాజమోహన్ (ఫైల్)

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఓ బ్యాంకు రిటైర్డు మేనేజర్ దారుణ హత్యకు గురయ్యారు. నిందితులు కాళ్లు చేతులను గొలుసులతో కట్టేసి ఉన్న మృతదేహాన్ని కారులో వదిలివెళ్లారు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ శ్రీనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్‌కు చెందిన ఎలిగేటి రాజమోహన్ (64) ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. 2021లో భార్య మృతి చెందడంలో ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె శిరీష అమెరికాలో, చిన్న కుమార్తె స్ఫూర్తి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సోమవారం రాత్రి పెద్దకుమార్తె శిరీష తండ్రికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటి సమీపంలో ఉన్న మిత్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూసి, రాజమోహన్ ఇంట్లో లేరని, కారు కూడా లేదని శిరీషకు చెప్పారు. తర్వాత రాత్రి 12 గంటలకు రాజమోహన్ ఫోన్ కూడా స్విచాఫ్ అయింది. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు రాజమోహన్ మిత్రులు మంగళవారం ఉదయం సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే వరంగల్ రంగంపేట పాత ఏకశిల హోటల్ సందులో ఓ కారులో మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా వారికి సమాచారం అందింది. వెంటనే వెళ్లి పరిశీలించి, మృతదేహం రాజమోహన్‌దేనని గుర్తించారు. తలపైన, మెడపైన తీవ్ర గాయాలతో ఉన్న మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి మంగళవారం తెల్లవారుజామున 3.40 గంటలకు రంగంపేటలో వదిలి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

రాష్ట్రంలో మతకల్లోలాలు పెరిగాయి

- బీజేపీ విద్వేషానికి అడ్డుకట్ట వేయాలి: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో మతకల్లోలాలు పెరిగాయని, ప్రజల ప్రశాంత జీవనానికి విఘాతం కలుగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో లౌకికత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రోత్సహిస్తున్న విద్వేషానికి అడ్డుకట్ట వేయాలన్నారు. తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ సంఘాల నేతలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లౌకిక వ్యతిరేకశక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ నే ఉంటామని చెప్పారు. ఆ తర్వాత గంగపుత్ర సంఘం నేతలు కవితను కలిశారు.

బంగారం వ్యాపారిని హత్య చేసింది తోటి వ్యాపారే!

తన వద్దకు బంగారం విక్రయించేందుకు వచ్చే శేషును చంపిన షాపు యజమాని

- మరో ముగ్గురితో కలిసి హత్య చేసిన దీపక్
- వనపర్తి జిల్లాలో కేసును ఛేదించిన పోలీసులు
- 70 లక్షల బంగారు, వెండి, నగదు స్వాధీనం
- నలుగురు నిందితుల రిమాండ్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగారం వ్యాపారం చేసే షాపు యజమాని.. తన వద్ద బంగారాన్ని విక్రయించేందుకు వచ్చిన వ్యాపారినే చంపేశాడు. తనను నమ్మి వెంట వచ్చిన వ్యాపారిని.. అతని వద్ద ఉన్న ఆభరణాలు, డబ్బు కోసం హత్యచేశాడు. ఈ మేరకు గత నెల 21న వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామ సమీపంలో సంచలనం సృష్టించిన బంగారం వ్యాపారి శేషు హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన బంగారం వ్యాపారి శేషు (43)కు మూడేళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలోని ధనలక్ష్మి జ్యువెలర్స్ షాపు యజమాని, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన దీపక్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. శేషు 15 రోజులకోసారి, నెలకోసారి దీపక్ వద్దకు వచ్చి తన దగ్గర ఉన్న బంగారు ఆభరణాలను విక్రయించి వెళుతుంటాడు. అయితే దీపక్‌కు వ్యాపారంలో నష్టాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అదే సందర్భంలో తన వద్దకు వచ్చిన శేషు వద్ద ఉన్న బంగారాన్ని చూడగానే క్రూరమైన ఆలోచన వచ్చింది. శేషును అంతమొందించి అతని వద్ద ఉన్న ఆభరణాలను దోచేస్తే తన అప్పులు తీరుతాయని దీపక్ భావించాడు. ఈ విషయాన్ని రాజస్థాన్‌లో ఉన్న తన తమ్ముడు రమేశ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో రమేశ్.. జగదీశ్, ముకేశ్ అనే మరో ఇద్దరితో కలిసి జైపూర్ నుంచి వచ్చాడు. వీరు ముగ్గురిని జడ్చర్లలో ఉంచిన దీపక్.. నవంబరు 21న వారిని హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు బయలుదేరాడు. అయితే అదే సమయంలో దీపక్‌కు శేషు ఫోన్ చేసి తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో దీపక్ ఆ ముగ్గురిని పథకం ప్రకారం మంగనూరు గ్రామంలో దింపాడు.

ముక్కు, నోరు మూసి..

బిజినేపల్లికి వెళ్లిన దీపక్.. శేషుకు పాత బాకీ రూ.6,50,000 ఇచ్చాడు. ఆపై తాను మహబూబ్‌నగర్‌కు వెళుతున్నట్లు శేషు చెప్పగా.. తాను కూడా అక్కడికే వస్తున్నానంటూ దీపక్ అతణ్ని తన వాహనం ఎక్కించుకొని భూత్పూర్ వైపు వెళ్లాడు. దారిలో మంగనూరులో మకాం వేసిన ముగ్గురిని కారులో ఎక్కించుకున్నాడు. కొద్ది దూరం వెళ్లాక జగదీశ్, రమేశ్‌తో కలిసి శేషును చేతులతో గుద్దగా అతను స్పృహ తప్పాడు. వెంటనే అతని సెల్‌ఫోన్ లాక్కొని నీళ్లున్న వాగులోకి విసిరేశారు. కార్లో తిరుగుతూ చిన్నంబావి మండల వెలగొండ గ్రామ సమీపంలోకి రాగానే స్పృహలోకి వచ్చిన శేషును ఆ నలుగురు కలిసి అక్కడే ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి చంపేశారు. రోడ్డు పక్కనే ఉన్న బీటీ రోడ్డు గుంతలో మృతదేహాన్ని పడేసి అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు తీసుకొని వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులోని నిందితులైన దీపక్ మాలి, రమేశ్ మాలి, జగదీశ్ బార్వాడ్, ముఖేశ్ మెక్వల్ లను నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.57 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల 53 వేల విలువ గల వెండి ఆభరణాలు, రూ.6.53 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

లక్ష తప్పుడు కేసులు పెట్టించినా.. ప్రజల కోసం ప్రశ్నిస్తూనే ఉంటా

- నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నావ్
- రేవంత్‌రెడ్డీ.. ఇవి తప్ప నీకేంచేత కాదు: హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తూ.. నీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ.. ప్రజల పక్షాన నిన్ను ప్రశ్నించడాన్ని భరించలేక నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నావ్. మిస్టర్ రేవంత్‌రెడ్డీ.. నాపై లక్ష తప్పుడు కేసులు పెట్టించినా సరే.. నేను భయపడను. ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటా. తప్పు చేసి దబాయించడం, మాట మార్చడం.. నీ తప్పులు ఎత్తి చూపిన వారిపై అక్రమంగా కేసులు బనాయించడం.. ఇవి తప్ప నీకేం చేతకాదు" అని మంగళవారం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. "రుణ మాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేశావన్నందుకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో తప్పుడుకేసు పెట్టించావు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్‌రెడ్డిఅని అన్నానని.. బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించావు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు నామీద సంబంధంలేని కేసు పెట్టించావు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు.. తలాతోకా లేని కేసొకటి మానకొండూరులో అక్రమంగా పెట్టించిన దుర్మార్గపు ఆలోచన నీది. మొన్న నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక తాజాగా పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసుపెట్టించావ్. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని నువ్విలా తప్పుడు కేసులు పెట్టిస్తే భయపడే స్థితిలో లేను. ప్రజాకోర్టులో, ప్రజల తీర్పుతో నీకు తగినశిక్ష పడేంత వరకు నిలదీస్తూనే ఉంటా" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్ రావు పేర్కొన్నారు.

పాలేరు జేఎన్టీయూ కళాశాలకు రూ.108కోట్లు

- నిధులు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ(జేఎన్టీయూ)నికి అనుబంధంగా పాలేరులో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాలకు రూ.108 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కళాశాల భవన నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులను వినియోగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

రేపటి నుంచి డీఈఈ సెట్ రెండో విడత కౌన్సెలింగ్

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఈ) సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 5 నుంచి ప్రారంభం కానుంది. వివరాలను సెట్ కన్వీనర్ మంగళవారం వెల్లడించారు. గురువారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ చేపడతామని చెప్పారు. ఈనెల 7 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు, 13న సీట్ల కేటాయింపు జరుగుతుందని కన్వీనర్ తెలిపారు.

టీజీపీఎస్సీలో డిప్యూటేషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) కార్యాలయంలో వివిధ హోదాల్లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ప్రభుత్వ శాఖల ఉద్యోగుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును అధికారులు పొడిగించారు. ఈనెల 5తో గడువు పూర్తవనుండగా, ఈనెల 15 వరకు పొడిగించినట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అసిస్టెంట్ ఇంజనీర్ల సెలక్షన్ జాబితా విడుదల

అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసింది. 50 మంది ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, 97 మంది మెకానికల్ ఇంజనీర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది.

అప్పు ఇచ్చిన పాపానికి వ్యాపారి హత్య

సర్జికల్ బ్లేడుతో మెడ కోసిన నిందితుడు.. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం

- నిందితుడిని ఇంటి పైగదిలో ఉంచిన వ్యాపారి
- అప్పు తీర్చేదాకా ఉండాలని షరతు
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు?


వ్యాపారి కాశీరావు, నిందితుడు శేఖర్ (ఫైల్ ఫోటో)

హయత్‌నగర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల్లో భాగంగా అప్పు ఇచ్చిన వ్యాపారి అప్పు తీసుకున్న వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నిందితుడు సర్జికల్ బ్లేడుతో వ్యాపారి మెడ కోసి హత్య చేశాడు. అనంతరం రక్తం బట్టలతోనే హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడని సమాచారం. ప్రకాశం జిల్లా దొనకొండ గ్రామానికి చెందిన ఎక్కలి కాశీరావు(37) ఇరవై ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి భాగ్యలత అరుణోదయనగర్ కాలనీ రోడ్డు నంబర్-3లో ఉంటున్నాడు. కాశీరావు సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మడం కొనడం, చీటీలు, రియల్ ఎస్టేట్, డైలీ ఫైనాన్స్, సాఫ్ట్ వేర్ కంపెనీలకు అద్దెకు కార్లు ఇవ్వడం వంటి వ్యాపారాలు చేస్తున్నాడు. తన వద్ద ఫైనాన్స్ తీసుకునే వారి ద్వారా నల్లగొండ జిల్లా గట్టుప్పల్‌కు చెందిన శేఖర్‌గౌడ్ (24) కాశీరావుకు పరిచయం అయ్యాడు. స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పని చేసి మానేసిన శేఖర్‌గౌడ్ ప్రస్తుతం సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేస్తున్నాడు.

అప్పుపై ప్రశ్నించినందుకు హత్య

విలాసాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడిన శేఖర్‌గౌడ్ రెండేళ్లక్రితం కాశీరావు వద్ద ఒకసారి రూ. 1.50లక్షలు, మరోసారి రూ. 3.60లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతుండటంతో శేఖర్‌ను పరిచయం చేసిన వ్యక్తుల ద్వారా గట్టుప్పల్ వెళ్లి పట్టుకున్నాడు. తన అప్పు తీర్చేంత వరకు తనతో పాటే ఉండాలంటూ.. శేఖర్‌ను తన ఇంటిపైన పోర్షన్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు యువకులు శంకర్, సాయితో జత చేశాడు. ఈ క్రమంలో కొంతకాలంగా కాశీరావు తన వ్యాపారాల నిమిత్తం తనతోపాటు శేఖర్‌గౌడ్‌ను తీసుకెళ్లేవాడు. అందుకు ప్రతిఫలంగా కొంతడబ్బులు ఇచ్చేవాడు. ఇలా ఉండగా.. మంగళవారం ఉదయం పైగదిలో ఉండే శంకర్, సాయిలు డ్యూటీకి వెళ్లిన సమయంలో.. కాశీరావుపై పోర్షన్‌కు వెళ్లాడు. అక్కడ గదిలో ఒంటరిగా ఉన్న శేఖర్‌గౌడ్‌తో అప్పు తీసుకున్న డబ్బుల విషయంపై అడిగినప్పుడు ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన శేఖర్‌గౌడ్ సర్జికల్ బ్లేడుతో కాశీరావు మెడను కోశాడు. తీవ్రగాయాలపాలైన కాశీరావు కుప్పకూలి మృతిచెందాడు. అనంతరం శేఖర్‌గౌడ్ రక్తపు మరకలతో కిందకు వెళ్తుండగా.. కింది అంతస్తులో దుస్తులు ఆరేస్తూ కాశీరావు భార్య సుమలత ఎదురుపడింది. 'నీ భర్తను చంపేశాను వెళ్లి చూసుకోపో' అంటూ సుమలతను హెచ్చరించి వెళ్లిపోయాడు. సుమలత గదిలోనికి వెళ్లి చూడగా భర్త కాశీరావు రక్తం మడుగులో కుప్పకూలిపోయి కనిపించాడు. కాశీరావును హత్య చేసిన శేఖర్‌గౌడ్ రక్తపు దుస్తులతోనే నేరుగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు లొంగిపోయినట్లు తెలుస్తోంది. కాశీరావు భార్య సుమలత పోలీసులకు ఫోన్ చేయడంతో వెంటనే వనస్థలిపురం పోలీసులు క్లూస్ టీంలను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నా లొంగిపోయాడని సమాచారం.

కొందరు కారులో వచ్చారంటోన్న స్థానికులు

హత్య జరగడానికి ముందు కాశీరావు ఇంటికి గుర్తు తెలియనివ్యక్తులు కారులో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. అయితే శేఖర్‌గౌడ్ ఒక్కడే కాశీరావును హత్య చేశాడా..? ఎవరైనా సహకరించారా?అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాశీరావు భార్య ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7న ఆటోల బంద్ వద్దు

- రాష్ట్ర ప్రభుత్వం మీ వెంటే
- కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం భరోసా
- సర్కారుతో చర్చల తర్వాతే నిర్ణయం : యూనియన్ నేతలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఆటో కార్మికులు ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న ఆటోల బంద్‌ను విరమించుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే, ఆరో తేదీన ప్రభుత్వంతో సమావేశం తర్వాతే బంద్ విరమణపై నిర్ణయం తీసుకుంటామని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీడీఎస్ సంఘాల నాయకులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం వల్ల ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని కార్మిక సంఘాలు మంత్రికి ఇచ్చిన లేఖలో పేర్కొన్నాయి. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15వేలు చొప్పున ఇవ్వాలని, జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలను అనుమతి ఇవ్వాలని, మీటర్ చార్జీలు పెంచాలని కోరారు. మరోపక్క, ఆటో, ట్యాక్సీ, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆటో, ప్రైవేట్ కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ(జేఏసీ) మంత్రి పొన్నంకు మంగళవారం వినతిపత్రం ఇచ్చింది. ఇక, ప్రభుత్వం ఆటో, రవాణా కార్మిక సంఘాలతో చర్చ లు జరపనిపక్షంలో ఆందోళనకు పిలుపునిస్తామని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ ప్రకటించింది.

మంత్రి పొన్నంతో మధుయాష్కీ భేటీ

ఆటో, లారీ, ట్యాక్సీ యజమానులు, రవాణా కార్మికుల సమస్యల పరిష్కారంపై టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్.. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ రవాణా కార్మిక సంఘాలు తనకు ఇచ్చిన వినతిపత్రాలను మధుయాష్కీ మంత్రికి అందజేశారు. త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ఆయనకు హామీ ఇచ్చారు.


రైలు బోగీల్లో కర్పూర హారతులు వద్దు.!

- అయ్యప్పలకు దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి
- ఉల్లంఘనలపై చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో పూజలు నిర్వహించవద్దని దక్షిణ మధ్య రైల్వే శబరిమల భక్తులకు కీలక సూచనలు చేసింది. కోచ్‌లలో కర్పూరం వెలిగించడం హారతి ఇవ్వడం లాంటివి చేస్తే రైల్వేయాక్ట్‌లోని 67, 154, 164, 165 సెక్షన్ల ప్రకారం నేరంగా పరిగణించి మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించింది. శబరిమలకు వెళుతున్న యాత్రికులు రైలు బోగీల లోపల చేస్తున్న పూజల్లో భాగంగా కర్పూరం వెలిగించి హారతులు ఇవ్వడం, అగరబత్తీలు, సాంబ్రాణి పుల్లలు వెలిగిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. రైళ్లలోకి, రైల్వే ప్రాంగణాల్లోకి మండే స్వభావం ఉన్న పదార్థాలను తీసుకెళ్లడం, వాటిని వెలిగించడం నిషేధమని స్పష్టం చేశారు. ఈ తరహా చర్యలు అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, ప్రాణహానితో పాటు రైల్వే ఆస్తులకు తీరని నష్టం కలిగించే ప్రమాదముందని పేర్కొన్నారు. ఉల్లంఘనలకు పాల్పడితే భారీ జరిమానాతోపాటు మూడేళ్ల వరకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ఇటువంటి పద్ధతులను నివారించే నిమిత్తం దక్షిణ మధ్య రైల్వే పోలీసులు, కమర్షియల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో శబరిమల యాత్రికుల సౌకర్యార్థం సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడ, తిరుపతి, నాందేడ్ తదితర స్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉద్యమకారులు, యువత బలిదానాలతోనే తెలంగాణ వచ్చింది

- కేసీఆర్ తానే సాధించానని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం
- మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్


శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

బర్కత్‌పుర, పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులు యువత బలిదానాలతోనే తెలంగాణ ఏర్పాటు అయిందని, కేసీఆర్ తానే సాధించానని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ జనసమితి అనుబంధ యువజన, విద్యార్థి జనసమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ యూత్ డే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆర్థిక రంగాలను కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ధనిక రాష్ట్రాన్ని అప్పులు పాల్జేశారని ఆరోపించారు. అమరులు త్యాగాలను కేసీఆర్ గౌరవించలేదని, నియంతగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీకాంతాచారి ఆశయాలను ప్రజాప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ప్రధాని మోదీ మాట్లాడితే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించకపోవడం ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టడమేనని ఆరోపించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణపై మోదీ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన వ్యక్తి శ్రీకాంతాచారి అని కొనియాడారు. ఆయన వర్ధంతిని యూత్ డే గా ప్రకటించాలనేది న్యాయమైన డిమాండ్ అని ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను కేంద్ర ప్రభుత్వం నిషేధిస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ యువత త్యాగాలతోనే సాధ్యమైందని, వారి ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చడమే మన ముందున్న బాధ్యత అన్నారు. ఈ సదస్సు టీజేఎస్ యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా అధ్యక్షత వహించగా నాయకులు రవి, వీరన్న, రవినాయక్, ప్రశాంత్, శేఖర్‌యాదవ్, నరేందర్, మహ్మద్ వాసీమ్, డప్పు గోపి, పాల్గొన్నారు.

ఉద్యమకారులను కేసీఆర్ వంచించారు

తెలంగాణ ఉద్యమకారులను, ప్రజలను కేసీఆర్ వంచించారని, రాజకీయాల కోసమే తెలంగాణ సెంటిమెంట్ వాడుకున్నారని జేఏసీ నేతలు ఆరోపించారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. తెలంగాణ కోసం సావునోట్లో తలకాయ పెట్టానని కేసీఆర్ చెప్తారని, అయితే అంతా డ్రామానేనని గజ్జెల కాంతం అన్నారు.

ఉపాధ్యాయుడికి చెప్పులతో దేహశుద్ధి

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం
- మంచిర్యాలలో ఘటన.. టీచర్‌పై వేటు

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిని తల్లిదండ్రులు చెప్పులతో కొట్టారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంచిర్యాలలోని బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు తాడోజు సత్యనారాయణ కొంతకాలంగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో సోమవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి హెచ్ఎంతో మాట్లాడారు. హెచ్ఎం విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో ఆదేశాలతో ఎంఈవో మంగళవారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆరోపణలు నిజమేనని తేలడంతో సత్యనారాయణను డీఈవో సస్పెండ్ చేశారు. అయితే విచారణ జరుగుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు బడికి వచ్చారు. వారిని చూసిన సత్యనారాయణ పాఠశాల గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆయనను వెంబడించి పట్టుకున్న తల్లిదండ్రులు.. ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెప్పులతో కొట్టారు.

స్నానం చేయించేందుకూ యంత్రం

» జపాన్‌కు చెందిన షవర్ హెడ్ సంస్థ ఆవిష్కరణ



న్యూఢిల్లీ, డిసెంబరు 3 : తువ్వాలు తీసుకుని స్నానాల గదిలోకి వెళ్లి.. బకెట్‌లో నీళ్లు పట్టుకుని.. శరీరం మీద నీళ్లు పోసుకుని, సబ్బు రుద్దుకుంటూ.. వీపు అందక అవస్థలు పడుతూ.. స్నానం చెయ్యడానికి ప్రతి రోజూ చిరాకు పడుతున్నారా? దుస్తులను ఉతికి ఆరేసే యంత్రాలు, పాత్రలు, పళ్లాలను కడిగి ఆరేసే యంత్రాల మాదిరిగా మనుషులకు స్నానం చేయించే యంత్రాలు కూడా ఉంటే బాగుండు అనుకున్నారా? అయితే ఇది మీకోసమే.. జపాన్‌కు చెందిన షవర్ హెడ్ తయారీ సంస్థ సైన్స్ కో.. మార్కెట్‌లోకి 'హ్యూమన్ వాషింగ్ మెషీన్'ను తీసుకొస్తుంది. ఓ ప్రత్యేక గదిలా ఉండే ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ మధ్యలో ఉండే కుర్చీలో ఓ 15 నిమిషాలు కూర్చుంటే చాలు. ఆ యంత్రం స్నానం చేయించడమే కాదు శరీరాన్ని ఆరబెట్టి పంపించేస్తుంది. కృతిమ మేధ(ఏఐ)తో పని చేసే ఇందులోని సాంకేతికత.. లోపల ఉన్న మనిషి శరీర ఉష్ణోగ్రతలు, ఇతర ప్రమాణాలను లెక్కించి తగిన ఉష్ణోగ్రతతో నీటిని విడుదల చేసి శుభ్రంగా స్నానం చేయించి ఆపై శరీరం ఆరేలా చేస్తుంది. వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న ఒసాకా కాన్సయి ఎక్స్‌పోలో సైన్స్‌కో సంస్థ ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ప్రదర్శించనున్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామక వ్యాజ్యంపై విచారణ నుంచి తప్పుకొన్న సీజేఐ

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ నుంచి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా మంగళవారం తప్పుకొన్నారు. గతంలో ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య సంఘం ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసింది. గత ఏడాది చట్టాన్ని సవరిస్తూ ఆ సంఘం నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని నియమించారు. దీనిని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌ల ధర్మాసనం.. సమాధానం చెప్పాలని ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులు పంపింది. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. ఈ సందర్భంగానే విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు సీజేఐ జస్టిస్ ఖన్నా ప్రకటించారు.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్



న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి కేంద్రప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అర్జున్ మేఘ్వాల్ వెల్లడించారు. సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్‌ను నియమించాలంటూ కొలీజియం నవంబరు 28న కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 కాగా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లి పదవీ విరమణతో జడ్జిల సంఖ్య 32కు పడిపోయింది, జస్టిస్ మన్మోహన్ ప్రమాణ స్వీకారం చేస్తే 33కు పెరుగుతుంది. కాగా, జస్టిస్ మన్మోహన్ 2008 మార్చి 13న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2023 నవంబరు 9న సీజేగా పదోన్నతి పొందారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు అంతర్గత కమిటీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: పని స్థలాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా నిరోధించేందుకు ప్రతి విభాగంలోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీల(ఐసీసీ)ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నెలాఖరు నాటికి జిల్లా స్థాయి ఐసీసీలు ఏర్పాటు చేయాలని సూచించింది. అవి జనవరి 31 నాటికి స్థానిక స్థాయి కమిటీల ఏర్పాటు, తాలూకా స్థాయి నోడల్ అధికారుల నియామకాలను పూర్తి చేయాల్సి ఉందని తెలిపింది. ప్రయివేటు సంస్థల్లో ఈ చట్టం అమలు తీరుపై తనిఖీలు చేస్తుండాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వైద్య విద్యార్థుల మృతి

అలప్పుజ డిసెంబరు 3: కేరళలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ కారు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో కారులోని అయిదుగురు వైద్య విద్యార్థులు దుర్మరణం పాలవ్వగా మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులోని కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కాలర్‌కోడ్ సమీపం సోమవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఏడుగురు విద్యార్థులు కారులో సినిమాకు వెళ్తుండగా మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన క్రమంలో ప్రమాదం జరిగింది. విద్యార్థులు వందనమ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్నారు.

హౌతీల దాడి వేళ అసాధారణ సాహసం.. ఐఎన్ఎస్ విశాఖపట్నం సిబ్బందికి అవార్డు

» లండన్‌లో అందుకున్న కెప్టెన్ అవిలాశ్ రావత్



లండన్, డిసెంబరు 3: భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ విశాఖపట్నం సిబ్బందికి అరుదైన గౌరవం దక్కింది. ఈ నౌక కెప్టెన్ అవిలాష్ రావత్, ఆయన సిబ్బందిని.. సముద్రంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికిచ్చే ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో) అవార్డు వరించింది. ఎర్ర సముద్రంలో బ్రిటన్ వాణిజ్య నౌకపై హౌతీలు క్షిపణి దాడి చేసిన సమయంలో ఐఎస్ఎస్ విశాఖపట్నం సిబ్బంది చూపించిన అసాధారణ ధైర్య సాహసాలకు గానూ ఈ అవార్డు దక్కింది. లండన్‌లోని ఐఎంవో ప్రధాన కార్యలయంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కెప్టెన్ అవిలాష్ రావత్ తన సిబ్బంది తరపున ఈ అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో బ్రిటన్ నౌకపై హౌతీలు క్షిపణి దాడి చేశారు. ఆ నౌక కెప్టెన్ నుంచి అత్యవసర సందేశం రావడంతో ఐఎన్ఎస్ విశాఖపట్నం వెంటనే స్పందించింది. కెప్టెన్ అవిలాష్ రావత్, ఆయన సిబ్బంది ఐదు గంటలపాటు శ్రమించి మార్లిన్ లువాండాలో మంటలను అదుపు చేసి, అందులోని సిబ్బందిని కాపాడారు.

సంభల్ హింస వెనక కుట్ర!

యూపీలో ఉప ఎన్నికల నేపథ్యంలో వివాదం

» మతసామరస్యాన్ని దెబ్బతీస్తోన్న బీజేపీ

» లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శ

» అదానీ అంశంపై పార్లమెంటు ప్రాంగణంలో విపక్ష ఎంపీల నిరసన



న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, బీజేపీ జపిస్తున్న 'తప్పకాల మంత్రం' దేశంలో మతసామరస్యాన్ని దారుణంగా దెబ్బతీస్తోందని సమాజ్‌వాదీపార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. యూపీలో ఇటీవలి ఉప ఎన్నికల నేపథ్యంలోనే.. సంభల్‌లో మసీదు వివాదాన్ని ముందుకు తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. 'నవంబరు 13వ తేదీన జరగాల్సిన యూపీ ఉప ఎన్నికలను నవంబరు 20వ తేదీకి వాయిదా వేశారు. షాహీ జామామసీదులో సర్వే జరపాలంటూ దాఖలైన పిటిషన్ మీద.. మసీదు కమిటీ వాదనలు సైతం వినకుండా సర్వేకు అనుకూలంగా నవంబరు 19న స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని గంటల్లోనే అధికారులు అక్కడికి చేరుకొని సర్వే జరిపారు. మసీదులోని వారందరూ సహకరించారు. 29న కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ, 24న అధికారులు మరోసారి సర్వే జరుపుతామంటూ మసీదుకు వచ్చారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఎలా జరుపుతారంటూ.. ముస్లిం సంఘాలు అభ్యంతరం తెలిపాయి. అయినప్పటికీ, అధికారులు నిరంకుశంగా సర్వే జరిపారు. ఈ సందర్భంగా ఓ పోలీసు అధికారి స్థానికులను దుర్భాషలాడుతూ లాఠీచార్జికి ఆదేశించారు. కోపోద్రిక్తులైన యువకులు కొందరు రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు కాల్పులు జరిపి ఐదుగురిని చంపివేశారు' అని అఖిలేశ్ తెలిపారు. అమాయకులను పొట్టనపెట్టుకున్న పోలీసులను ఉద్యోగాల్లోంచి తొలగించి, వారిపై హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో యూపీ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని, ముస్లింలను పలు ప్రాంతాల్లో ఓటు వేయకుండా అడ్డుకున్నారని.. ఇదంతా బయటకు రావొద్దనే ఉద్దేశంతోనే సంభల్‌లో హింసను రెచ్చగొట్టారని ఆరోపించారు. అంతకుముందు, సంభల్ అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కొద్దిసేపు వాకౌట్ చేశారు. కాగా మంగళవారం సైతం ఆదానీ అంశంపై విపక్షాలు పట్టుబట్టాయి. ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా చెప్పగానే ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అదానీ అంశంపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో నిరసన వ్యక్తంచేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఇండియా కూటమి పార్టీలైన ఎస్పీ, టీఎంసీ పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

ఇందిరాగాంధీ ప్రస్తావనతో గందరగోళం

బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లుపై లోక్‌సభలో చర్చ జరుగుతున్న సమయంలో.. ఇందిరాగాంధీ హయాంలో తనకు నచ్చినవారికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని మేనేజర్లను ఆదేశించారని ఎంపీ సంబిత్ పాత్ర ఆరోపించారు. ఇలాంటి చర్యల కారణంగానే దేశంలో నిరర్థక ఆస్తులు, తిరిగి చెల్లించని రుణాలు పెరిగాయన్నారు. మోదీ హయాంలో తెచ్చిన చట్టాలతో బ్యాంకింగ్ వ్యవస్థ మళ్లీ గాడిలో పడిందన్నారు. దీనిపై విపక్షాలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపాయి. సంబిత్ పాత్ర హద్దులు దాటి మాట్లాడుతున్నారని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, పాకిస్థాన్‌పై యుద్ధం చేసి గెలుపొందారని చెప్పారు. స్పీకర్ జోక్యంతో సభ శాంతించింది.

ఇలాగైతే వారాంతాల్లోనూ సభ: ఓం బిర్లా

ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. వాయిదాల కారణంగా సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగితే, ఆ సమయాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందని సభ్యులను హెచ్చరించారు. సభ కార్యకలాపాలను వాయిదా వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.



రాజ్యసభలో కొత్త ఏవియేషన్ బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: పౌర విమానయాన సంస్థకు సంబంధించిన కొత్త ఏవియేషన్ బిల్లును ఆ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. 90 ఏళ్లనాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్-2024 బిల్లును కేంద్రం తీసుకువచ్చింది. ఈ ఏడాది ఆగస్టులోనే ఇది లోక్‌సభ ఆమోదం పొందింది. తాజాగా ఈ బిల్లును రాజ్యసభలోనూ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ(ఐసీఏవో) సూచనల మేరకు ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని సవరించామన్నారు. డీజీసీఏకు వివిధ సెక్షన్ల కింద మరిన్ని అధికారాలను దఖలు పరుస్తూ ఈ బిల్లును రూపొందించామన్నారు. మరోవైపు, పీఎం సూర్య ఘర్ పథకానికి ఇప్పటి వరకు 26.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని కేంద్రం తెలిపింది. ఇందులో 6.34 లక్షల ఇళ్లకు సౌర ఫలకాలు ఇన్‌స్టాలేషన్ పూర్తయిందని వివరించింది. ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసి ఉచిత సౌర విద్యుత్‌ను అందించేందుకు కేంద్రప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించింది.

హిందీ నేర్చుకుంటానంటే ఎగతాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: విద్యార్థి దశలో తాను హిందీ నేర్చుకుంటానంటే ఎగతాళి చేసేవారిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. తన చిన్నతనంలో తమిళనాడులో నెలకొన్న పరిస్థితులను మంగళవారం ఆమె లోక్‌సభలో గుర్తుకు తెచ్చుకున్నారు. బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు హిందీ వినియోగంపై ఆమెను ఇరుకున పెట్టే ప్రశ్నలు వేశారు. దీనిపై ఆమె సమాధానం ఇస్తూ.. 'తమిళనాడులో ఉంటూ ఉత్తరాది భాష నేర్చుకుంటుందట అంటూ వీధుల్లోనే నన్ను ఎగతాళి చేసేవారు. హిందీ, సంస్కృతాలను విదేశీ భాషలుగా భావించేవారు. నన్నయితే 'వంధేరి' (పరదేశి) అనేవారు. హిందీని బలవంతంగా రుద్దవద్దని అంటున్నారు..సరే! మరి, హిందీ నేర్చుకోవాలన్న నా ప్రాథమిక హక్కును ఎలా అణచివేస్తారు" అని విపక్ష సభ్యులను ప్రశ్నించారు.

ఇకపై నలుగురు నామినీలు!

» బ్యాంకు ఖాతాదారులకు వెసులుబాటు

» బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఐదు చట్టాల్లో సవరణలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటికేడు బ్యాంకింగ్ రంగం పరిణామం చెందుతున్న క్రమంలో బ్యాంకుల పాలనా వ్యవహారాలను మెరుగుపర్చడం, పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం 'బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2024'ను తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజా సవరణలతో బ్యాంకింగ్ రంగంలో పాలనా వ్యవహారాలు పటిష్ఠమవడంతో పాటు ఖాతాదారుల సౌలభ్యం పెరుగుతుందని, పెట్టుబడిదారులకు రక్షణ కల్పించినట్లువుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. మంగళవారం ఆమె 'బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2024'ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఐదు బ్యాంకింగ్ చట్టాల్లో మొత్తం 19 సవరణలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ బిల్లును లోక్‌సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. అయితే, భారత బ్యాంకింగ్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకే ఈ బిల్లును తెస్తున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వాటాను 51 నుంచి 26 శాతానికి తగ్గించాలన్నదే కేంద్రం ఉద్దేశమని ఆరోపించారు.

బ్యాంకింగ్ బిల్లులో కీలక ప్రతిపాదనలివే..

బ్యాంకు ఖాతాదారులు ప్రస్తుతం ఒక నామినీని మాత్రమే ఎంచుకునే వీలుండగా.. ఇకపై నలుగురిని నామినీలుగా ఎంచుకోవచ్చు.

క్లెయిమ్ చేసుకోని డివిడెండ్లు, షేర్లు, బాండ్ల ఉపసంహరణ నిధులను 'ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)'లోకి బదిలీ చేసుకోవచ్చు. ఈ ఫండ్ నుంచి వినియోగదారులు సొమ్ములను బదిలీ/రిఫండ్ చేసుకోవచ్చు. మదుపరుల ప్రయోజనాలను రక్షించేందుకే ఈ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బ్యాంకుల్లో డైరెక్టర్ పదవిని ఆశించే వారి కనీస వాటా ప్రస్తుత చట్టాల ప్రకారం బ్యాంకుల ఈక్విటీలో రూ.5 లక్షలుగా ఉండగా.. ఆ పరిమితిని రూ.2 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఈ మొత్తాన్ని 60 ఏళ్ల కిందట నిర్ధారించినందున తాజాగా పెంచాలని నిర్ణయించారు.

సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని 8 నుంచి పదేళ్లకు పెంచారు.

ఆడిటర్లకు ఇవ్వాల్సిన పారితోషికాన్ని నిర్ణయించడంలో బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.

అలకవీడిన శిండే..

» హోం శాఖను వదులుకునేందుకు సిద్ధం

» నేడు బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక



ముంబై, డిసెంబరు3: మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే అలకవీడారు. థానే ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని ముంబై చేరుకున్న శిందేను ఆయన అధికారిక నివాసంలో బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ కలిశారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై చర్చించారు. హోం మంత్రిత్వ శాఖపై శిందే పట్టు వీడారు. డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసేందుకు అంగీకరించారు. పట్టణాభివృద్ధి శాఖతో పాటు ఇతర కీలక శాఖలు, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవి కూడా ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిసింది. బీజేపీకి 22, శివసేనకు 12, ఎన్సీపీకి 10 మంత్రి పదవులు దక్కనున్నాయి. కీలకమైన ఆర్థిక శాఖతో పాటు డిప్యూటీ స్పీకర్ తమకే ఇవ్వాలన్న ఎన్సీపీ డిమాండ్‌ను బీజేపీ అంగీకరించినట్లు సమాచారం. శివసేనతో సమానంగా మంత్రిపదవులు ఇవ్వాలన్న ఎన్సీపీ డిమాండ్‌ను మాత్రం బీజేపీ తోసిపుచ్చింది. ఈ రోజు ఉదయం 10గంటలకు ముంబైలోని విధానసభ సెంట్రల్ హాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. శాసనసభాపక్ష నేతగా ఫడణవీస్‌ను ఎన్నుకుంటారని, ఆయనే సీఎంగా ప్రమాణం చేస్తారని సమాచారం. రేపు సాయంత్రం 5 గంటలకు ముంబై ఆజాద్ మైదానంలో కొత్త సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంల ప్రమాణం ఉంటుంది.

రైతులకిచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదు?

» కేంద్ర ప్రభుత్వానికి ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రశ్న.. మంత్రి శివరాజ్ మౌనం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మంగళవారం రైతుల పక్షాన గళం విప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు ప్రశ్నలు సంధించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని అడిగారు. విధానాల రూపకల్పన సరైన మార్గంలో ఉన్నట్టు అనిపించడం లేదని వ్యాఖ్యానించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్‌ను ఉద్దేశించి ఈ ప్రశ్నలు వేయడం గమనార్హం. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)- కేంద్ర పత్తి సాంకేతిక పరిజ్ఞాన పరిశోధన సంస్థ (సీఐఆర్‌సీఓటీ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ "వ్యవసాయ మంత్రిగారూ.. దయచేసి చెప్పండి.. రైతులకు మీరు ఏమి వాగ్దానాలు చేశారు? వాటిని ఎందుకు నెరవేర్చలేదు? గత ఏడాది ఉద్యమం జరిగింది...మళ్లీ ఇప్పుడు జరుగుతోంది. చక్రం తిరుగుతునే ఉంది. మనం మాత్రం ఏమీ చేయడం లేదు" అని అన్నారు. ఇందుకు వేదికపై ఉన్న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎలాంటి సమాధానం ఇవ్వలేదు.

స్వర్ణ దేవాలయానికి కాపలాదారుగా సుఖ్‌బీర్

» మెడలో పలక, చేతిలో ఈటెతో శిక్షను అనుభవించిన మాజీ డిప్యూటీ సీఎం



న్యూఢిల్లీ, డిసెంబరు 3: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ నాయకుడు, 62 ఏళ్ల సుఖ్‌బీర్ సింగ్ బాదల్.. సిక్కుల అత్యున్నత విచారణ సంఘం.. 'అకాల్ తఖ్త్' తీర్పును శిరసావహించారు. సుఖ్‌బీర్ అధికారంలో ఉన్న సమయంలో చేసిన తప్పులపై విచారణ జరిపిన అకాల్ తఖ్త్ ఆయనను దోషిగా నిర్ధారించింది. ఆయా తప్పులను సుఖ్‌బీర్ కూడా అంగీకరించారు. ఈ నేపథ్యంలో అకాల్ తఖ్త్ సుఖ్‌బీర్‌కు, మాజీ మంత్రులకు పలు శిక్షలు విధించింది. ఈ క్రమంలో సుఖ్‌బీర్ సహా వారంతా మంగళవారం ఉదయం స్వర్ణ దేవాలయానికి చేరుకుని శిక్షలు అనుభవించారు. 62 ఏళ్ల సుఖ్‌బీర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుడికాలికి దెబ్బ తగలడంతో వైద్యులు పెద్ద కట్టు వేశారు. దీంతో వీల్ ఛైర్‌కే ఆయన పరిమితమయ్యారు. అయినప్పటికీ.. మంగళవారం ఉదయం వీల్ ఛైర్‌లోనే స్వర్ణదేవాలయానికి చేరుకుని.. మెడలో పలక వేసుకుని(చేసిన తప్పులు పేర్కొంటూ), చేతిలో ఈటె పట్టుకుని దేవాలయం ప్రధాన ద్వారం ముందు కాపలాదారుగా కూర్చున్నారు. మరో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బిక్రమ్ సింగ్ మజితియా సహా పలువురు మాజీ మంత్రులు స్వర్ణ దేవాలయంలో అంట్లు తోమారు. మరికొందరు మరుగు దొడ్లను శుభ్రపరిచారు. అనంతరం అక్కడే స్నానాలు చేసి మధ్యాహ్నం గురుద్వారాకు వచ్చిన భక్తులకు ఆహారం వడ్డించి, వారు తిన్న ప్లేట్లను శుభ్రపరిచారు.

ఎందుకీ శిక్షలు?

2007-2017 మధ్య తాము అధికారంలో ఉన్నప్పుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్.. 2015లో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గుర్మీత్ సిక్కుల గురువుగా వస్త్రధారణ చేసి కీలకమైన ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది పెను వివాదానికి, ఘర్షణలకు కూడా దారి తీసింది. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకున్న సుఖ్‌బీర్ మంత్రివర్గం గుర్మీత్‌ను క్షమించి వదిలివేసింది. దీనిపై విచారణ జరిపిన అకాల్ తఖ్త్ ముందు సుఖ్‌బీర్ సహా అప్పటి మంత్రులు తమ తప్పులను అంగీకరించారు. అంతేకాదు, సుఖ్‌బీర్ తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌కు 2011లో ఇచ్చిన ఫకర్-ఏ-ఖ్వామ్(సిక్కులకు గర్వకారణం) అనే బిరుదును అకాల్ తఖ్త్ ఉపసంహరించుకుంది.

రాష్ట్రాల కోరికలన్నీ తీర్చలేం

నాలుగేళ్లుగా అవే వాదనలను వింటున్నాం.. ఇది అంతులేని కథగా మారుతోంది

» జాతీయ ప్రయోజనాల రీత్యా.. ముందుకు రాకుంటే ప్రాజెక్టును పక్కనపెడతాం

» ఇంట్రా-లింక్‌లతో ముందుకొస్తే అనుమతులు

» గోదావరి-కావేరీ నదుల అనుసంధానంపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ

» పోలవరం నుంచి అనుసంధానం చేపట్టాలి: ఏపీ

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రయోజనాలను ప్రామాణికంగా చేసుకొని గోదావరి-కావేరీ నదుల అనుసంధానానికి రాష్ట్రాలు ముందుకు రావాలని, ఈ క్రమంలో రాష్ట్రాల కోరికలన్నీ తీర్చలేమని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ స్పష్టంచేశారు. మంగళవారం నదుల అనుసంధానంపై న్యూఢిల్లీలో జరిగిన జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్(సీఈ) ఓరుగంటి మోహన్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్.. ఆంధ్రప్రదేశ్ నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ-హైడ్రాలజీ) రత్నకుమార్, పలు రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేబశ్రీ ముఖర్జీ మాట్లాడుతూ.. గోదావరి-కావేరీ అనుసంధానంతో 148 టీఎంసీల జలాలను మాత్రమే తరలిస్తామని.. రాష్ట్రాలు కోరుకుంటున్నట్లు నీళ్లిస్తే.. జలాలు మిగలవని పేర్కొన్నారు. "గోదావరి-కావేరీలో ఇచ్చిన వాటాతో సంతృప్తి చెంది, ముందుకు వచ్చి, ప్రాజెక్టుకు సమ్మతి తెలపండి. నాలుగేళ్లుగా అవే వాదనలను వింటున్నాం. ఈ ప్రాజెక్టు వ్యవహారం అంతులేని కథలాగా మారింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాజెక్టులో ముందుకు పోలేం. రాష్ట్రాలు ముందుకు రాకపోతే ప్రాజెక్టును పక్కనపెట్టాల్సి ఉంటుంది. అయితే.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాలతో ఈ నెలాఖరులోపు ప్రత్యక్ష విధానంలో సమావేశం ఏర్పాటు చేసి, ఏకాభిప్రాయం సాధించాలని ఎన్‌డబ్ల్యూడీఏను ఆదేశించారు. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ సమావేశంలో, అన్ని రాష్ట్రాల కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇక రాష్ట్రాల భూభాగంలో లోపల ఏమైనా లింకులుంటే.. ఎన్‌డబ్ల్యూడీఏ నుంచి సహకారం అందిస్తామని, కేంద్ర జలశక్తి అనుమతులు ఇప్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ గోదావరి-కావేరీలో కేవలం తాగునీటికే కేటాయింపులు చేశారని, రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాలున్నాయని, సాగునీటిని కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా చేపట్టిన బెడ్తి-వార్దా లింక్‌ను బయటకి తేవాలని, రాష్ట్రం లోపల చేపట్టే ప్రాజెక్టుగానే దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రం గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టు పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశామని, రాష్ట్రాల సమ్మతి తీసుకొని, సత్వరం ప్రాజెక్టును చేపట్టాలని కోరాయి.

పోలవరం నుంచి ప్రాజెక్టును చేపట్టాలి: ఏపీ

గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టును పోలవరం నుంచి చేపట్టాలని ఏపీ చీఫ్ ఇంజనీర్ రత్నాకర్ ఈ సందర్భంగా ఎన్‌డబ్ల్యూడీఏను కోరారు. ప్రస్తుత ప్రాజెక్టు డీపీఆర్ 14 ఏళ్ల క్రితం సిద్ధం చేసిందని, ఇప్పటి పరిస్థితుల దృష్ట్యా తమ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానంపై అధ్యయనం కూడా పూర్తయిందని, పోలవరం-కృష్ణా-పెన్నార్-కావేరీ లింక్ పేరిట దీన్నిచేపట్టాలని కోరింది. దీనిపై దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ.. పోలవరం నుంచి గోదావరి-కావేరీ లింక్‌ను చేపట్టే ప్రసక్తే లేదని, నదుల అనుసంధానం అనేది అన్ని రాష్ట్రాలను కలుపుకొని ముందుకు సాగే ప్రాజెక్టు అని, రెండు రాష్ట్రాల మధ్య(తమిళనాడు-ఏపీ) దీన్ని చేపట్టలేమని, అవసరమైతే రాష్ట్రం లోపల ఇంట్రా(రెండు బేసిన్‌ల మధ్య) చేపడితే సహకారం అందిస్తామని స్పష్టంచేశారు.

గోదావరి-కావేరీలో 50% వాటా ఇవ్వాలి: తెలంగాణ

గోదావరి-కావేరీ అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్రాన్ని కోరారు. దీనిపై అక్టోబరులో లేఖ రాశామని ఆయన చెప్పగా.. తమకు చేరలేదని ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులు బదులిచ్చారు. దాంతో ఆ లేఖలోని అంశాలను వివరిస్తూ.. తమ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గోదావరి-కావేరీ అనుసంధానంలో వాటాగా వచ్చే నీటిని సమ్మక్క బ్యారేజీ పరిసరాల్లో కాకుండా లోయలు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా గొట్టిముక్కల ఎగువన రెండు రిజర్వాయర్‌లను నిర్మించాలని, అక్కడి నుంచి నీటిని వాడుకోవడానికి వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జలాల పంపిణీపై ట్రైబ్యునల్ విచారణ చేపడుతున్నందున, నీటి వాటాలు తేలిన తర్వాతే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌ను గోదావరి-కావేరీ లింక్‌లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు. 83 మీటర్ల ఎత్తుతో ఉన్న సమ్మక్క బ్యారేజీలో 83-87 మీటర్ల మధ్యలో నీటిని నిల్వ చేసి, ఆ మధ్యలో ఉన్న నీటిని మాత్రమే గోదావరి-కావేరీ అనుసంధానంలో తరలించాలని, 83 మీటర్ల కింద నిల్వ ఉన్న నీటిని ముట్టుకోరాదని, అక్కడ సీతమ్మ ప్రాజెక్టు కింద 70 టీఎంసీలు, సమ్మక్క కింద 50 టీఎంసీలు, దేవాదుల కింద 38 టీఎంసీలు కలుపుకొని, 158 టీఎంసీల అవసరం ఉంటుందని.. ఈ వినియోగానికి రక్షణ కల్పించాలని కోరారు.

'దామన్‌గంగా-వైతర్ణ-గోదావరి'కి సహకరించండి: మహారాష్ట్ర

కొత్తగా దామన్‌గంగా-వైతర్ణ-గోదావరి నదుల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని, దీన్ని గోదావరి-కావేరీ అనుసంధానంలో భాగం చేయాలని మహారాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి కేంద్రాన్ని కోరారు. దామన్‌గంగా-వైతర్ణలను తీసుకొచ్చి, గోదావరిలో కలపడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతి కోరుతూ డీపీఆర్‌ను సమర్పించామని, దీనికి అనుమతి ఇప్పించాలని కోరారు.

పౌరసరఫరాల శాఖకు 'స్కోచ్' అవార్డు

- ఏడాదిలో శాఖ పనితీరులో అద్భుతమైన పురోగతి
- కమిషనర్ చౌహాన్‌ను అభినందించిన మంత్రి ఉత్తమ్


డీఎస్ చౌహాన్‌కు స్కోచ్ అవార్డును అందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాలశాఖకు 2024 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన 'స్కోచ్' అవార్డు రావటం అభినందనీయమని ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వినూత్న ఆలోచనలతో వాతావరణ సమాచార పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పంట ఉత్పత్తులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నందుకుగాను ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. ఏడాదిలో పౌరసరఫరాలశాఖ పనితీరులో అద్భుతమైన పురోగతిని సాధించినట్లు తెలిపారు. మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో సమీక్ష నిర్వహించడానికి వచ్చిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేతులమీదుగా డీఎస్ చౌహాన్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్‌ను మంత్రి అభినందించారు. సమీక్ష అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడినప్పుడు పౌర సరఫరాల కార్పొరేషన్ అప్పు రూ.4,747 కోట్లు ఉంటే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 58,623 కోట్ల అప్పుల్లోకి తీసుకెళ్లిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రూ.11,608 కోట్ల అప్పు తీర్చిందని పేర్కొన్నారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అటవీ అనుమతులు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అటవీ అనుమతులు లభించినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం కేంద్ర అటవీ శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాష్ భీమ్ రావు భవర్ నుంచి అందినట్లు పేర్కొన్నారు. ఈ అనుమతులతో మెదక్ జిల్లాలో 35.5882 హెక్టార్లు, సిద్దిపేట జిల్లాలో 28.2544 హెక్టార్లు, భువనగిరి జిల్లాలో 8.511 హెక్టార్లు కలిపి మూడు జిల్లాల్లో 72.3536 హెక్టార్ల అటవీ భూమిని రీజినల్ రింగురోడ్డు నిర్మాణానికి వినియోగించడానికి అవకాశం దొరికింది. అటవీ అనుమతులకు లోబడి భూసేకరణ చేయనున్నారు. అటవీ అనుమతులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు మంత్రి కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విషప్రచారం చేసేవారికి బుద్ధి చెప్పాలి

- రేపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు యాప్ ప్రారంభం
- తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల మంజూరు: పొంగులేటి



కూసుమంచి/జూలూరుపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నమ్మి పదేళ్ల రాజ్యాన్ని అప్పగిస్తే ప్రజల సంపదంతా కొల్లగొట్టారని, అలాంటి వారు ఇప్పుడు ప్రజాప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో ప్రజాప్రభుత్వ ఏడాది విజయోత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతారంలో సభను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 27రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు 5వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి యాప్‌ను ప్రారంభించి ఈ పథకానికి శ్రీకారం చుడతారన్నారు. రాష్ట్రంలో తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రజాపాలనకు ఏడాది

- సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు: పీసీసీ చీఫ్, పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరించినందుకు రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయన ప్రజలకు, పార్టీ శ్రేణులకు, శాసనసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నియంత పాలనకు చరమ గీతం పాడిన ప్రజలు కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజారిటీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రుల సమష్టి నిర్ణయాలతో ఏడాదిలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణ వెలిగిపోతోందన్నారు. సంవత్సర కాలంగా ప్రజాప్రభుత్వ పరిపాలనకు సహకరించిన రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వం తరఫున కాంగ్రెస్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

సన్నధాన్యం మిల్లింగ్‌కు శ్రీకారం!

సన్నధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆ ధాన్యాన్ని ప్రత్యేకంగా మిల్లింగ్ చేయించటానికి శ్రీకారం చుట్టింది. 2024-25 వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం నుంచి తొలిసారిగా 70,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేయటానికి జిల్లాల వారిగా కోటా కేటాయింపులు చేసింది. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పీఎం-పోషణ్, ఇతర సంక్షేమ పథకాలకు సన్నబియ్యం పంపిణీ చేయటానికి 3 నెలల కోటాకు గాను 47,008 మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తికి ఉత్తర్వులు జారీ చేసింది. రైస్‌మిల్లర్లు సన్నధాన్యం తీసుకొని, మిల్లింగ్ చేసి 10% నూకలతో సన్నబియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. . పైగా ఈ బియ్యాన్ని ఫోర్టిఫైడ్(పోషకాలు జోడించి) రూపంలో ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేశారు.

పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా తగ్గుతూ వచ్చిన రిజిస్ట్రేషన్ల ఆదాయం నవంబరులో పెరిగింది. గత ఏడాది జరిగిన లావాదేవీలతో పోల్చి చూస్తే ఈ నవంబరులో డాక్యుమెంట్లతోపాటు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.32.96 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. 2023 నవంబరులో 1,05,235 డాక్యుమెంట్ల ద్వారా రూ.1127.79 కోట్ల ఆదాయం సమకూరగా, ఈ నవంబరులో 1,19,317 డాక్యుమెంట్ల ద్వారా రూ.1160.75 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే డాక్యుమెంట్ల సంఖ్య 13.38 శాతం పెరగ్గా, ఆదాయం 2.92 శాతం పెరిగింది.

ఫార్మా ఎగుమతులలో తెలంగాణ భేష్ :కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫార్మా ఎగుమతులలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని కేంద్ర రసాయన, ఎరువుల సహాయమంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 2023-24లో దేశవ్యాప్తంగా 1,15,798.55 కోట్ల ఎగుమతులు జరుగగా తెలంగాణ నుంచి రూ.29,148 కోట్ల ఎగుమతులు అయినట్లు తెలిపారు. తెలంగాణ తర్వాతి స్థానం ఏపీకే దక్కిందని చెప్పారు.

పాలేరు జేఎన్టీయూ కళాశాలకు రూ.108కోట్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయా(జేఎన్టీయూ)నికి అనుబంధంగా పాలేరులో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాలకు రూ.108కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులను వినియోగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి:ఏసీబీ

"లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి" నినాదంతో తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఏసీబీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 వరకు నిర్వహించే అవినీతి వ్యతిరేక వారోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఏసీబీ డీజీ విజయ్ కుమార్ ఏసీబీ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోస్టర్లలో ఏసీబీ టోల్ ఫ్రీ నెంబరు 1064, ఎక్కడికక్కడ జిల్లాల వారిగా ఏసీబీ అధికారుల ఫోన్ నెంబర్లు పొందుపర్చారు.

నిధులు తెస్తారా!?

గుజరాత్‌కు వలస పోతారా..

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి ప్రజల బాధలు అర్థమవుతాయని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తేలేదని మండిపడ్డారు. పైగా మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తప్పుబట్టారు. "గుజరాత్ మెట్రోకు, చెన్నై మెట్రోకు నిధులు ఇచ్చారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఎందుకు ఇవ్వరు!? మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా పునరావాసం కోసం రూ.25 వేల కోట్లు ఖర్చవుతుంది. ఇక్కడి పేదలకు పట్టా ఉన్నా లేకపోయినా అపార్టుమెంట్లు కట్టించి ఇస్తాం. ఇందుకు రూ.10 వేల కోట్లు ఖర్చవుతుంది. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద ఈ పది వేల కోట్ల రూపాయలు కిషన్ రెడ్డి తెప్పించగలరా!? హైదరాబాద్‌లో పై ఓవర్లు, రీజనల్ రింగ్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్లు, ఔటర్ నుంచి రేడియల్ రోడ్లకు లక్షన్నర కోట్ల వ్యయం అవుతుంది. ఇందుకు కేంద్రం నుంచి కిషన్ రెడ్డి ఎన్ని నిధులు ఇప్పించగలరు? నితిన్ గడ్కరీ దగ్గర మన ప్రతిపాదనలు పెండింగులో ఉన్నాయి. మీరు ఎన్ని నిధులు ఇప్పిస్తారు!?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కిషన్ రెడ్డికి, బీజేపీకి ఒక అవకాశం ఇస్తామని, ఆరు నెలలపాటు తమ అభివృద్ధి పనులను ఆపుతామని, ఈలోగా ఆయన ప్రధానిని తీసుకొచ్చి.. మూసీ ప్రాజెక్టును చూపించి పనులకు కావాల్సిన నిధులను ఇప్పించాలని సవాల్ చేశారు. ఫ్యూచర్ సిటీ కాకుండా ఒక్క హైదరాబాద్ నగరాభివృద్ధికే రాబోయే నాలుగేళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని, ఆ నిధులను మోదీ నుంచి తెస్తే పరేడ్ గ్రౌండ్‌లో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి మీకు సన్మానం చేస్తానని అన్నారు.


'హైదరాబాద్ రైజింగ్' సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రేవంత్, భట్టి

హైదరాబాద్ అభివృద్ధికి మంత్రివర్గ ఉప సంఘం

స్వచ్ఛమైన గాలి, నీటితో పరిశుభ్రమైన నగరంగా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల స్థాయిలో నిలబెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతోందని, మూసీ పునరుజ్జీవం, మురికి వాడల ప్రజలకు ఇళ్లు, వారికి ఉపాధి లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించామని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. దీని ముందుకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతోపాటు మేధావులు కూడా వచ్చి హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి పాలసీ డాక్యుమెంట్లు సమర్పించవచ్చని సూచించారు. నిర్మాణాత్మక సలహాలకు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ, ఇద్దరూ గూడుపుఠాణీగా అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

రియల్ ఆదాయం పెరిగింది

తెలంగాణ ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుంచే వస్తుందని, గత ఆరు నెలల్లో 29 శాతం రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఎంతమంది ఎంత విష ప్రచారం చేసినా.. రియల్ ఎస్టేట్ ఆదాయం పడిపోయిందని ప్రచారం చేసినా వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు.

అప్పులు.. తప్పులు

అప్పులు.. తప్పులు తప్ప గత ప్రభుత్వం చేసిందేమీ లేదని బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ మండిపడ్డారు. హైటెక్ సిటీకి నేదురుమల్లి శంకుస్థాపన చేస్తే చంద్రబాబు పూర్తి చేశారని, ఔటర్ రింగ్ రోడ్డు, విమానాశ్రయం వైఎస్ హయాంలో వచ్చాయని, బీఆర్ఎస్ హయాంలో ఏం తెచ్చారని నిలదీశారు. ట్యాంక్ బండ్ నీళ్లను కొబ్బరి నీళ్లలా, పాతబస్తీని ఇస్తాంబుల్ లాగా మారుస్తామని కేసీఆర్ అన్నారని, ఇస్తాంబుల్ కాదు కదా కనీసం వర్షం నీళ్లు సజావుగా పారేలా చేయలేకపోయారని మండిపడ్డారు. సలహాలు ఇస్తే పాటిస్తామని, అభివృద్ధిని అడ్డుకోవడం కాదని, స్వాగతించాలని అన్నారు. అడ్డుకోవాలని అనుకుంటే ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసునని వ్యాఖ్యానించారు.

50 వేల ఎకరాలతో అద్భుత నగరం

ఫ్యూచర్ సిటీని 40 నుంచి 50 వేల ఎకరాలతో ఏర్పాటు చేస్తామని, రీజనల్ రింగు రోడ్డు, ఔటర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్, ఇన్నర్ రింగ్ రోడ్లు వస్తాయని, దాంతో అభివృద్ధి పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. న్యూయార్క్, టోక్యో నగరాల స్థాయిలో ఫ్యూచర్ సిటీ రాబోతోందన్నారు. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు సమస్యలతో సతమతం అవుతున్నాయని, కాలుష్యం, ట్రాఫిక్, వర్షం నీటి ప్రవాహంతో అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారని, వాటన్నిటి కంటే హైదరాబాద్ అత్యుత్తమ స్థానంలో ఉందని చెప్పారు. విశ్వ నగరాల స్థాయికి చేరడానికి కాంగ్రెస్ హయాంలో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలో 250 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తున్నామని, కూరలు, పండ్లు, మాంసం నిల్వకు ఇక్కడ కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భాగ్యనగర అభివృద్ధితో సమాంతరంగా ఫ్యూచర్ సిటీ పనులు జరుగుతాయని చెప్పారు.

వరద నివారణకు నీటి సంపులు

గతంలో పెద్ద వర్షం వస్తే రాజ్ భవన్ నుంచి అనేక ప్రాంతాలు నీటిలో మునిగిపోయేవని, పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. అందుకే, నగరంలో వరద నీరు నిల్వ ఉండే 141 పాయింట్లను గుర్తించామని, అక్కడ వర్షపు నీటిని నిల్వ చేసి, తర్వాత వినియోగించేలా లక్షల లీటర్ల సామర్థ్యంతో భారీ నీటి సంపులు (వాటర్ హార్వెస్టింగ్ బెడ్స్) నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలో జరిగిందేనన్నారు.

కాలుష్యరహిత హైదరాబాద్.. మా కానుక: డిప్యూటీ సీఎం భట్టి

భవిష్యత్తు తరాలకు కాలుష్యం లేని హైదరాబాద్‌ను కానుకగా ఇవ్వనున్నామని, కాలుష్య పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంతోపాటు ఇతర చోట్ల 300పైగా మురికి వాడలు ఉన్నాయని, ఇక్కడి ప్రజలకు మెప్మా పథకం ద్వారా వడ్డీలేని రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ప్రపంచంలోని అనేక నగరాల్లో నదులను జీవ నదులుగా మలచుకోవడం ద్వారా అభివృద్ధి జరిగిందని, అలాగే, మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి జలాలను ఇక్కడ పారిస్తామని చెప్పారు. పరిశుభ్రమైన వాతావరణం, కలుషితం కానీ పర్యావరణం లక్ష్యంగా హైదరాబాద్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాలుష్యరహిత నగరంగా మార్చడానికే ఈవీ వెహికల్స్‌కు రాయితీలు ఇస్తున్నామని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని, మూసీ పునరుజ్జీవం ద్వారా ఇక్కడి ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు దొరుకుతాయని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

పెద్దపల్లికి సీఎం వరాల జల్లు

హైదరాబాద్, పెద్దపల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో బుధవారం యువ వికాసం కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పరిసర ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాలు జల్లు కురిపించారు. సుమారు రూ.500 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. రూ.51 కోట్ల అంచనా వ్యయంతో పెద్దపల్లిలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా విస్తరించేందుకు అవసరమైన పరిపాలనా అనుమతులను ప్రభుత్వం మంగళవారం జారీ చేసింది. అలాగే, మంథనిలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి, గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. పెద్దపల్లిలో నాలుగు లేన్ల బైపాస్ రహదారితోపాటు దాదాపు రూ.352 కోట్లతో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు అభివృద్ధి, రూ.10 కోట్ల అంచనాతో సబ్‌స్టేషన్ల పనులకు ఆమోదం లభించింది. పెద్దపల్లిలో రూరల్, మహిళ, ట్రాఫిక్ పోలీసుస్టేషన్లతోపాటు ఎలిగేడుకు మరో పోలీసు స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే, ఎలిగేడుకు ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీని మంజూరు చేసింది. రామగుండంలో నర్సింగ్ కళాశాలను ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రారంభం కానుంది.

9007 మంది ఉద్యోగ నియామక పత్రాలు

పెద్దపల్లిలో జరిగే సీఎం యువ వికాసం బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించేందుకు జిల్లా నేతలు ఏర్పాట్లు చేశారు. ఇక, సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటలకు సభాస్థలికి చేరుకుంటారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు. అనంతరం, గ్రూప్-3, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన 9,007 మందికి నియామక పత్రాలను అందిస్తారు. స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి ఏడు ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకుంటారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

కారడవిని కళ్లకు కట్టే వర్చువల్ వైల్డ్ సఫారీ

- కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లో నేడు ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అటవీ ప్రాంతంలో పులులు, సింహాలు, ఇతర జంతువులు సంచరిస్తున్నట్టుగా సందర్శకులు అనుభూతి పొందేలా అభివృద్ధి చేసిన 'వర్చువల్ వైల్డ్ సఫారీ'ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో బుధవారం ప్రారంభించనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రూ.5 కోట్లతో అటవీ శాఖ అధికారులు 'వర్చువల్ వైల్డ్ సఫారీ, వర్చువల్ ఎకో థీమ్ పార్క్'లను తీర్చిదిద్దారు. అటవీ సంపద వినియోగంపై అవగాహన కల్పించేందుకు సుమారు 96 ఎకరాల విస్తీర్ణంలో వృక్షపరిచయ క్షేత్రను అభివృద్ధి చేశారు.

మద్యం ధరలు పెంచేది లేదు!

స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధరలు పెంచాలంటూ మద్యం ఉత్పత్తిదార్లు ఒత్తిడి తెస్తున్నా, మద్యం అమ్మకాల నుంచి ఆశించినంత ఆదాయం రాకున్నా.. మద్యం ధరలు పెంచటానికి రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఈ మేరకు ధరల పెరుగుదల ఇప్పట్లో ఉండబోదని స్పష్టం చేసింది. ధరలు పెంచాలంటూ త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా.. ప్రభుత్వం తిరస్కరించినట్టు తెలిసింది. సాధారణంగా, రాష్ట్రంలో మద్యం ధరలు ఏటా పెరుగుతూ ఉంటాయి. ధరల పెంపు కోసం ప్రత్యేకంగా ఓ కమిటీ కూడా ఉంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో విశ్రాంత ఐఏఎస్, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. ప్రతీ రెండేళ్లకోసారి ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో మద్యం ధరలను, ఇక్కడ మద్యం తయారీ కంపెనీల కమీషన్లను అధ్యయనం చేస్తుంది. పెంపు ఎంతమేరకు ఉండాలనేది ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. రాష్ట్రంలో మద్యం ధరలు పెంచాలని నాలుగు నెలల క్రితమే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. బీర్ల ధరలు రూ.20 చొప్పున, ఇతర మద్యం ధరలు 700 మి.లీ.లకు రూ.30-40 చొప్పున పెంచాలని సిఫారసు చేసినట్టు సమాచారం. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాల ద్వారా రూ.25,617 కోట్ల ఆదాయాన్ని సమపార్జించాలని ప్రభుత్వం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు డిసెంబరు తర్వాత ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఇప్పటి వరకూ వచ్చిన ఆదాయం.. లక్ష్యానికి రూ.2 వేల కోట్ల దూరంలో ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో, ధరలు 5-10 శాతం పెంచినా.. లక్ష్యం సాధించడంతోపాటు అదనంగా రూ.5 వేల కోట్లు సమకూరే అవకాశాలున్నాయి. అయినప్పటికీ, ప్రభుత్వానికి మద్యం ధరలు పెంచే ఆలోచన లేదని స్పష్టమవుతోంది.

ఆదాయం కావాల్సినప్పుడల్లా పెంపు..

రాష్ట్రవ్యాప్తంగా 15 మద్యం తయారీ కేంద్రాలున్నాయి. రాష్ట్రంలో ఏటా 360-400 లక్షల లిక్కర్ కేసులు, 400-450 లక్షల బీర్ కేసులు విక్రయిస్తున్నారు.ఖజానాకు ఆదాయం కావాల్సినప్పుడల్లా ప్రభుత్వాలు ముందుగా ఆలోచించేది మద్యం ధరల పెంపునే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా మద్యం ధరలు పెంచుతూ పోయింది. ఓ ఏడాది బీర్ల ధరలు, మరో ఏడాది మద్యం ధరలు పెంచేవారు. చివరిసారిగా 2022 మే నెలలో బీర్ల ధరలు పెంచగా.. 2023 మే నెలలో లిక్కర్ ధరలు పెంచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఒక్కసారి కూడా ధరల పెంపు జరగలేదు. అయితే గత ప్రభుత్వంలాగా ఏటా ధరలు పెంచాలంటూ.. మద్యం ఉత్పత్తిదారులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. రెండేళ్ల క్రితం ఒక ఖాళీ బీరు సీసా ఉత్పత్తి ధర రూ. 5-6 ఉండగా.. ఇప్పుడు రూ.9కి పెరిగిందని, ఇతరత్రా నిర్వహణ వ్యయం కూడా పెరిగిందంటూ బీరు తయారీదార్లు చెబుతున్నారు. పెంపు భారం ప్రజలపై పడకుండా.. పన్నులు తగ్గించి తమ కమీషన్ పెంచాలని కోరుతున్నా సర్కారు అంగీకరించటం లేదు. ధరల పెంపుపై ఇప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోమని ప్రభుత్వం స్పష్టం చేసినట్టు తెలిసింది. మద్యం ఉత్పత్తిదారుల సంగతి ఎలా ఉన్నా.. మద్యం ప్రియులకు మాత్రం ఇది ఊరటనిచ్చే నిర్ణయమే.

రెరాతో 'బిల్డ్‌నౌ' అనుసంధానం

(మొదటిపేజీ తరువాయి)


బిల్డ్‌నౌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నిర్మాణాల అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం టీజీబీపాస్ స్థానంలో 'బిల్డ్‌నౌ' అనే కొత్త ఏకీకృత ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బిల్డ్‌నౌ ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కొత్త వ్యవస్థ గురించి వివరించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుత వ్యవస్థలో (టీజీబీపాస్) డ్రాయింగ్‌ల పరిశీలనకు రోజుల తరబడి సమయం పడుతుందని, హైరైజ్ భవనాల డ్రాయింగ్‌ల విషయంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆధునిక సాంకేతికతతో పనిచేసే బిల్డ్‌నౌ ద్వారా వినియోగదారులకు సులభతరమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రజలకు అంతరాయం లేని సేవలను అందిస్తామని తెలిపారు. బిల్డ్‌నౌ ద్వారా దేశంలోనే అత్యంత వేగంగా 5 నిమిషాల్లో డ్రాయింగ్ పరిశీలన పూర్తి అవుతుందన్నారు. దరఖాస్తులోనే జీవో నిబంధనలు తెలుసుకునేందుకు మూడు భాషల్లో (తెలుగు, ఆంగ్లం, ఉర్దూ) ఏఐ ఆధారిత సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నూతన విధానంలో నాన్ హైరైజ్ భవనాల ఆమోదానికి పట్టే సమయం 21 నుంచి 15 రోజులకు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ సమయాన్ని 15 నుంచి 10 రోజులకు తగ్గించామని చెప్పారు. మొబైల్ ఆధారిత సైట్ పరిశీలన యాప్ అందుబాటులోకి వస్తుందన్నారు. అధికారులు లేఅవుట్ నుంచే ఫొటోలు అప్‌లోడ్ చేయొచ్చని, సెట్‌బ్యాక్, రోడ్డు వెడల్పు వంటి రియల్‌టైం డేటాను అప్‌లోడ్ చేయడానికి అనుమతిస్తున్నామని తెలిపారు. కొత్తగా అమలు చేసే అప్లికేషన్‌ను రెరాతో అనుసంధానం చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపార వృద్ధికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని వెల్లడించారు. నూతన వ్యవస్థపై ఆర్కిటెక్ట్‌లు, ప్రభుత్వ అధికారులు, కాలనీల సంఘాల పెద్దలకు రాబోయే రెండు నెలల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు.


రూ.250 కోట్లకుపైగా ఆదాయం ఉన్న వారు అత్యధికం మనదగ్గరే

పురపాలక శాఖ ప్రగతి నివేదికను ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మీడియాకు వివరించారు. 60 శాతానికి పైగా జనాభా పట్టణాలు, నగరాల్లోనే ఉన్నారని తెలిపారు. ఈ శాఖకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీన్ని స్వయంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా రాష్ట్ర అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న విధానాలను మాత్రం ఆపబోమన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పని చేస్తోందని చెప్పారు. రూ.250 కోట్లకు పైగా ఆదాయం ఉన్న సంపన్నులు దేశంలోనే అత్యధిక (467) మంది హైదరాబాద్‌లోనే ఉన్నారన్నారు. తర్వాత స్థానంలో బెంగళూరు ఉందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందని.. అత్యధికంగా తీసుకుంటున్న గృహ రుణాలే దీనికి నిదర్శనమని వెల్లడించారు. ఐటీలో 9.7 లక్షల మంది నిపుణులు పని చేస్తున్నారని, దీనివల్ల ప్రపంచ స్థాయి కంపెనీలు వాటి కార్యకలాపాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుంటున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో కార్యాలయాల లీజు కోసం 34 మిలియన్ చదరపు అడుగుల స్థలం కావాలని, ఉద్యోగులకు మరో 1.30 లక్షల ఇళ్లు అవసరమవుతాయని తెలిపారు. టీజీబీపాస్ ద్వారా ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులకు రూ.750 కోట్ల ఆదాయం లభించిందన్నారు. రాష్ట్రంలో పురపాలక సంచాలకుల ఆధ్వర్యంలో 24 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రిచెప్పారు.

పుష్ప-2 టికెట్ ధరలపై స్టే ఇవ్వలేం

ప్రభుత్వమే అనుమతి ఇచ్చినప్పుడు మేమేం చేయగలం?.. అర్ధరాత్రి బెనిఫిట్ షోలతో పిల్లల పరిస్థితి ఏంటి?

- ప్రభుత్వ భూములు తీసుకుని ఏం రాయితీలు ఇస్తున్నట్లు?
- పది మందితో సినిమాకు వెళ్తే 8 వేల ఖర్చా? : హైకోర్టు
- కౌంటర్ దాఖలుకు నిర్మాతకు ఆదేశం.. విచారణ 17కు వాయిదా
- పుష్ప-2తో స్మగ్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని మరో పిటిషన్



హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా క్రేజ్ సంతరించుకున్న పుష్ప-2 టికెట్ ధరలను భారీగా పెంచడంపై తక్షణం స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. టికెట్ ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వమే స్వయంగా అనుమతిస్తే తామేం చేయగలమని ప్రశ్నించింది. అయితే కుటుంబంతో సినిమాకు వెళ్లాలంటే అవుతున్న ఖర్చుపై ఆందోళన వ్యక్తం చేసింది. పది మంది సినిమాకు వెళ్తే రూ.8 వేలు ఖర్చవుతోందని వ్యాఖ్యానించింది. అర్ధరాత్రి, తెల్లవారు జామున ప్రదర్శిస్తున్న బెనిఫిట్ షోలకు పిల్లలు వెళ్తే వారికి వచ్చే అనారోగ్యం పరిస్థితేంటని ప్రశ్నించింది. ప్రభుత్వ భూములు తీసుకుని నిర్మించిన థియేటర్లు, ఆస్పత్రులు రాయితీలు ఇస్తామని ఒప్పందాలు చేసుకుని వాటిని అమలు చేయడం లేదని వ్యాఖ్యానించింది. పుష్ప-2 సినిమా టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వడంతోపాటు అర్ధరాత్రి ఒంటి గంటకు, తెల్లవారు జామున 4 గంటలకు ఆరు, ఏడు షోల ప్రదర్శనకు అనుతివ్వడం అక్రమమని, ప్రభుత్వానికి ఆ అధికారం లేదని పేర్కొంటూ చందానగర్‌కు చెందిన సతీశ్ కమాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది పి.శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. టికెట్ రేట్లపై అదనంగా వసూళ్లకు అనుమతినివ్వడం అక్రమమని తెలిపారు. పెంచిన ఆదాయం దానధర్మాలకు ఇవ్వడం లేదని, నిర్మాత జేబుల్లోకి వెళ్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో చలి ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ చెప్పిన నేపథ్యంలో అర్ధరాత్రి, తెల్లవారు జామున అదనపు షోలు ప్రమాదకరమని పేర్కొన్నారు.

నిర్మాత నష్టపోకుండా ఉండాలనే..

మైత్రీ మూవీస్ తరఫున న్యాయవాది వాదిస్తూ చాలా ఎక్కువ బడ్జెట్ పెట్టి తీసిన సినిమా అని, నిర్మాత నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే కొద్దిరోజులపాటు ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందని తెలిపారు. బెనిఫిట్ షోలు కేవలం అభిమానుల కోసం మాత్రమేనని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా మైత్రీ మూవీస్‌కు ఆదేశాలు జారీ చేస్తూ విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. కాగా, పుష్ప-2 సినిమా ద్వారా స్మగ్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని, సమాజానికి చెడు సందేశం ఇస్తున్న సినిమాను అడ్డుకోవాలంటూ సికింద్రాబాద్‌కు చెందిన సరారపు శ్రీశైలం అనే వ్యక్తి హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మౌసమీ భట్టాచార్య.. సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిన తర్వాత సినిమాను అడ్డుకోవాలని కోరడం ద్వారా పిటిషనర్ కోర్టు టైం వృథా చేశారంటూ జరిమానా విధించారు. ఈ జరిమానా ఎంత అనేది తెలియజేస్తామని, దీనిని అక్రమ రవాణా బాధితులు, మహిళలు, పిల్లల కోసం ఖర్చు పెట్టాలని పేర్కొన్నారు. కేవలం టీజర్ చూసి ఊహించుకుని చివరి నిమిషంలో సినిమా అడ్డుకోవాలని పిటిషన్ వేయడం సమంజసం కాదని, సినిమాను అడ్డుకుంటే నిర్మాత, డైరెక్టర్ తీవ్రంగా నష్టపోతారని వ్యాఖ్యానించారు.

మంత్రులు.. ఎమ్మెల్యేల ఫోన్లనే ఎత్తడం లేదు

» ప్రజావాణి నవ్వులాటలా మారింది

» ఏడాది పాలనకు 60 మార్కులు: కూనంనేని

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "ఎమ్మెల్యేలు ఫోన్లు చేసినా మంత్రులు ఎత్తడం లేదు. అధికారులదీ అదే తీరు. ప్రభుత్వం ఇనుప కంచెలు కూల్చి ప్రారంభించిన ప్రజావాణి నవ్వులాటలా మారింది" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ ఏడాది పాలనపై విమర్శలు సంధించారు. మంత్రులు ప్రజలతో మమేకం కావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రోజూ ఒక గంట ప్రజలను కలవాలని కోరారు. ప్రభుత్వంలో సమన్వయ లోపం కనిపిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కుదిరిన అవగాహన మేరకు కార్పొరేషన్ పదవులు సీపీఐకి కూడా ఇవ్వాల్సి ఉన్నా.. కాంగ్రెస్ మిత్రధర్మం పాటించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనకు సీపీఐ 60 మార్కులు ఇస్తుందని చెప్పారు.

యాసంగిలో 42.11 లక్షల ఎకరాలకు నీరు

యాసంగి(రబీ)లో ప్రాజెక్టుల కింద 42.11 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద వ్యవసాయ భూములకు 365.28 టీఎంసీల నీటిని విడుదల చేయనుంది. ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ(స్కీవమ్) సమావేశం జరిగింది. జలాశయాల్లో నీటి లభ్యత, ఏ మేరకు సాగునీటి అవసరం ఉందనే అంశాలపై చర్చించారు. 42,11,477 ఎకరాలకు సాగునీటిని అందించనుండగా.. అందులో 24,19,274 ఎకరాల్లో వరి పంటకు, మిగతా 17,92,203 ఎకరాల్లో ఆరుతడి పంటలకు నీళ్లివ్వనున్నారు.

పశువైద్య వర్సిటీలో అనర్హులకు అందలం

» నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతా రాయ్

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయంలో అనర్హులను అందలమెక్కిస్తూ, అర్హులకు అన్యాయం చేస్తున్నారని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతా రాయ్ ఆరోపించారు. జూనియర్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ శరత్‌చంద్రను రిజిస్ట్రార్‌గా నియమించారని, యూనివర్సిటీలో అతనికంటే సీనియర్లు 21 మంది ఉన్నారని తెలిపారు. కొత్త రిజిస్ట్రార్ వచ్చీరాగానే అక్రమ నియామకాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు.

దిష్టిబొమ్మల్లా ఇద్దరు కేంద్ర మంత్రులు: చనగాని

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు దిష్టి బొమ్మల్లా ఉన్నారని టీపీసీసీ అధికారు ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల వల్ల తెలంగాణకు ఎటువంటి ఉపయోగం లేదని విమర్శించారు. 2019 నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. రాష్ట్రానికి ఒక్క జాతీయ ప్రాజెక్టు అయినా తెచ్చారా? అని ప్రశ్నించారు. జెండాలు వేరే అయినా.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అజెండా ఒక్కటేనని మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి అన్నారు.

నేడు హైటెక్స్‌లో మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి కార్యక్రమం బుధవారం హైటెక్స్‌లో జరగనుంది. రోశయ్య మెమోరియల్ ఫోరం, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పాల్గొననున్నారు.

44 మంది సహాయ కార్యదర్శుల బదిలీ

సచివాలయంలో పనిచేస్తున్న 44 మంది సహాయ కార్యదర్శులను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీర్ఘకాలం ఒకే శాఖలో కొనసాగుతున్న వారిని, ప్రాధాన్య శాఖల్లోనే ఎక్కువ సర్వీస్ ఉన్న వారిని బదిలీ చేశారు. పాలనాపరమైన అవసరాల రీత్యా ఈ బదిలీలు వెంటనే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డిసెంబరు 14న అనంత వేదికగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

ప్రతి మనిషికి ఒకే విలువ అన్న మౌలిక భావనతో వివిధ సామాజిక వర్గాల మధ్య కొనసాగే అసమానతలను, వివక్షలను, కులగణనను, బస్తర్‌లో జరుగుతున్న హింసాకాండను చర్చించేందుకు ఏపీలోని అనంతపురం కేంద్రంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర 10వ మహాసభలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 14, 15 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, మేధావులు హాజరుకావాలని కోరారు. అనంతపురంలోని సాయినగర్ అంబేడ్కర్ భవన్‌లో ఈ సమావేశాలు ఉంటాయని తెలిపారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అవకాశమివ్వాలి

» రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బీసీలు మాత్రమే ఉన్నారని, త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలు, మైనారిటీలకు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన అఖిల భారత సామాజిక న్యాయ సమాఖ్య 3వ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలో చేపడుతున్న కుల గణనలో బీసీ గణన చేయాలని కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీలకు చెందిన పదివేల ఉద్యోగాలు ఈడబ్ల్యూఎస్ కోటాలో దోచుకున్నారని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి దక్కాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. కుల గణనలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ పెట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది సంబరాలను గ్రామాల్లో జరుపుకోవాలని, అప్పుడే ప్రజా సమస్యలు తెలుస్తాయని ఆయన అన్నారు.

ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు గ్రీన్ సిగ్నల్

» జీవో 317 దరఖాస్తుల పరిశీలనకు సర్కారు ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు రంగం సిద్ధమైంది. పరస్పర బదిలీల కోసం అర్జీలు పెట్టుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిశీలించి, వారి నుంచి వ్యక్తిగత పూచీ తీసుకొని, తదుపరి బదిలీ ఉత్తర్వులు విడుదల చేయడానికి అనుగుణంగా వివరాలు పంపించాలని పాఠశాల విద్య డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనిప్రకారం పరస్పర బదిలీలకు అంగీకారం తెలుపుతున్నట్లు ఇద్దరు ఉపాధ్యాయులు తమ పేరు, ఐడీ నంబరు, మొబైల్ నంబరు, హెచ్‌వోడీ వివరాలతో పాటు ప్రస్తుత స్థానిక క్యాడర్, దరఖాస్తు(వెళ్లాలనుకున్న) కొత్త క్యాడర్ వివరాలు పొందుపరిచి, ఇద్దరు ఒకే పత్రంపై సంతకాలు చేసి, అండర్‌టేకింగ్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా విద్యా శాఖాధికారులు ఆయా ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిశీలించి, సమగ్ర వివరాలను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది.

మంథని, గుంజపడుగులో కొత్త ఆస్పత్రులు

» పెద్దపల్లి 50 పడకల ఆస్పత్రి 100 పడకలకు అప్‌గ్రేడ్

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యం వైద్యానికేనని సోమవారం జరిగిన ఆరోగ్య ఉత్సవాల్లో చెప్పిన వైద్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ.. మంగళవారమే రెండు కొత్త ఆస్పత్రుల ఏర్పాటు, మరో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అదే జిల్లా గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు జీవోలు జారీ చేశారు. ఈ రెండు ఆస్పత్రులకు కలిపి సుమారు రూ.25 కోట్లు కేటాయించారు. బుధవారం పెద్దపల్లిలో జరిగే ప్రజా పాలన విజయోత్సవాల సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆస్పత్రులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. పెద్దపల్లిలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం రూ.51 కోట్లు కేటాయించారు.

కిలేడీ వలపు వలకు బలైన ఎస్సై హరీశ్?

» ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లికి ఒత్తిడి తేవడంతోనే అఘాయిత్యం

» గతంలో ముగ్గురు యువకులను ప్రేమ పేరుతో బ్లాక్‌మెయిల్



ఎస్సై హరీశ్ (ఫైల్)

ములుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ (29) ఆత్మహత్య ఘటన నిగ్గు తేల్చేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తున్నాయని సమాచారం. ముళ్లకట్ట అంతర్రాష్ట్ర వంతెన పక్కనే ఉన్న ప్రైవేట్ రిసార్టులో ఎస్సై హరీశ్ సోమవారం ఉదయం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గదిలో ఓ యువతి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే రక్తపు మడుగులో విగతజీవిగా ఉన్న హరీశ్ మృతదేహంపై ఓ యువతి పడి రోదించిన ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఘటన అనంతరం పేరూరు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన ఎలా జరిగింది? ఆ సమయంలో అక్కడ ఆమె ఎందుకు ఉందనే అంశాలపై విచారించారు. ఈ క్రమంలో పలు విస్తుపోయే విషయాలు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ యువతి సూర్యాపేట జిల్లా వాస్తవ్యురాలిగా గుర్తించారు. అక్కడి పోలీసులను సంప్రదించగా సదరు యువతి గతంలో ముగ్గురు యువకులకు ప్రేమపేరుతో దగ్గరై పెళ్లికి ఒత్తిడి చేసి వారు ఒప్పుకోకపోవడంతో కేసులు పెట్టించినట్లు తేలింది. ఈమె వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అతడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆమెపై ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసు నమోదైనట్లు సమాచారం. సమాజంలో పలుకుబడి, ఆర్థికంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని లొంగదీసుకోవడమే పనిగా పెట్టుకున్న ఆ యువతి ఏడాది క్రితం ఎస్సై హరీశ్‌కు ఫోన్‌లో కాంటాక్ట్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి ప్రేమకు దారితీసిందని, అయితే ఆమె గురించి అసలు విషయాలు తెలియడంతో ఆమెతో పెళ్లికి హరీశ్ నిరాకరించాడని సమాచారం. ఈ క్రమంలోనే హరీశ్ కుటుంబసభ్యులు చూసిన సంబంధాన్ని చేసుకునేందుకు అంగీకరించాడని, కానీ తనను పెళ్లి చేసుకోకుంటే రోడ్డుకీడుస్తానని, ఇప్పుడు తాను గర్భవతినని సదరు యువతి హరీశ్‌ను భయపెట్టడంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆయన ఎక్కడ పరువుపోతుందోననే బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఎస్సై హరీశ్ మృతిపై తొలుత అనేక ఊహాగానాలు వినిపించాయి. ఉన్నతాధికారుల వేధింపులు, పని ఒత్తిడి అంటూ ప్రచారమైంది. ఈ నేపథ్యంలో ఆయన మరణానికి దారి తీసిన పరిస్థితులను నిగ్గుతేల్చేందుకు పోలీసు అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట యువతి అసలు బండారం బయటపడింది. కాగా, ఆ యువతిని సోమవారం సాయంత్రమే ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను ఎస్కార్ట్‌గా ఇచ్చి దూద్యాతండాకు తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుశాఖలో ఉజ్వల భవిష్యత్తు ఉన్న హరీశ్ జీవితం విషాదంగా ముగిసిపోవడం కుటుంబసభ్యులను, సన్నిహితులను తీవ్రంగా కలచివేస్తోంది.

బంధాలను బలిచేస్తూ.. కత్తులతో చెలరేగి వేట

(మొదటిపేజీ తరువాయి)



తలెత్తుకోలేకపోతున్న తాము ఆమెనో, ఆమె భర్తనో చంపేస్తే తప్ప మళ్లీ గర్వంగా తలెత్తుకోలేమంటూ ఉన్మాదులుగా మారిపోతున్నారు. అమ్మాయిని, దొరికితే అల్లుడిని కత్తులు, వేటకొడవళ్లతో నరికి చంపడమో.. పెట్రోలు పోసి తగులబెట్టడమో చేస్తున్నారు. కొందరైతే లక్షలు పోసి ప్రత్యేకంగా సుపారీ గ్యాంగుల్ని రంగంలోకి దించి చంపేయిస్తున్నారు. ఇలాంటి కులోన్మాద, మతోన్మాద హత్యలు రాష్ట్రంలో పెరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హత్యలు చేసి కుటుంబసభ్యులు జైలుపాలవుతుంటే.. బిడ్డ అత్తింటివారు తీవ్ర మానసిక వేదనతో బతుకులు వెళ్లదీస్తున్నారు. రెండు రోజుల క్రితం హయత్‌నగర్‌లో కానిస్టేబుల్ నాగమణి హత్యతో మరోసారి రాష్ట్రంలో కులోన్మాద, మతోన్మాద హత్యల వ్యవహారం చర్చకు దారితీసింది. అప్పట్లో నల్లగొండ జిల్లాలో ప్రణయ్, అమృత ప్రేమ-పెళ్లి విషయంలో జరిగిన ఘోరాన్ని తెలంగాణ సమాజం ఇంకా మరిచిపోలేదు. వేరే కులం యువకుడిని పెళ్లి చేసుకుని తన పరువు తీసిందనే కోపంతో అమృత తండ్రి మారుతి రావు రూ. 50 లక్షలకు సుపారీ ఇచ్చి ప్రణయ్‌ని హత్య చేయించాడు. తన సోదరి వేరే మతస్థుడిని ప్రేమించి పెళ్లిచేసుకోవడంతో కుటుంబం పరువు పోయిందని భావించిన ఓ సోదరుడు స్నేహితులతో కలిసి సరూర్‌నగర్ ప్రాంతంలో నాగరాజు అనే వ్యక్తిని అందరు చూస్తుండగానే అత్యంత దారుణంగా చంపేశాడు. కులం తక్కువ యువకుడిని అమ్మాయిని పెళ్లి చేసుకుందనే ఆగ్రహమే కాదు.. ఆర్థికంగా తమకన్నా తక్కువ స్థాయి కుటుంబం వాడితో వెళ్లిపోయిందనే కోపమూ ఇలాంటి హత్యలకు దారితీస్తోంది.

ఉరేసరి అంటున్న అత్యున్నత న్యాయస్థానం

కులోన్మాద, మతోన్మాద హత్యలు పెరిగిపోతుండటంపై గతంలోనే సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ తరహా ఘటనలు దేశానికి కళంకం అని ఆటవిక, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నం అని, వాటికి ముగింపు పలకాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కులోన్మాద, మతోన్మాద హత్య కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించేందుకు వీలుగా వాటిని అత్యంత అరుదైన కేసులుగా పరిగణించాలని న్యాయస్థానాలకు సూచిస్తూ సంచలనాత్మక తీర్పును సుప్రీంకోర్టు గతంలో వెలువరించింది. పెళ్లయినప్పటికీ భర్తను వదిలేసిన తన కుమార్తె సీమ వావివరసలు మరచి వరుసకు సోదరుడయ్యే యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకొందని తెలిసి, ఆమె తండ్రి, ఢిల్లీకి చెందిన తండ్రి భగవాన్‌దాస్ కోపంతో రగిలిపోయి ఆమెను హత్య చేశాడు. ఈ కేసును విచారించిన ఢిల్లీ సెషన్స్ కోర్టు దాస్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీన్ని ఆయన సుప్రీం కోర్టులో సవాల్ చేశాడు. విచారించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మార్కండేయ కట్జు, జస్టిస్ జ్ఞాన్ సుధా మిశ్రాలు భగవాన్‌దాస్ పిటిషన్‌ను కొట్టివేశారు. తమ తీర్పును వెలువరిస్తూ పరువు హత్యలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. 'పరువు' హత్యల్లో 'పరువు' ఏమాత్రం లేదని, అవి భూస్వామ్య మనస్తత్వం, మూర్ఖపు పట్టుదలతో చేస్తున్న ఆటవిక, దారుణ హత్యలని తాము ఇప్పటికే స్పష్టం చేశామని ధర్మాసనం తేల్చి చెప్పింది. పరువు/కులోన్మాద హత్యలకు భవిష్యత్తులో మరణ శిక్ష విధించాలని, కేసులో తీర్పు ఇస్తూ ఆ కాపీలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని హైకోర్టులు, సెషన్స్ కోర్టులు, చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు పంపించాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసింది.

పీకలదాకా మద్యం తాగి నేరాలు

పగ, ప్రతీకారంతో రగిలిపోతున్నా కూడా కన్నబిడ్డనో, సోదరినో వేటకొడవలితో నరికి చంపాలంటే చేతులు ఎలా వస్తాయి? అందుకే మొండి ధైర్యాన్ని కూడ గట్టుకొని.. చంపేసేందుకు ఉన్మాదులు వేటకొడవళ్లు పట్టుకునే ముందే ఫూటుగా మద్యం తాగుతున్నారు. ఆ మత్తులో నేరాలకు ఒడిగడుతున్నారు. ఈ క్రమంలో బాధితురాళ్లను కాపాడే క్రమంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపైనా విచక్షణారహితంగా దాడులకు తెగబడుతున్నారు. ఆ మధ్య అమీర్‌పేట్‌లో కూతురు, అల్లుడిపై మద్యం మత్తులోనే మనోహరాచారి అనే వ్యక్తి కొబ్బరిబోండాం కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. పోలీసులు అదుపులోకి తీసుకొని.. మద్యం మత్తు దిగాక తాను చేసిన ఘోరంపై పశ్చాత్తపం వ్యక్తం చేశాడు. అత్తాపూర్ ఘటనలోనూ ఇద్దరు నిందితులు చిత్తుగా మద్యం సేవించి ప్రత్యర్థిని గొడ్డలితో దారుణంగా చంపేశారు.

దారుణాలెన్నో...

- 2018లో ప్రేమించి పెళ్లి చేసుకున్న కూతుర్ని తల్లిదండ్రులు గర్భిణి అని కూడా చూడకుండా గొంతుకోసి హత్య చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. స్థానికంగా ఉండే సురేశ్, ఇంటిపక్కనే ఉండే విజయలక్ష్మి ప్రేమించుకున్నారు. పెద్దల్ని ఎదురించి పెళ్లిచేసుకున్నారు. వీరికి 4 ఏళ్ల బాబుకాగా విజయలక్ష్మి ఏడు నెలల గర్భిణి. పరువు పోయిందన్న కోపంతో నాలుగు సంవత్సరాలుగా పగతో ఉన్న విజయలక్ష్మి కుటుంబ సభ్యులు గత నెలలో ఆమెపై దాడి చేసి హత్య చేశారు.
- 2017లో ప్రేమ పెళ్లి చేసుకున్నారనే కోపంతో భార్య, భర్తలను అత్యంత దారుణంగా నరికి చంపారు. వేములవాడలో ఈ దారుణం జరిగిందది. హరీశ్, రచన ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్న రెండు నెలలకే రచన మేనమామలు హరీశ్, రచనలను వారి ఇంట్లోనే నరికి చంపారు.
- 2017 కుమార్తెను ప్రేమించాడనే ఆగ్రహంతో పేదింటి యువకుడిని ఓ రియల్టర్ పథకం ప్రకారం హతమార్చాడు. కిరాయి హంతకులతో కలిసి ఈ దారుణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా తాండూరులోని సాయిపూర్‌కు చెందిన బెస్త యాదప్ప అదే ప్రాంతానికి చెందిన ఓ రియల్టర్ కూతుర్ని ప్రేమించాడు. అమ్మాయి తండ్రి పరువు పోతుందనే ఉద్దేశంతో కిరాయి హంతకులతో యాదప్పను హత్య చేయించాడు.
- కులాంతర వివాహం చేసుకుందనే కారణంతో కన్న కూతుర్ని గొడ్డలితో నరికి చంపాడో తండ్రి. ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతుర్తి గ్రామానికి చెందిన స్వప్న, అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అత్తారింట్లో ఉన్న స్వప్నను రాఖీ కట్టేందుకంటూ పథకం ప్రకారం ఇంటికి తీసుకెళ్లి తండ్రి గొడ్డలితో నరికి చంపాడు.

శిక్షలు తీవ్రంగా ఉంటాయి : హైకోర్టు న్యాయవాది

"పరువు హత్యల్లో చట్టప్రకారం శిక్షలు తీవ్రంగా ఉంటాయి. కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ చట్టం కింద నిందితుడికి జీవిత ఖైదు, తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే మరణశిక్ష కూడా పడే అవకాశం ఉంటుంది. హత్యలో నేరుగా పాల్గొన్న వారికే కాకుండా ఇందుకు ప్రోత్సహించినవారు, సహకరించిన వారికి కూడా చట్టప్రకారం ఒకేరకమైన శిక్షలు అమలవుతాయి. ఈ తరహా కేసుల నుంచి బయట పడటం న్యాయపరంగా అంత సులువుకాదు. సమాజంలో చైతన్యంతోనే పరిస్థితిలో మార్పు వస్తుంది. ప్రేమ పెళ్లి చేసుకున్న వారు ఎవరైనా తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఫిర్యాదు ఇస్తే పోలీసులు సత్వరం స్పందించాలి." అని హైకోర్టు ప్రముఖ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తెలిపారు.

మనసులో బలంగా నాటుకుపోవడంతోనే: డాక్టర్ అనిత

"ఈ తరహా దారుణాలకు తెగబడే వారికి ఎదుటి వారిని తుద ముట్టించాలనే విషయం మెదడు, మనస్సులో బలంగా నాటుకుపోతుంది. చిన్నప్పటి నుంచి తమ ఇంట్లో ఉన్న అమ్మాయి, అబ్బాయి ఒక్కసారిగా తమకు నచ్చని విధంగా వ్యవహరించడంతో ఇంట్లో వారి అహం దెబ్బతింటుంది. సమాజానికి సమాధానం చెప్పడం ఇబ్బందికరంగా మారడంతో ప్రతీకార చర్యలకు సిద్ధమవుతారు. అదే పనిగా నేరాలు చేసేవారి మానసిక పరిస్థితికి. ఈ తరహా పరువు దాడులకు పాల్పడే వారి మానసిక స్థితికి చాలా తేడా ఉంటుంది. వీరి లక్ష్యం సింగిల్ టార్గెట్. విపరీతమైన కోపంతో ఎదుటి వారిపై విచక్షణా రహితంగా దాడి చేయడం, హత్య చేయడం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ధైర్యం సరిపడక మద్యం, ఇతర మత్తుపదార్థాల్ని తీసుకుంటారు." అని ఎర్రగడ్డ మానసిక చికిత్సా కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు.

ఎకరం తిరిగివ్వాలని నాగమణి ఒత్తిడి చేయడంతోనే!

» కులాంతర వివాహం, ఆస్తి తగాదాతోనే మహిళా కానిస్టేబుల్ హత్య

» నిందితుడు పరమేశ్‌కు సహకరించిన స్నేహితుడు శివ

» నాగమణి కదలికలపై ఫోన్లో పరమేశ్‌కు సమాచారం



పోలీసుల అదుపులో నిందితుడు పరమేశ్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపోల్‌లో పోలీస్ కానిస్టేబుల్ కొంగర నాగమణిని పథకం ప్రకారమే తమ్ముడు పరమేశ్ హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సంచలనం రేపిన ఈ హత్యకు కులాంతర వివాహం, ఆస్తి తగాదాలే కారణం అని తేల్చారు. ఈ హత్యకు సంబంధించి వివరాలతో కూడిన ప్రకటనను సీఐ సత్యనారాయణ మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. నిందితుడు పరమేశ్‌ను మంగళవారం ఉదయం రాయపోల్ సమీపంలోని జనహర్ష ఫాం ల్యాండ్స్ పరిసరాల్లో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. నిందితుడు పరమేశ్‌కు ఇద్దరు అక్కలు. పెద్ద అక్క హైమావతికి 2009లో వివాహం కాగా తన కుటుంబంతో ఆమె తుర్కయాంజాల్ ఉంటోంది. పదేళ్ల క్రితమే వీరి తల్లిదండ్రులు పద్మ, రమేశ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత పరమేశ్, నాగమణి.. నాయనమ్మ యాదమ్మతో కలిసి ఉంటున్నారు. 2014లో నాగమణికి ఎంపీ పటేల్ గూడకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో పసుపు, కుంకుమల కింద ఎకరా పొలం రాసిచ్చారు. భర్తతో మనస్పర్థలు రావడంతో నాగమణి భర్తకు దూరంగా హయత్‌నగర్‌లోని హాస్టల్లో ఉంటూ కోచింగ్ తీసుకుని 2020లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. ముందు పోస్టింగ్ కుషాయిగూడ కాగా, ఆ తర్వాత హయత్‌నగర్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తోంది. 2022లో భర్తతో విడాకులు తీసుకుంది. రాయపోల్‌లో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన బండారి శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. విషయం తెలిసి ఊర్లో పరువు పోతుందని అతడితో స్నేహం వద్దని తమ్ముడు పరమేశ్ పలుమార్లు ఆమెను హెచ్చరించారు. ఆమె వినకపోవడంతో అప్పట్లో పసుపు, కుంకుమల కింద ఇచ్చిన ఎకరం భూమి తనకివ్వాలంటూ ఒత్తిడి తెచ్చి పరమేశ్ తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత గత నెల 10న యాదగిరిగుట్ట వద్ద నాగమణి, శ్రీకాంత్‌ను వివాహం చేసుకుంది. వీరు వనస్థలిపురం ఏరియా సహారా ఎస్టేట్స్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అయితే అప్పట్లో తనకిచ్చిన ఎకరం భూమిని తిరిగి ఇవ్వాలంటూ నాగమణి తమ్ముడిపై ఒత్తిడి తేవడం మొదలెట్టింది. అసలే కులాంతర వివాహం చేసుకుని తనకు తలవంపులు తేవడమేగాక తిరిగి భూమి కావాలంటూ ఒత్తిడి తేవడాన్ని పరమేశ్ జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా ఆమెను మట్టుబెట్టాలనే నిర్ణయానికి వచ్చి అదనుకోసం వేచిచూడడం మొదలెట్టాడు.

గ్రామానికి వచ్చినట్లు తెలుసుకుని..

పెళ్లైన తర్వాత నాగమణి భర్తతో కలిసి ఆదివారం అత్తారింటికి వచ్చిందని తెలుసుకుని ఎలాగైనా ఆమెను మట్టుబెట్టాలని పరమేశ్ పథకం వేశాడు. అతడి స్నేహితుడైన అచ్చన శివ ద్వారా ఆమె కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నాడు. సోమవారం ఉదయం భర్త శ్రీకాంత్ ముందుగానే డ్యూటీకని నగరానికి బయలుదేరగా, తర్వాత నాగమణి ఉదయం 8.30గంటలకు తన స్కూటీపై డ్యూటీకి హయత్‌నగర్ బయలుదేరింది. ఈ విషయాన్ని శివనే ఫోన్లో పరమేశ్‌కు సమాచారమిచ్చాడు. ఆ ప్రకారం నాగమణిని కారులో వెంబడించిన పరమేశ్ మాన్యగూడ రోడ్డు సబ్‌స్టేషన్ వద్ద కారుతో స్కూటీని ఢీకొట్టాడు. ఆమె కింద పడిపోగానే కారులోంచి వేటకొడవలితో కిందకు దిగి.. మెడపై, ముఖంపై నరికాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాగా నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. అతడు ఉపయోగించిన వేట కొడవలి, ఐ-ఫోన్-15, మహీంద్రా ఎక్సయూవీ కారునును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగమణి కదలికలను చేరవేసిన శివను ఈ కేసులో ఏ-2గా చేర్చి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.